www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ANDHRAJYOTHI
సోమవారం | 24-2-2025 | పేజీలు: 12 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 310
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి మ. 1.45 తదుపరి ద్వాదశి; నక్షత్రం: పూర్వాషాఢ రా. 6.59 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: రా. 2.49-4.23; దుర్ముహూర్తం: మ. 12.51-1.37, మ. 3.10-3.57; అమృతఘడియలు: మ. 2.07-3.44; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.40; సూర్యాస్తమయం: 6.16
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విద్యార్థులతో వంట పని


నెల్లూరు జిల్లా గండిపాళెం గురుకుల పాఠశాలలో చపాతీలు చేస్తున్న విద్యార్థులు

తెల్లవారుజామున 3 గంటల నుంచి చపాతీల తయారీ
నెల్లూరు జిల్లా గండిపాళెం గురుకుల పాఠశాలలో వెలుగులోకి
ప్రతి ఆదివారమూ చేస్తారంటున్న ప్రిన్సిపాల్ **3**

గౌరవ.. సభ!

రచ్చ కాదు.. చర్చకు వేదిక కావాలి

గత సంప్రదాయాలను పునరుద్ధరించాలి
గతంలో ఏడాదికి 60 రోజులు సమావేశాలు
వైసీపీ హయాంలో 30-40 రోజులతో సరి
బడ్జెట్‌లో పద్దులపై చర్చలు జరిగిందే లేదు
మొక్కుబడిగా ప్రశ్నోత్తరాలు, జీరో అవర్
నాడు.. దాడి, బూతులు, దూషణలతో రచ్చ
నేడు.. సభ ప్రతిష్ఠను నిలబెట్టాల్సిన అవసరం

నేడు గవర్నర్ ప్రసంగంతో శ్రీకారం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

శాసనసభ బడ్జెట్ సమావేశాలకు సోమవారమే శ్రీకారం! గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంతో సభ లాంఛనంగా ప్రారంభమవుతుంది. సుమారు 20 పనిదినాలు అసెంబ్లీ నిర్వహించే అవకాశముందని తెలుస్తోంది. అదే సమయంలో... శాసనసభకు సంబంధించి గత సంప్రదాయాలను పునరుద్ధరించే బాధ్యత కూడా కూటమి సర్కారుపై ఉందనే అభిప్రాయం వినిపిస్తోంది. జగన్ హయాంలో ఐదేళ్లపాటు శాసనసభ అంటే 'చర్చకు కాదు, రచ్చకు వేదిక' అన్నట్లుగా మారింది. చంద్రబాబుతోపాటు నాటి విపక్ష నేతలపై విరుచుకుపడటం, బూతులతో దాడి చేయడం, నోరెత్తకుండా మైకులు కట్టేయడం... ఇదీ పరిస్థితి! చివరికి.. 'ఇది కౌరవ సభలా మారింది. గౌరవ సభలా మారేదాకా ఇక్కడ అడుగు పెట్టను' అంటూ చంద్రబాబు ప్రతిజ్ఞ చేసి మరీ బయటికి వచ్చేశారు. అన్నట్లుగానే ముఖ్యమంత్రి హోదాలో మళ్లీ సభలో

మిగతా 12వ పేజీలో...

నేటి నుంచి శాసనసభ సమావేశాలు! హోరాహోరీగా వాదనలు... ప్రతిపక్షం ఆందోళనలు... అది శ్రుతిమించితే సస్పెన్షన్లు... వీటన్నింటితోపాటు ప్రజా సమస్యలు, పద్దులు, బిల్లులపై అర్థవంతమైన చర్చలు! ఇవన్నీ కలిపితేనే 'గౌరవ' శాసన సభ! కానీ... వైఎస్ జగన్ హయాంలో అసెంబ్లీకి అర్థమే మారిపోయింది. సభ అంటే చర్చ కాదు, రచ్చ అనే పేరు స్థిరపడింది. కూటమి సర్కారులోనైనా ఈ పద్ధతి మారాలని... సభకు పూర్వగౌరవం రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



ప్రజావాణి వినిపిద్దాం



పార్టీ సభ్యులు చర్చల్లో చురుగ్గా పాల్గొనాలి
సభలో మాట్లాడే భాష హుందాగా ఉండాలి
జనసేన ఎమ్మెల్యేలకు పవన్ దిశానిర్దేశం **12**

కట్టుదిట్టమైన భద్రత



మంత్రుల పీఏలకు అనుమతి లేదు
సీఎంను కలిసేవారు సీఎంవోకే వెళ్లాలి
శాసనసభ స్పీకర్ అయ్యన్న ఆదేశాలు

20 రోజులపాటు బడ్జెట్ సెషన్!?

ఒక్క రోజుతో సరి?



నేడు మాత్రమే సభకు జగన్?
అనర్హత తప్పించుకోవడానికే!!
గవర్నర్ ప్రసంగానికి హాజరు
అంతకుముందు వైసీపీఎల్పీ భేటీ
ఫైర్ ఆఫీసు నుంచి కాలి నడకన అసెంబ్లీ ప్రాంగణంలోకి!
బడ్జెట్ సమావేశాలకు రావడంపై స్పష్టత ఇవ్వని ముఖ్య నేతలు


మోదీకి జ్ఞాపిక అందిస్తున్న బాగేశ్వర్ ధామ్ పీఠాధిపతి

బానిస మనస్తత్వంతో హిందువులపై దాడి

హిందూ మత విశ్వాసాలపై అదేపనిగా విమర్శలు
విభజన, విచ్ఛిన్నమే వారి అజెండా
విదేశీ శక్తుల దన్నుతో భారత్‌ను బలహీనపరిచే యత్నం
కుంభమేళా విమర్శకులపై మోదీ ఫైర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాను విమర్శిస్తున్న ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. బానిస మనస్తత్వం ఉన్నవారు హిందూమత విశ్వాసాలపై అదే పనిగా దాడిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్‌లో బాగేశ్వర్ ధామ్ మెడికల్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓ వర్గం నేతలు హిందూమతాన్ని అవహేళన చేస్తున్నారని, విదేశాల దన్నుతో దేశాన్ని బలహీనపరచాలని

మిగతా 2వ పేజీలో...

మోదీ, ట్రంప్, నేను మాట్లాడితే ప్రజాస్వామ్యానికి
ముప్పు అంటున్నారు

ఉదారవాదులవి ద్వంద్వ ప్రమాణాలు **2**
వారి అబద్ధాల్ని ప్రజలు నమ్మట్లేదు: ఇటలీ ప్రధాని



విరాట్ కోహ్లీ (100) **10**

విరాట్ విహారం
పాక్ ఖేల్ ఖతం

6 వికెట్లతో భారత్ విక్టరీ.. నాకౌట్‌కు రోహిత్ సేన!
రెండో ఓటమితో పాక్ సెమీస్ ఆశలు గల్లంతు?

ఛేజ్ మాస్టర్.. కింగ్ విరాట్ కోహ్లీ(100 నాటౌట్) సెంచరీతో చెలరేగి.. చిరకాల ప్రత్యర్థి పాక్ పనిపట్టాడు. చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌కు సెమీస్ బెర్త్ దాదాపు ఖరారు చేశాడు. టోర్నీలో పాక్ సెమీస్ ఆశలను దుబాయ్‌లోనే దాదాపుగా సమాధి చేసి.. 2017 టోర్నీ ఫైనల్‌లో ఆ జట్టు చేతిలో ఎదురైన ఓటమికి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేశాడు. ఆదివారం జరిగిన బ్లాక్‌బస్టర్ మ్యాచ్‌లో టీమిండియా 6 వికెట్ల తేడాతో పాక్‌పై గెలిచింది. వార్ వన్‌సైడ్‌లా జరిగిన మ్యాచ్‌లో విరాట్ సెంచరీ హైలైట్‌గా నిలవగా.. శ్రేయాస్ అయ్యర్(56), గిల్(46) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. రోహిత్ సేన సెమీస్ బెర్త్ దాదాపు ఖాయమవ్వగా.. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిన డిఫెండింగ్ చాంపియన్ పాక్ కథ కరాచీకి చేరినట్టే..!!

పాఠం నేర్పని పాపాలు



మళ్లీ రీ సర్వే పేరిట పాత తప్పులు.. నాడు జగన్ ప్రభుత్వంలో అడ్డగోలు సర్వే

ఇష్టానుసారం భూరికార్డుల మార్పు
సర్వే చేసిన 8,680 గ్రామాల్లో
3.80 లక్షల మంది రైతులకు సమస్యలు
కూటమి సర్కారుకు ఫిర్యాదుల వెల్లువ
వాటిని పరిష్కరించకుండానే మళ్లీ రీ సర్వే
ఏకంగా 670 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు
ప్రభుత్వ నిర్ణయంపై రైతులు, నిపుణుల విస్మయం
అనవసర ప్రయోగాలు అనర్థమని హెచ్చరిక
అవసరాన్ని బట్టే సర్వే చేయాలని సూచన

2019 జనవరి నాటికి ప్రభుత్వానికి 1.45 లక్షల ఫిర్యాదులు రాగా, ఇందులో రెవెన్యూ శాఖ పరిష్కరించాల్సినవి కేవలం 13 వేలు. తాజాగా కూటమి సర్కారుకు 7.60 లక్షల ఫిర్యాదులు రాగా, అందులో ఒక్క రెవెన్యూవే 3.80 లక్షలు! ఇవన్నీ జగన్ సర్కారు చేసిన రీ సర్వే తప్పులే. వీటిని పరిష్కరించలేక కూటమి సర్కారు సతమతం అవుతూనే... తాను కూడా 'రీసర్వే' బాట పడుతోంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం రీ సర్వే చేయించడానికి ముందు రాష్ట్రంలో భూ సమస్యలు కొన్ని వేలల్లో ఉంటే... రీ సర్వే తర్వాత కొత్త సమస్యలు లక్షల్లో పుట్టుకొచ్చాయి. అంటే.. ఉన్నవాటిని పరిష్కరించకుండా కొత్తగా ఎన్నో రెట్లు సృష్టించారు. రీ సర్వేకు సంబంధించి కూటమి ప్రభుత్వానికి 3.80 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ప్రభుత్వం దీన్నో గుణపాఠంగా తీసుకుని ఆ తప్పులు సరిదిద్దాల్సింది పోయి చిత్రంగా అదే తప్పు చేస్తోంది. జగన్ సర్కారు చూపిన రీ సర్వే బాటలోనే

మిగతా 12వ పేజీలో...

సులభంగా గ్రూప్-2 మెయిన్స్

ప్రాథమికాంశాలపై సూటిగా ప్రశ్నలు
పరీక్షలకు 92 శాతం మంది హాజరు
ఏపీ చరిత్రలో 'వీర తెలంగాణ'పై ప్రశ్న
ప్రాథమిక 'కీ' విడుదల చేసిన ఏపీపీఎస్సీ
ఈ నెల 27 వరకూ అభ్యంతరాల స్వీకరణ

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గందరగోళ వాతావరణంతో తీవ్ర ఉత్కంఠ రేపిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. గత రెండు రోజులుగా చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో పరీక్షలకు ఎక్కువమంది హాజరవుతారా అనే సందేహం తలెత్తింది. అయితే, ఏకంగా 92శాతం మంది హాజరై పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఆందోళనలు జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మెయిన్స్ పరీక్షకు అభ్యర్థులు తీవ్రస్థాయిలో సన్నద్ధం కాగా పేపర్లు సులభంగా వచ్చాయి. సబ్జెక్టులో మరీ లోతుగా వెళ్లకుండా చాలావరకు ప్రశ్నలను ప్రాథమిక అంశాల(బేసిక్స్) పైనే ఇచ్చారు. గతంలో ప్రకటనలు (స్టేట్‌మెంట్లు) ఇచ్చి వాటిలో సరైనవి గుర్తించడం లాంటి ప్రశ్నలు అధికంగా ఉండేవి. కానీ, ఈసారి మాత్రం నేరుగా సమాధానం అడిగిన ప్రశ్నలు ఎక్కువగా రావడంతో అభ్యర్థులకు సమయం కూడా సరిపోయింది. ఆంధ్రప్రదేశ్ సామాజిక,

మిగతా 11వ పేజీలో...


విజయవాడలోని ఓ పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న గ్రూప్ 2 అభ్యర్థులు

పెళ్లి పీటలపై నుంచి పరీక్షా కేంద్రానికి..!

తలపై జీలకర్ర, బెల్లం తీసేయాలన్న భద్రతా సిబ్బంది
ససేమిరా అన్న వధువు..
అనుమతించిన ప్రిన్సిపాల్


తలపై జీలకర్ర, బెల్లాన్ని పరిశీలిస్తున్న భద్రతా సిబ్బంది

గత వారం ఏం పని చేశారు?

రెండ్రోజుల్లోగా 5 పాయింట్లలో జవాబివ్వండి
అలా ఇవ్వకపోతే రాజీనామాగా పరిగణిస్తాం
అమెరికా ఫెడరల్ ఉద్యోగులకు మస్క్ మెయిల్
చట్టవిరుద్ధంగా తొలగిస్తే సవాలు చేస్తాం
అమెరికా ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు
ఎఫ్‌బీఐ ఉద్యోగులెవరూ స్పందించొద్దు: కాశ్



వాషింగ్టన్, ఫిబ్రవరి 23: అమెరికాలో ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాన్ మస్క్ షాక్ ఇచ్చారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న మస్క్.. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించే విషయంలో దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దాదాపు 20 లక్షల మందికి పైగా ఫెడరల్ ఉద్యోగులకు ఈ-మెయిల్స్ పంపారు. గడిచిన వారం రోజుల్లో ఎవరెవరు ఏం పని చేశారనే వివరాలను ఐదు బుల్లెట్ పాయింట్ల రూపంలో తెలియజేయాలని 'యూఎస్ ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఓపీఎం)' నుంచి శనివారం పంపిన మెయిల్‌లో ఆదేశించారు. సవివరమైన

మిగతా 2వ పేజీలో...



త్వరలో భారత్, చైనాపై పరస్పర సుంకాలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పునరుద్ఘాటన
విదేశీ నేరస్థులను సాగనంపుతున్నామని వ్యాఖ్య



చరిత్ర సృష్టించిన జెన్కో

రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి
241.523 మిలియన్ యూనిట్ల ఉత్పాదన
వీటీపీఎస్‌లో 52.73 మి.యూనిట్లు **11**
ఇది సువర్ణాధ్యాయం: ఎండీ చక్రధరబాబు

పది లక్షల వ్యాక్సిన్లు ఔట్!

ఈ నెలాఖరుకు క్షయ వ్యాక్సిన్లు ఎక్స్‌పైరీ
ఏడాది క్రితం మొదలైన పంపిణీ **9**
ఇంకా 40% కూడా పూర్తికాని వైనం
కేంద్రం పంపిన వ్యాక్సిన్లకు కాలపరిమితి
అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ల విలువ కోట్లలోనే!
ఆరోగ్యశాఖ అధికారుల తీరుతో వృథా
వ్యాక్సిన్లు వేశాక కూడా క్షయ లక్షణాలు?
వాటి పనితీరుపై సర్వత్రా అనుమానాలు




టన్నెల్ నిండా బురద!

టీబీఎం నుంచి 400 మీటర్ల వరకు కూరుకుపోయిన మట్టి, షీట్లు **9**
నిమిషానికి 3500 లీటర్ల దాకా సొరంగంలోకి వస్తున్న ఊటనీరు
చిక్కుకుపోయిన వారి పరిస్థితిపై ఆందోళన
శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

బీజేపీని ఎలా ఎదుర్కొందాం?

ఏఐసీసీ సమావేశాల్లో కార్యాచరణ.. ఏప్రిల్ 8, 9 తేదీల్లో కీలక భేటీలు
గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఖర్గే అధ్యక్షతన నిర్వహణ
హాజరవ్వనున్న సోనియా, రాహుల్



ప్రస్తుతానికి కాంగ్రెస్‌లోనే ఉన్నా..

పార్టీ వద్దనుకుంటే నాకూ ప్రత్యామ్నాయాలు ఉన్నాయి
దేశ, కేరళ ప్రయోజనాల కోసమే మోదీపై, లెఫ్ట్ సర్కార్‌పై ప్రశంసలు
ఎప్పుడూ పార్టీ లబ్ధి కోసమే మాట్లాడడం నా వల్ల కాదు: థరూర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: అధికార బీజేపీని ఎదుర్కొనే వ్యూహాలకు కాంగ్రెస్ పదును పెడుతోంది. ఏప్రిల్‌లో జరగనున్న ఏఐసీసీ కీలక సమావేశాల్లో దీనికి సంబంధించి నిర్దిష్ట కార్యాచరణ రూపొందించే దిశగా ఆ పార్టీ అడుగులు వేస్తోంది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ముఖ్య నేతలను ఒక్క చోటకు చేర్చి కాషాయ పార్టీపై కదం తొక్కేందుకు సమాయత్తమవుతోంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా ఏప్రిల్ 8, 9 తేదీల్లో ఏఐసీసీ కీలక సమావేశాలను నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. కేంద్రంలోని బీజేపీ సర్కారు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఎదురయ్యే

మిగతా 2వ పేజీలో...

కర్ణాటకకు ఆర్టీసీ బస్సులు పంపేది లేదు

» మహారాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్‌నాయక్

బెంగళూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపేది లేదని మహారాష్ట్ర రవాణాశాఖ మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ స్పష్టం చేశారు. బెళగావిలో కేఎస్ఆర్టీసీ బస్సు కండక్టర్‌పై మరాఠీల దాడి తర్వాత తలెత్తిన వివాదం నేపథ్యంలో... ఆదివారం ముంబైలో మహారాష్ట్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. కర్ణాటక ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు బస్సు సర్వీసులను పంపేది లేదన్నారు. శుక్రవారం చిత్రదుర్గలో మహారాష్ట్ర ఆర్టీసీ డ్రైవర్‌కు మసిపూసిన అంశాన్ని ప్రస్తావించారు. మహారాష్ట్ర నుంచి కర్ణాటకకు వెళ్లే బస్సులు, డ్రైవర్, కండక్టర్లపై దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ముందస్తు జాగ్రత్తగా బస్సు సర్వీసులు ఆపేశామన్నారు. రెండు రాష్ట్రాల మధ్య పరిస్థితి ఉద్రిక్తంగా ఉండడంతో బస్సు సేవలు తాత్కాలికంగా నిలిపివేశారు.

రాజీనామాకు సిద్ధం: కర్ణాటక హోంమంత్రి

బెంగళూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాయకత్వ మార్పు అంశం చర్చకు వస్తున్న తరుణంలోనే కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర్ సంచలన ప్రకటన చేశారు. తుమకూరులో ఆదివారం కార్యకర్తలను ఉద్దేశించి హోం మంత్రి మాట్లాడుతూ.. 'మీరు పెద్ద మనసుతో నా రాజీనామా కోరితే అందుకు సిద్ధమన్నా'రు. ఇటీవల నియోజకవర్గంలో కార్యకర్తలు, ప్రజలతో తగిన సమయం కేటాయించేందుకు సాధ్యం కావడం లేదన్నారు. ఇందుకు క్షమాపణ కోరుతున్నానన్నారు. 'మీరు కోరితే హోం మంత్రి పదవికి రాజీనామా చేస్తా' అన్నారు. మూడు రోజుల క్రితం ఢిల్లీ వెళ్లి వచ్చిన పరమేశ్వర్ కీలకమైన హోం మంత్రి పదవికి రాజీనామా చేస్తాననడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

నేడు పీఎం కిసాన్ నిధులు విడుదల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి23: పీఎం కిసాన్ నిధులు నేడు విడుదల కానున్నాయి. బిహార్ భాగల్పూర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 19వ విడత కింద రూ.22 వేల కోట్లు నిధులను విడుదల చేస్తారు. రైతన్నలకు ఏడాదిలో ఒక్కో విడత రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో మొత్తం రూ.6 వేల సాయం అందించే ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించింది. ఇప్పటివరకు 11 కోట్ల మంది అన్నదాతలకు 18 వాయిదాల్లో రూ.3.46 లక్షల కోట్లను చెల్లించారు. ఈ పథకం ద్వారా మొత్తం 18 విడతల్లో తెలంగాణలో 30,77,426 మంది రైతన్నలకు రూ.627 కోట్లు చెల్లించారు.

పాక్ నుంచి బంగ్లాకు 50వేల టన్నుల బియ్యం

బంగ్లాదేశ్ ఏర్పడ్డ తర్వాత పాక్‌తో ప్రత్యక్ష వాణిజ్యం ఇదే తొలిసారి

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 23: పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల మధ్య ప్రత్యక్ష వాణిజ్య సంబంధాలు చిగురించాయి. 1971లో పాక్, బంగ్లాదేశ్‌లు విడిపోయిన అనంతరం మొదటిసారిగా ఈ దేశాల మధ్య ప్రత్యక్ష వాణిజ్యం ప్రారంభమైంది. ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ పాకిస్థాన్ (టీసీపీ) ద్వారా 50వేల టన్నుల పాకిస్థాన్ బియ్యాన్ని కొనేందుకు ఈ నెల ప్రారంభంలో బంగ్లాదేశ్ అంగీకరించ డంతో కుదిరిన ఒప్పందం ఇందుకు దారితీసింది. ఈ ఒప్పందం మేరకు ప్రభుత్వం ఆమోదించిన మొదటి కార్గో.. శనివారం కరాచీలోని పోర్ట్ ఖాసిమ్ నుంచి బంగ్లాదేశ్ పోర్ట్‌కు బయలుదేరింది. 1971లో తూర్పు పాకిస్థాన్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశంగా బంగ్లాదేశ్ ఏర్పాటైంది. గత ఏడాది బంగ్లాదేశ్ ప్రధాని పదవి నుంచి షేక్ హసీనా తప్పుకోవడంతో యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైన విషయం తెలిసిందే. ఈ ప్రభుత్వం పాకిస్థాన్‌తో వాణిజ్య సంబంధాలకు చేతులు చాచడంతో పాక్ సానుకూలంగా స్పందిస్తోందంటున్నారు.

'గిరిజన అట్లాస్'ను రూపొందించండి: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: 'గిరిజన అట్లాస్'ను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను కోరింది. ప్రతి గిరిజన గ్రామంలో వారి జనాభా, సంస్కృతి, ఎంత భూమి సాగు చేస్తున్నారు, అటవీ ఉత్పత్తుల సేకరణకు ఎంతదూరం వెళుతున్నారు తదితర వివరాలను ఈ అట్లాస్‌లో పొందుపరచాలని సూచించింది. భూమి హక్కు కోసం చేసుకున్న దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో కేంద్రం ఈ సూచన చేసింది. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. ఫిబ్రవరి 1 నాటికి దరఖాస్తుదారుల్లో 48.95 శాతం మందికి భూ హక్కు కల్పించారు. 36.43 దరఖాస్తులను తిరస్కరించగా.. 14.62% అపరిష్కృతంగా ఉన్నాయి. ఒడిసా 2018లోనే ఈ అట్లాస్‌ను రూపొందించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మిగతా రాష్ట్రాలు తయారుచేయాల్సి ఉంది.

శ్రీలంక జలాల్లో 32మంది భారత జాలర్ల అరెస్ట్

కొలంబో, ఫిబ్రవరి 23: శ్రీలంక ప్రాదేశిక జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారనే ఆరోపణలతో 32 మంది భారత జాలర్లను ఆదివారం ఆ దేశ నౌకాదళ అధికారులు అరెస్ట్ చేశారు. జాలర్లు వాడిన ఐదు పడవలను స్వాధీనం చేసుకున్నారు. శ్రీలంక జలాల్లోకి విదేశీ మత్స్యకార పడవలు రాకుండా నిరోధించేందుకు తరచూ నిర్వహించే ఆపరేషన్‌లో భారత జాలర్లు పట్టుబడినట్టు ఆ దేశ నౌకాదళం ఓ ప్రకటనలో తెలిపింది. అరెస్టయిన జాలర్లతో పాటు పడవలను శ్రీలంకలోని తలైమన్నార్ ఓడరేవుకు తరలించినట్టు వెల్లడించింది. భారత్, శ్రీలంక సంబంధాల్లో జాలర్ల అంశం వివాదాస్పదంగా మారుతోంది. ఈ ఏడాది శ్రీలంక జలాల్లోకి ప్రవేశించిన 131 మంది భారత జాలర్లను అరెస్ట్ చేసి, 18 పడవలను స్వాధీనం చేసుకున్నారు. 2024లో శ్రీలంక నౌకాదళం మొత్తం 529 మంది భారత జాలర్లను అరెస్ట్ చేసింది.

జేఈఈ మెయిన్ పేపర్ 2 ఫలితాలు విడుదల


» ఆర్కిటెక్చర్‌లో తెలంగాణ టాపర్‌గా సాకేత్ వేంపల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గత నెలలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించిన జేఈఈ మెయిన్ పేపర్ 2 (బి-ఆర్కిటెక్చర్, బి-ప్లానింగ్) ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. మహారాష్ట్ర విద్యార్థి నీల్ సందేశ్ 100పర్సంటైల్‌తో బి-ఆర్కిటెక్చర్‌లో ఆలిండియా టాపర్‌గా నిలువగా.. తెలంగాణకు చెందిన సాకేత్ వేంపల్లి 99.9796122 పర్సంటైల్‌తో స్టేట్ టాపర్‌గా నిలిచారు. అలాగే బి-ప్లానింగ్‌లో మధ్యప్రదేశ్ విద్యార్థిని సునిధి సింగ్ 100పర్సంటైల్‌తో ఆలిండియా టాపర్‌గా నిలువగా.. తెలంగాణకు చెందిన మున్నూరునాయక్ అభ్యకౌటిల్య 99.7042375 పర్సంటైల్‌తో రాష్ట్ర టాపర్‌గా నిలిచారు. గత నెల 30న జరిగిన ఆర్కిటెక్చర్ పరీక్షకు దేశవ్యాప్తంగా 44,144 మంది, ప్లానింగ్ పరీక్షకు 18,596 మంది హాజరయ్యారు.

పాలస్తీనా వెస్ట్ బ్యాంక్‌లోకి ఇజ్రాయెల్ ట్యాంకులు

జెనిన్ (వెస్ట్‌బ్యాంక్), ఫిబ్రవరి 23: పాలస్తీనా, ఇజ్రాయెల్‌ల మధ్య మళ్లీ యుద్ధం కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. గాజా ప్రాంతంలో కాల్పులు విరమణ కుదిరినప్పటికీ, తాజాగా పాలస్తీనా ఆధీనంలోని వెస్ట్ బ్యాంక్‌లో యుద్ధం ఆరంభమయ్యే పరిస్థితులు ఉన్నాయి. ఆదివారం ఇజ్రాయెల్‌కు చెందిన యుద్ధ ట్యాంకులు వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్‌కు వెళ్లాయి. 2002 తరువాత ఇజ్రాయెల్ ట్యాంకులు వెస్ట్‌బ్యాంక్‌కు వెళ్లడం ఇదే ప్రథమం. ఈ ఏడాదంతా దళాలు అక్కడే ఉంటాయని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇస్రాయెల్ కాట్జ్ ప్రకటించడం ప్రాధాన్యతను సంతరించుకొంది. గాజాలో కాల్పుల విరమణ ప్రకటించిన రెండు రోజులకే జనవరి 21న వెస్ట్‌బ్యాంక్ ఉత్తర ప్రాంతంలో దాడులు ప్రారంభించింది. ఇక్కడ సుమారు 40వేల మంది శరణార్థులు తలదాల్చుకుంటున్నారు.

ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేతగా అతిశీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా మాజీ సీఎం అతిశీ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఆప్ శాసనసభాపక్ష భేటీలో పార్టీ ఎమ్మెల్యేలంతా ఈ మేరకు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్యే సంజీవ్ ఝా.. అతిశీ పేరును ప్రతిపాదించగా, మిగిలిన వారంతా మద్దతు తెలిపారు. ఢిల్లీ ప్రతిపక్ష నేత ఒక మహిళ ఎన్నికవ్వడం ఇదే తొలిసారి. తనను నమ్మి, తనకు ఈ కీలక బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్‌కు, పార్టీ ఎమ్మెల్యేలకు అతిశీ ధన్యవాదాలు తెలిపారు. కాగా, మూడు రోజుల పాటు జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. కాగా, ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాల్లో 48 స్థానాలు గెలుపొంది బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

గత వారం ఏం పని చేశారు?

(మొదటి పేజీ తరువాయి)



సమాచారం, లింకులు లేదా అటాచ్‌మెంట్లు పంపొద్దని స్పష్టం చేశారు. సోమవారం రాత్రి 11.59 గంటల్లోపు సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. జవాబు ఇవ్వడంలో విఫలమైన వారిని రాజీనామా చేసినట్లుగానే పరిగణిస్తామని మస్క్ తేల్చిచెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ ఆదేశాలు జారీ చేసినట్లు శనివారం మధ్యాహ్నం సోషల్ మీడియాలో వెల్లడించారు. ప్రత్యేక ప్రభుత్వ అధికారిగా, అధ్యక్షుడి సలహాదారుగా ఉన్న మస్క్‌కు ఫెడరల్ ఉద్యోగులను తొలగించే అధికారాలేమీ లేవని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. అమెరికాకు చెందిన అతి పెద్ద ఉద్యోగ సంఘం అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాతీయ అధ్యక్షుడు ఎవెరెట్ కెల్లీ దీనిపై స్పందిస్తూ.. ట్రంప్ తీసుకుంటున్న చర్యలు ఫెడరల్ ఉద్యోగుల పట్ల, దేశ ప్రజలకు అందించే క్లిష్టమైన సేవల పట్ల ఆయనకు ఉన్న అయిష్టతను సూచిస్తున్నాయని చెప్పారు. మస్క్ పంపిన మెయిల్ చాలా క్రూరమైందన్నారు. ఆయన ఆదేశాలతో ప్రభుత్వం చట్టవిరుద్ధమైన తొలగింపులకు పాల్పడితే వాటిని సవాలు చేస్తామని స్పష్టం చేశారు. తన జీవితంలో ఒక్కసారి కూడా నిజాయతీగా ప్రజలకు సేవ చేయని మస్క్‌తో తమ ఉద్యోగులకు విధుల గురించి చెప్పించడం అంటే వారిని అగౌరవపరచడమేనని పేర్కొన్నారు. మరోవైపు, మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగానికి ప్రత్యేక అధికారాలిస్తూ కార్యనిర్వాహక ఆదేశాలపై ట్రంప్ సంతకం చేశారు. ప్రతి ఏజెన్సీ ఉద్యోగుల తగ్గింపునకు ప్రణాళికలు చేపట్టాలని, అవసరమైన మేరకే నియామకాలు చేపట్టాలని అందులో పేర్కొన్నారు. అనంతరం డోజ్ పనితీరును ట్రంప్ ప్రశంసించారు. మస్క్ చాలా మంచి పనిచేస్తున్నారని కొనియాడారు. ఆయన మరింత దూకుడుగా ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నట్లు వ్యాఖ్యానించారు. కాగా, 'ఈ వారంలో మీరేం పని చేశారు?' అనే ప్రశ్న మస్క్ తన సంస్థల్లో పనిచేసే ఉద్యోగులను కూడా అడిగారు. 2022లో ట్విటర్‌ను కొనుగోలు చేసేముందు ఆ సంస్థ సీఈవో పరాగ్ అగర్వాల్‌కు ఇదే ప్రశ్నను సంధించారు. అనంతరం ఆయన్ను సీఈవో పదవి నుంచి తప్పించిన సంగతి తెలిసిందే.

స్పందించనక్కర్లేదు: కాశ్ పటేల్

మస్క్ పంపిన మెయిల్‌పై ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ)కు 9వ డైరెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన కాశ్ పటేల్ భిన్నంగా స్పందించారు. ఆ మెయిల్‌కు స్పందించవద్దని ఎఫ్‌బీఐ సిబ్బందికి స్పష్టం చేశారు. "ఏం పనిచేస్తున్నారో తెలియజేయాలంటూ ఓపీఎం నుంచి ఎఫ్‌బీఐ ఉద్యోగులకూ మెయిల్ వచ్చి ఉండొచ్చు. ఎఫ్‌బీఐ నిబంధనల ప్రకారం ప్రస్తుతం దర్యాప్తు సంస్థలో సమీక్షల ప్రక్రియ జరుగుతోంది. ఏదైనా సమాచారం అవసరమైతే మేమే స్పందిస్తాం. ప్రస్తుతానికి ఉద్యోగులెవరూ మస్క్ మెయిల్‌కు జవాబు ఇవ్వాల్సిన అవసరం లేదు" అని కాశ్ ఎఫ్‌బీఐ ఉద్యోగులకు సందేశం పంపారు. అలాగే జాతీయ భద్రతా సంస్థ (ఎన్ఎస్ఏ) కూడా.. తాము తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఎవరూ మస్క్ మెయిల్‌కు స్పందన తెలియజేయనక్కర్లేదని ఉద్యోగులకు సందేశం ఇచ్చింది.

ఓటింగ్ శాతం పెంపునకు.. యూఎస్ఎయిడ్ నిధులివ్వలేదు

» కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నివేదిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్(యూఎస్ఎయిడ్) భారత్‌లో ఓటింగ్ శాతం పెంపునకు ఎలాంటి నిధులు ఇవ్వలేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏడు ప్రాజెక్టులకు సహాయం చేసిందని ఓ నివేదికలో వెల్లడించింది. వ్యవసాయం-ఆహారభద్రత కార్యక్రమాలు, తాగునీరు-పారిశుద్ధ్యం-పరిశుభ్రత(వాష్), పునరుత్పాదక ఇంధన శక్తి, విపత్తు నిర్వహణ-ఆరోగ్యం, సుస్థిర అడవులు-వాతావరణ కార్యక్రమాలు, ఆవిష్కరణలపై భారత్ రూ.6,498 కోట్ల(750 మిలియన్ డాలర్లు) అంచనా వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టులకు యూఎస్ఎయిడ్ నుంచి రూ.825 కోట్లు(97 మిలియన్ డాలర్లు) అందినట్లు ఆ నివేదిక స్పష్టంచేసింది. కాగా.. భారత్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు యూఎస్ఎయిడ్ ద్వారా రూ.182 కోట్లు(21 మిలియన్ డాలర్లు) ఇచ్చినట్లు ట్రంప్ ఆరు రోజులుగా ఆరోపిస్తున్నారు.

లోకం తీరు



త్వరలో భారత్, చైనాపై పరస్పర సుంకాలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పునరుద్ఘాటన



వాషింగ్టన్, ఫిబ్రవరి 23: భారత్, చైనా వంటి దేశాలపై త్వరలో పరస్పర సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. గతవారం ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా తాను చెప్పిన విషయాన్ని శుక్రవారం వాణిజ్య శాఖ కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పునరుద్ఘాటించారు. ఏ కంపెనీ అయినా, ఏ దేశమైనా అమెరికా వస్తువులపై ఎంతెంత సుంకాలు విధిస్తున్నాయో తాము కూడా అదే స్థాయిలో సుంకాలు విధించనున్నట్లు తెలిపారు. కొత్తగా పదవిలోకి వచ్చిన హోవార్డ్ దీనికి బాధ్యత వహించబోతున్నారని తెలిపారు. తాము న్యాయంగా ఉండాలని భావిస్తున్నామని, అందుకే 'పరస్పరం' అంటున్నామని చెప్పారు. మరోవైపు, అక్రమ వలసదారుల గురించి ట్రంప్ మాట్లాడుతూ... వారి వెళ్లగొట్టి దేశంలో పేరుకుపోయిన బురదను కడిగేయడానికి కృషి చేస్తున్నామని వ్యాఖ్యానించారు.

భారత్‌కు మరో 12 మంది వలసదారులు

తగిన అధికారిక పత్రాలు లేవన్న కారణంతో మరో 12 మంది భారతీయులను అమెరికా తిప్పి పంపించింది. వారు ఆదివారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. అక్రమ వలసదార్లు అన్న పేరుతో తొలుత అమెరికా ప్రభుత్వం 299 మంది భారతీయులను పనామా పంపించింది. అందులో 171 మంది తిరిగి వచ్చేందుకు అంగీకరించారు. వారిలో ప్రస్తుతం 12 మంది స్వదేశానికి వచ్చారు.

మేం మాట్లాడితే ప్రజాస్వామ్యానికి ముప్పా: మెలోనీ

ప్రపంచ వ్యాప్తంగా ఉదారవాదులు ద్వంద్వ ప్రమాణాలతో వ్యవహరిస్తున్నారని ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆరోపించారు. భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలీ వంటి నాయకులు కొత్త ప్రపంచ సంప్రదాయవాద ఉద్యమాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని నొక్కిచెప్పారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వామపక్షాలు ఆందోళనలో ఉన్నాయని, ట్రంప్ విజయంతో వారి చిరాకు ఉన్మాదంగా మారిందని ఎద్దేవా చేశారు. 90వ దశకంలో టోనీ బ్లెయిర్, బిల్ క్లింటన్‌లు వామపక్ష ఉదారవాద నెట్‌వర్క్‌ను సృష్టించినప్పుడు ఉదారవాదులు వారిని రాజనీతిజ్ఞులుగా పిలిచేవారని మెలోనీ గుర్తుచేశారు. ఇప్పుడు మాత్రం మోదీ, ట్రంప్, మెలోనీ మాట్లాడితే ప్రజాస్వామ్యానికి ముప్పుగా పేర్కొంటున్నారని మండిపడ్డారు.

అవినీతి కేసుల్లో ప్రాథమిక విచారణ తప్పని సరికాదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: అవినీతి నిరోధక చట్టం కింద సంబంధిత కేసులో ప్రాథమిక విచారణ తప్పనిసరి కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిందితులుగా ఉన్నవారు ప్రతికేసులోనూ ప్రాథమిక విచారణ కోరే హక్కు లేదని పేర్కొంది. అవినీతి నిరోధక చట్టం కింద నమోదైన కేసులు సహ మరికొన్ని కేసుల్లో ప్రాథమిక విచారణ అవసరమే అయినప్పటికీ క్రిమినల్ కేసులు నమోదైనప్పుడు ఇలాంటి విచారణ తప్పనిసరికాదని తెలిపింది. అదేవిధంగా సంబంధిత కేసుల్లో అందిన సమాచారాన్ని నిర్ధారించుకునేందుకు కూడా ప్రాథమిక విచారణ అవసరం లేదని, అయితే.. సదరు సమాచారం గుర్తించదగిన నేరం అవునో కాదో నిర్ధారించుకునేందుకు మాత్రమే ఉపయోగపడుతుందని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం కర్ణాటక లోకాయుక్త నమోదు చేసిన కేసు విచారణ సందర్భంగా ఈ నెల 17న ఇచ్చిన తీర్పులో వెల్లడించింది. కర్ణాటక హైకోర్టు వ్యవహరించిన తీరుపై ధర్మాసనం ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. కర్ణాటక లోకాయుక్త పోలీసు స్టేషన్‌లో ఓ ప్రభుత్వ ఉద్యోగిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదైంది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని పేర్కొంటూ ఎస్పీ ఆదేశాల మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే.. ప్రాథమిక విచారణ జరపకుండానే ఎఫ్ఐఆర్‌ను కట్టారంటూ కర్ణాటక హైకోర్టు గత ఏడాది మార్చిలో ఈ కేసును కొట్టివేసింది. హైకోర్టు చర్యను సవాల్ చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ సందర్భంగా అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి, ఎఫ్ఐఆర్ కట్టే ముందు ప్రాథమిక విచారణ తప్పనిసరా? కాదా? అనే విషయాన్ని సుప్రీంకోర్టు పరిశీలించింది. నిందితుడిపై ఎఫ్ఐఆర్‌ను కొనసాగిస్తూ తీర్పు వెలువరించింది.

మయన్మార్ సైబర్ నేర కేంద్రాల నుంచి 162 మందికి విముక్తి

» ఇందులో తెలంగాణ, ఏపీ వారు 18 మంది



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మయన్మార్‌లో సైబర్ నేరాలకు పాల్పడే చైనా ముఠాల వద్ద బందీలుగా చిక్కుకున్న 162 మంది భారతీయులకు విముక్తి లభించింది. భారత అధికారుల ఒత్తిడితో స్పందించిన మయన్మార్ అధికారులు వారిని విడిపించారు. మయన్మార్ అధికారులు రక్షించిన వారిలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన వారు 18 మంది ఉన్నారు. పెద్ద మొత్తంలో జీతం వచ్చే ఉద్యోగమంటూ ఎర వేసి చైనా సైబర్ నేరాల ముఠాలు రిక్రూట్‌మెంట్ ఏజెన్సీల ద్వారా యువతను తరలిస్తున్నాయి. గోల్డెన్ ట్రయాంగిల్‌గా పిలవబడే మయన్మార్, లావోస్, థాయ్‌లాండ్, కంబోడియాలోని ప్రాంతాల్లో ఉన్న తమ స్థావరాలకు వారిని తీసుకెళ్లి బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్నాయి. గోల్డెన్ ట్రయాంగిల్ ప్రాంతాల్లో వెయ్యిమందికి పైగా భారతీయ యువకులు బందీలుగా ఉన్నట్టు సమాచారం. ఇలా ఓ ముఠా వద్ద బందీగా ఉన్న కరీంనగర్ జిల్లా రంగాపేటకు చెందిన కొక్కిరాల మధుకర్ రెడ్డి.. తమను రక్షించమంటూ ఇటీవల తన కుటుంబసభ్యులకు అతికష్టం మీద ఓ ఆడియో సందేశం పంపాడు. మయన్మార్‌లోని ఓ ప్రాంతంలో తమని బంధించి ఫోన్లు లాక్కొని సైబర్ నేరాలు చేయిస్తున్నారని తెలిపాడు. తామున్న ప్రాంతానికి సంబంధించిన లొకేషన్ కూడా షేర్ చేసి తమను విడిపించేందుకు ప్రయత్నించాలని కోరాడు. అతని కుటుంబసభ్యులు అధికారులను సంప్రదించగా విదేశీ వ్యవహారాల శాఖ అప్రమత్తమైంది. భారత ఎంబసీ వినతితో స్పందించిన మయన్మార్ అధికారులు మయన్మార్‌లోని మైవాడీ, మైయింగ్ ప్రాంతాల్లో సోదాలు చేసి 162 మందిని విడిపించారు.

నూనె వాడకం తగ్గించండి

ఊబకాయం నివారణకు అదే చిట్కా.. మన్ కీ బాత్‌లో ప్రధాని

» 'ఊబకాయం'పై సందేశాలు పంపిన నీరజ్ చోప్రా, నిఖత్ జరీన్‌కు ప్రశంస

న్యూఢిల్లీ, ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 23: ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న ఊబకాయం సమస్య నివారణకు ప్రధాని మోదీ ఓ చిట్కా చెప్పారు. ఆహారంలో నూనె వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ప్రతి నెలా చివరి ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమయ్యే 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా ఈ ఆదివారం 119వ సంచికలో ఆయన ప్రసంగించారు. ఊబకాయంపై క్రీడాకారులు బాక్సర్ నిఖత్ జరీన్, జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పంపిన సందేశాలను వినిపించి వారిని అభినందించారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తన సోషల్ మీడియా ఖాతాల బాధ్యతను దేశంలోని స్ఫూర్తిదాయక మహిళలకు అప్పగిస్తానని ప్రకటించారు. ఊబకాయంపై ప్రధాని మాట్లాడుతూ.. "పది శాతం నూనె వాడకం తగ్గించండి. ఆ విషయం పది మందికి చెప్పండి. ఆ పది మంది ఇంకో పది మందికి సవాల్ విసరాలి. ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా మాదిరిగా ఆరోగ్య సంరక్షణకు ఆహార నియమావళిని పాటించాలి. ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి" అని అన్నారు. ఊబకాయం ఆందోళనకరమైన సమస్య అని, నూనె వాడకాన్ని తగ్గించాలని నీరజ్ చోప్రా, నిఖత్ జరీన్ తమ సందేశాల్లో పిలుపునిచ్చారు. మరోవైపు, విద్యార్థులకు ప్రధాని మోదీ సందేశం ఇస్తూ.. "జాతీయ సైన్స్ దినోత్సవం (28వ తేదీ) సందర్భంగా ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు పరిశోధనా లేబొరేటరీలు, ప్లానిటోరియాలను, అంతరిక్ష కేంద్రాలను సందర్శించి.. ఒకరోజు శాస్త్రవేత్తగా గడపాలి. పుస్తక పరిజ్ఞానానికి అతీతంగా ప్రాక్టికల్ పరిజ్ఞానం పెంచుకోవాలి" అని అన్నారు.

జ్యోతి యర్రాజీ వంటి క్రీడాకారులతో కొత్త ఆశలు

దేశం ప్రపంచ క్రీడాశక్తి కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి యర్రాజీతోపాటు సావన్ బార్వాల్(హిమాచల్ ప్రదేశ్), కిరణ్ మాత్రే, తేజస్ షిర్సే(మహారాష్ట్ర) తదితరులు దేశానికి కొత్త ఆశలు తొడిగారని కొనియాడారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో దేశం నలుమూలల నుంచి 11 వేలమంది అథ్లెట్లు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

తొడసం కైలాస్ శభాష్

తెలంగాణ ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యాయుడు తొడసం కైలాస్ గిరిజన భాష పరిరక్షణకు చేస్తున్న కృషిని ప్రధాని కొనియాడారు. 'కొలామి' భాషలో గీతానికి స్వరరచన చేసేందుకు ఆయన ఏఐని వినియోగించారని ప్రశంసించారు. ఈయన మహాభారత్ పుస్తకాన్ని 3నెలల్లో గోండు భాషలోకి అనువదించారు. రామకృష్ణ మఠం 5సంపుటాల్లో వెలువరించిన బాలల మహా భారతాన్నీ అనువదించారు. ఆ భాషలో యూట్యూబ్ చానెల్ కూడా నడుపుతున్నారు.



ఛత్తర్‌పూర్‌లోని బాలాజీ గుడిలో మోదీ పూజలు

హిందువులపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

చూస్తున్నారని మండిపడ్డారు. మహాకుంభమేళా నిర్వహణ ప్రతి ఒక్కరినీ విస్మయానికి గురిచేస్తోందన్నారు. ఇది భావి తరాలకు ఐక్యతాచిహ్నంగా నిలుస్తుందని తెలిపారు. 'హిందూ విశ్వాసాన్ని ద్వేషించేవారు శతాబ్దాలుగా అక్కడక్కడా ఉంటూనే ఉన్నారు. వీరికి మద్దతివ్వడం ద్వారా విదేశీ శక్తులు కూడా మన దేశాన్ని, మతాన్ని బలహీనపరచాలని చూస్తున్నాయి. సమాజాన్ని విభజించి ఐక్యతను బద్దలు కొట్టడమే వారి ఎజెండా' అని మోదీ విమర్శించారు. కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై మమత, అఖిలేశ్, ఖర్గే విమర్శలు చేసిన నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. మహాకుంభమేళాను విజయవంతం చేయడంలో పారిశుద్ధ్య కార్మికులు, పోలీసుల కృషి ఎనలేనిదన్నారు. వేల మంది వైద్యులు, వలంటీర్లు అంకిత భావంతో, సేవాస్ఫూర్తితో పనిచేస్తున్నారని కొనియాడారు.

ప్రస్తుతానికి కాంగ్రెస్‌లోనే ఉన్నా

పార్టీ నన్ను వద్దనుకుంటే నాకూ ప్రత్యామ్నాయాలు ఉన్నాయి: థరూర్



తిరువనంతపురం, ఫిబ్రవరి 23: ప్రస్తుతానికి కాంగ్రెస్‌లోనే ఉన్నానని, తన సేవలను వినియోగించుకోకూడదని పార్టీ భావిస్తే గనుక తనకూ ప్రత్యామ్నాయాలు ఉన్నాయని కాంగ్రెస్ సీనియర్ ఎంపీ శశి థరూర్ తేల్చిచెప్పారు. అయితే, పార్టీ మారుతున్నట్టు వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కలవడాన్ని, అలాగే, కేరళలోని వామపక్ష ప్రభుత్వ విధానాలను శశి థరూర్ ప్రశంసిస్తూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన నేపథ్యంలో తాజాగా మలయాళం పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న కేరళలో కొత్త ఓటర్లను ఆకర్షించడం ద్వారా పార్టీని విస్తరించాలని పిలుపునిచ్చారు. లేనిపక్షంలో వరుసగా మూడోసారీ కేరళలో ప్రతిపక్షంలోనే పార్టీ కూర్చోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు. కేరళలో పార్టీకి నాయకత్వం లోపించిందనే తన అభిప్రాయాన్ని పార్టీలోని ఇతర నేతలూ సమర్థిస్తున్నారన్నారు. కేరళ సీఎం పదవికి తాను అర్హుడినని పునరుద్ఘాటించారు. స్వతంత్ర సంస్థలు నిర్వహించిన ఒపీనియన్ పోల్స్.. కేరళ కాంగ్రెస్‌లో తననే ముందు వరుసలో నిలిపినట్టు చెప్పారు. కాగా, మోదీని, వామపక్ష ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన నేపథ్యంలో ఈనెల 18న ఢిల్లీలో పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని శశిథరూర్ కలిశారు. గంటన్నర సేపు ఏకాంతంగా జరిగిన ఆ భేటీలో కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లానని శశిథరూర్ చెప్పారు. పార్టీలో తనను పక్కన పెట్టడంపై ఫిర్యాదు చేశారా? అని ప్రశ్నించగా, లేదని సమాధానం ఇచ్చారు. దేశ, రాష్ట్ర విస్తృత ప్రయోజనాల కోసమే ఆ ప్రశంసలు చేశానని, ఎల్లప్పుడూ పార్టీ ప్రయోజనాల కోసమే మాట్లాడటం తనవల్ల కాదని తేల్చిచెప్పారు. తానెప్పుడూ సంకుచిత రాజకీయ ఆలోచనలతో లేనన్నారు.

బీజేపీని ఎలా ఎదుర్కొందాం?

(మొదటి పేజీ తరువాయి)

సవాళ్లు, రాజ్యాంగం, దాని విలువలపై ఆ పార్టీ చేస్తున్న దాడులను ఎదుర్కొనే వ్యూహాలపై ఈ సమావేశాల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించింది. గతేడాది డిసెంబరులో కర్ణాటకలోని బెళగావిలో జరిగిన నవ సత్యాగ్రహ భేటీలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఏప్రిల్ 8న సీడబ్ల్యూసీ సమావేశం.. 9న ఏఐసీసీ ప్రతినిధుల సమావేశం ఉంటుందన్నారు. ఈ భేటీలకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అధ్యక్షత వహిస్తారని.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, జాతీయ కార్యాలయ ఆఫీస్ బేరర్లు, ఏఐసీసీ ప్రతినిధులు, సీనియర్ నేతలు ఇందులో పాల్గొంటారని పేర్కొన్నారు.



పొల్లాచ్చి రైల్వేస్టేషన్‌లో హిందీ నేమ్ బోర్డుకు తారు

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం ద్వారా హిందీని నిర్బంధంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ తమిళనాడు రాష్ట్రం పొల్లాచ్చిలో డీఎంకే న్యాయవిభాగం సభ్యులు ఆదివారం ఆందోళన చేపట్టారు. పొల్లాచ్చి రైల్వే స్టేషన్ నేమ్‌బోర్డులో హిందీ భాషలో ఉన్న స్టేషన్ పేరుకు తారుపూశారు. ఆ తర్వాత రైల్వేస్టేషన్ ఎదుట నిలిచి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీఎంకే కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ వెళ్లిపోయిన పావుగంట కల్లా రైల్వే అధికారులు హిందీ తెలిసిన పెయింటర్‌ను తీసుకువచ్చి నేమ్‌బోర్డుపై తారుపూసిన చోట పసుపురంగు పెయింట్ పూసి, ఆ చోట మళ్లీ హిందీలో స్టేషన్ పేరు రాయించారు.

రైతుబిడ్డ రాజసం!

ఎవరైనా ఒడ్డూపొడుగు ఉండి ఠీవిగా కనిపిస్తే ఒంగోలు గిత్తలా ఉన్నాడంటాం. ఎద్దులలో అనేక జాతులు ఉన్నప్పటికీ ఒంగోలు జాతి గిత్తలకు ఉన్న క్రేజ్ ఇది. బ్రెజిల్‌లో నిర్వహించిన వేలంలో వియాటినా 19 రకం ఒంగోలు జాతి ఆవు రూ.41 కోట్ల ధర పలకడంతో అందరి దృష్టిని విశేషంగా ఆకర్షించాయి. చూడటానికి ఒంగోలు గిత్తలు ఎంత అందంగా ఉంటాయో, అవి బరిలో దిగి కలబడే తీరూ అంతే అందంగా ఉంటుంది. ఇక..ఒంగోలు జాతి ఆవుల పరంగా చూస్తే రోజుకు 20లీటర్ల పాలు ఇస్తాయి. అయితే, రచ్చ గెలిచిన ఈ జాతి ఇంట మాత్రం తగ్గిపోతోంది. వాటికి మేత దొరకడమే కష్టంగా ఉంది. వీటి సంరక్షణ రైతులకు కష్టంగా మారింది. కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందకపోతే ఒంగోలు జాతి ఎడ్ల మనుగడే ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉంది.

ఖండాంతర ఖ్యాతి గడించిన ఒంగోలు గిత్త


ఒంగోలు జాతి ఎద్దులు

- పశుజాతిలో రారాజుగా శతాబ్దాల కీర్తి
- బ్రెజిల్ వేలంలో రూ.41 కోట్లు పలికిన ఒంగోలు ఆవు
- రచ్చ గెలిచినా ఇంట తగ్గిపోతున్న జాతి
- నేడు ఆదరణలేక మనుగడ ప్రశ్నార్థకం
- రాష్ట్రంలో పోషకులూ, శిక్షకులూ కరువు
- రూ.23 కోట్లతో ప్రభుత్వం ప్రతిపాదనలు
- పూర్తి సంరక్షణకు 85 కోట్లు అవసరం

ఆకారంలో, కొమ్ముల రూపులో విలక్షణత! విశాలమైన కాళ్లు, వెడల్పాటి నుదురు, పెద్ద చెవులు, గంగడోలు, ఎత్తయిన మోపురం. చిన్న మొహం... ఇలా ఒంగోలు జాతి గిత్తలకు ఎన్ని ప్రత్యేకతలో! ఒంగోలు జాతి పశువులకు జన్మస్థానం ప్రకాశం జిల్లా గుండ్లకమ్మ పరీవాహక ప్రాంతం. ఆ ప్రాంతంలోని ఉలిచి, కరవది తదితర గ్రామాల్లో ఈ జాతి పశువులు ఎక్కువగా కనిపిస్తాయి. ఒకప్పుడు ఎక్కడ పందేలు జరిగినా ఒంగోలు జాతి గిత్తదే విజయం. దీంతో ఈ జాతి పేరు ఖండాంతరాలకు వ్యాపించింది. బలిష్ఠంగా ఉండటంతో పాటు ఆరోగ్యంగా కూడా ఉంటాయని పేరు. అలాగే ఎంత బరువైనా లెక్కచేయకుండా బండిని లాగుతాయి. పౌరుషానికి పెట్టింది పేరు. ఒంగోలు జాతి పశువులను గురించి తెలుసుకున్న బ్రెజిల్ దేశం తొలిసారిగా 1863లో తమ దేశానికి ఈ జాతి పశువులను దిగుమతి చేసుకుంది. 1950 ప్రాంతంలో కరవది గ్రామానికి చెందిన ఓ రైతు నుంచి ఒంగోలు జాతి ఎద్దును పెద్ద ధరనే చెల్లించి బ్రెజిల్ దేశస్థులు కొనుగోలు చేసి తమ దేశానికి ఓడలో తరలించారు. ఈ విషయం అప్పట్లో జనం గొప్పగా చెప్పుకొనేవారని పెద్దలు చెబుతుండేవారు. తొలుత బ్రెజిల్‌లో, అనంతరం పలు దేశాల్లో ఒంగోలు జాతి పశు సంపద అభివృద్ధి చెందుతూ వస్తోంది. ఇటీవల బ్రెజిల్‌లో నిర్వహించిన వేలంలో వియాటినా 19 రకం ఒంగోలు జాతి ఆవు రూ.41 కోట్ల ధర పలికింది.

నవ నలుపులు ప్రత్యేకం

చక్కటి శరీర సౌష్టవం, రాజసం ఉట్టిపడే నడక ఒంగోలు జాతి గిత్తల ప్రత్యేకత. గిత్తల శరీరంపై తొమ్మిది భాగాల్లో నలుపు వర్ణం ఉంటుంది. మేలుజాతి ఒంగోలు ఎడ్లను బేరం చేసేవారు ప్రత్యేకంగా దీనిని పరిశీలిస్తారు. ఎద్దు ముట్టే, తోక చివర భాగం, చెవి అడుగుభాగం, బొడ్డు, గిట్టల వెనుక భాగం, మోపురం, ఎద్దు మడి, కనుబొమ్మలు, వృషనాల కిందభాగంలో నలుపులను చూస్తారు. ఎద్దు శరీరంపై సుడులు ప్రత్యేకంగా ఉంటాయి. ఎద్దు నుదిటిపై, వెన్నెముకపై, తోక వద్ద, చంక వద్ద సుడులను బేరగాళ్లు ప్రత్యేకంగా చూస్తారు. తప్పు సుడులు ఉంటే ఆ గిత్తను సాకేందుకు రైతులు ఇష్టపడరు. గంగిరెద్దుల వారికి ఇస్తుంటారు.

పది గిత్తలతో ప్రయోగాత్మకంగా..

ఒంగోలు ప్రాంతంలోని చదలవాడలో ఏర్పాటైన పశుఉత్పత్తి క్షేత్రంలో సెమన్ కోసం గిత్తలను పెంచుతున్నారు. గతంలో టీజర్ బుల్ మాత్రమే ఈ క్షేత్రంలో ఉండేది. ప్రస్తుతం ఇక్కడే పుట్టిన పది గిత్తలను తొలిసారిగా సెమన్ కోసం ప్రత్యేకంగా సాకుతున్నారు. రెండు నుంచి రెండున్నరేళ్లు ఉన్న ఈ గిత్తలు మరో ఏడాదిలో సెమన్ ఉత్పత్తికి సిద్ధంగా ఉంటాయి. అయితే సెమన్ సేకరణ, నిల్వలకు సరైన ల్యాబ్‌లు ఈ క్షేత్రంలో లేవు. మరోవైపు గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో గత ఐదేళ్లు ఒంగోలు గిత్తలు తమ విశిష్ఠతను కోల్పోవాల్సి వచ్చింది. పోషణ కష్టం కావడంతో రైతాంగం వాటిని అమ్మేసుకోవాల్సిన పరిస్థితి!

అక్రమ మార్గంలో బ్రెజిల్‌కు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర దేశాలకు ఒంగోలు జాతి ఎద్దుల ఎగుమతిని నిలిపివేశాయి. దీంతో బ్రెజిల్ సహా పలు దేశాలకు చెందిన వారు ఒంగోలు ఎడ్లను స్థానికంగా కొనుగోలు చేసి గుజరాత్ రాష్ట్రంలో వాటి యాంబ్రియోలను (పిండాలు) సేకరించి వాటిని అక్రమ మార్గంలో వారి దేశాలను తరలిస్తున్నారు.! తద్వారా వారి వద్ద ఇప్పటికే వృద్ధి చెందిన ఒంగోలు జాతి పశుసంపదలో జన్యుపరమైన నాణ్యతను పెంచుకుంటున్నారు. అయితే, ఒంగోలు ఎద్దుల పుట్టినిల్లు అయిన ప్రకాశం జిల్లాలో యాంబ్రియో (పిండం) తయారీ కేంద్రం లేదు. గుంటూరు లాంఫాంల నుంచి నెల్లూరు జిల్లా చింతల దీవి నుంచి యాంబ్రియోలు సరఫరా అవుతుంటాయి.

ఇది కదా పౌరుషమంటే..!

బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన రైతు పోపూరి శ్రీనివాసరావు ఒంగోలు జాతి ఎడ్లను పోషిస్తున్నారు. ఆయన వద్ద ఉన్న ఎడ్లు వందసార్లు బల ప్రదర్శన పోటీల్లో 60సార్లు పతకాలు గెలిచాయి. ఒకసారి తెలంగాణలో జరిగిన పోటీల్లో పతకం సాధించిన తర్వాత బ్రెజిల్‌కు చెందిన వ్యక్తి 3 జతల ఎద్దులకు రూ.1.80 కోట్లు ఇస్తానని ఆఫర్ ఇచ్చినా, శ్రీనివాసరావు అందుకు అంగీకరించలేదు. 'పశువులను అమ్ముకుని బతుకుతా రు' అని ఆ వ్యక్తి ఎగతాళిగా మాట్లాడటం తనను బాధించిందని, అందుకే అమ్మలేదని శ్రీనివాసరావు చెప్పారు.

- ఒంగోలు కల్చరల్, మార్టూరు, పర్చూరు- ఆంధ్రజ్యోతి

పడిపోతున్న ఎద్దు బరువు

గతంలో ఒంగోలు జాతి గిత్తలు 1,300 కిలోలు ఉండేవి. వ్యవసాయంలో వాటి ఉపయోగం లేకపోవడం, వాటిని సాకడం రైతులకు వ్యయప్రయాసగా మారడంతో క్రమేపి వీటిని పెంచేవారి సంఖ్య తగ్గుతోంది. దీంతో క్రమేపి బరువు 1,100కు పడిపోతోంది.

చంద్రబాబు చొరవతో..

ఒంగోలు జాతి పశుసంపదను పరిరక్షించేందుకు నాగులుప్పలపాడు మండలంలోని చదలవాడ పశుఉత్పత్తి క్షేత్రాన్ని అప్పటి సీఎం చంద్రబాబు చొరవతో ఏర్పాటు చేశారు. 1980 వరకు ఈ క్షేత్రం ప్రకాశం జిల్లా రామతీర్థం వద్ద ఉండేది. ఆ ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలు వృద్ధి చెందడంతో వేరొక ప్రాంతానికి తరలించాలని అప్పటి ప్రభుత్వం యోచించింది. ఈ క్రమంలోనే నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ వహించి, చదలవాడలో 200 ఎకరాలలో పశుక్షేత్రం ఏర్పాటు చేయించారు. ఇక్కడ ప్రస్తుతం 330 పశువులున్నాయి. మార్క్‌ఫెడ్ ద్వారా దాణా తెప్పిస్తారు. ఏటా విజయవాడకు చెందిన వీబీఆర్ ఇనిస్టిట్యూట్ వైద్యులు ఇక్కడి పశువుల రక్తన మూనాలను సేకరించి టీబీజేడీ, తెప్టస్వారా, బ్రూసెల్లా లాంటి వ్యాధులకు గురికాకుండా పర్యవేక్షిస్తుంటారు. ప్రతి మంగళవారం పలు పరీక్షలు చేస్తారు. సరోగసి విధానం ద్వారా ఒంగోలు జాతి పశుసంతతి వృద్ధి చేస్తుండడం ఇక్కడ ప్రత్యేకత. అయితే, 2019లో వైసీపీ వచ్చిన తర్వాత ఈ క్షేత్రాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం పశుక్షేత్రంపై దృష్టి సారించింది. రూ. 23 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే, పూర్తిస్థాయిలో ఒంగోలు గిత్తలను సంరక్షించాలంటే రూ. 85 కోట్లు అవసరం అవుతాయని వ్యవసాయ పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థులతో వంట పని!

- నెల్లూరు జిల్లా గండిపాళెం గురుకుల పాఠశాలలో వెలుగులోకి

ఉదయగిరి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వంటపనిలో విద్యార్థులా... నిజమే...నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలం గండిపాళెం గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థులు ఇదే పని చేస్తున్నారు. ఆదివారం ఉదయం పాఠశాలలో అల్పాహారం అందించేందుకు తెల్లవారుజామున మూడు గంటల నుంచి వంటశాలలో వీరు 45 కిలోల గోధుమపిండితో సుమారు 1500 చపాతీలు సిద్ధం చేస్తూ కనిపించారు. విద్యాబుద్ధులు నేర్చుకుంటారని పంపితే, తమ పిల్లలతో ఇలా వెట్టిచాకిరీ చేయించడం దారుణమని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రిన్సిపాల్ పుష్పరాజ్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా, ప్రతి ఆదివారం పాఠశాలలో విద్యార్థులు చపాతీలు చేస్తూ వంట కార్మికులకు సహకరిస్తుంటారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లానని సమాధానం ఇచ్చారు.



అడవిపై పెత్తనం కోసమే ఆదివాసీలపై దమనకాండ

- కగార్‌కు వ్యతిరేకంగా బలమైన ప్రజాఉద్యమం నిర్మించాలి
- రెండు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ తీర్మానం

అమరావతి/విజయవాడ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అడవిలోని అపారమైన ఖనిజాలను కార్పొరేట్ వర్గాలకు దోచిపెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం దండకారణ్యంపై దమనకాండను ప్రదర్శిస్తోందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ఆదివాసీలకు అండగా ఉన్న నక్సల్స్‌ను నిర్మూలించేందుకు ఆపరేషన్ కగార్ వంటి దుర్మార్గపు యుద్ధాన్ని కేంద్రం సొంత ప్రజలపై చేస్తోందని దుయ్యబట్టింది. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని రెండు విప్లవ పార్టీల విలీన సభ తీర్మానించింది. ఆదివారం విజయవాడలోని ఎంబీ భవన్‌లో రెండు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను నిర్వహించారు. తొలుత నగరంలో ర్యాలీ నిర్వహించారు. శ్రీకాకుళం, గోదావరిలోయ, దండకారణ్యం, బస్తర్ ఉద్యమాల్లో మరణించిన నేతలకు నివాళులర్పించారు. సభలో మూడు కీలక తీర్మానాలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి, కేంద్ర కమిటీ సభ్యులుగా అమరులైన చంద్ర పుల్లారెడ్డి, పైలా వాసుదేవరావు, రాయల సుభాశ్‌చంద్రబోస్(రవన్న), మాదాల నారాయణస్వామిల వర్ధంతి సభలను నిర్వహించాలని, ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా బలమైనప్రజా ఉద్యమాలు నిర్మించాలని, ఏపీలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీల అమలుకోసం ప్రజాపోరాటాలు నిర్మించాలని తీర్మానించారు.



రెండు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల విలీనం సందర్భంగా విజయవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు


సభలో అభివాదం చేస్తున్న మాల సంఘాల నాయకులు

ఎస్సీ వర్గీకరణతో మాలలకు నష్టం

- తెలంగాణ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి
- కర్నూలులో రాయలసీమ మాలల యుద్ధ గర్జన

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో మాల కులస్థులకు నష్టం కలుగుతుందని, వర్గీకరణకు వ్యతిరేకంగా గ్రామస్థాయిలో చైతన్యం తీసుకురావాలని తెలంగాణ రాష్ట్రం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పిలుపుఇచ్చారు. ఆదివారం కర్నూలు జిల్లా కేంద్రంలోని ఎగ్జిబిషన్ మైదానంలో మాలల జేఏసీ కన్వీనర్ యాట ఓబులేసు అధ్యక్షతన రాయలసీమ మాలల యుద్ధ గర్జన మహాసభ నిర్వహించారు. వెంకటస్వామి మాట్లాడుతూ మాలలు బలీయ శక్తిగా తయారు కావాలని, అందరూ కలిసి పోరాటం చేస్తేనే ఉద్యమం ఉధృతం దాలుస్తుందన్నారు. మంద కృష్ణ మాదిగ పార్లమెంటులో ఎందుకు బిల్లు ప్రవేశపెట్టలేదని ఆయన ప్రశ్నించారు. హైదరాబాదులో మాలల యుద్ధ గర్జన నిర్వహిస్తే తమపై అనేక ఆరోపణలు చేశారన్నారు. ఈ సభలో మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సత్యనారాయణ

అమరావతి: ఏపీ యానిమల్ హస్బెండరీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ కె. సత్యనారాయణ (రాజమండ్రి) ఎన్నికయ్యారు. అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం విజయవాడలో జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా ఎంఎస్ఎన్ మూర్తి(తూర్పుగోదావరి), ఉపాధ్యక్షులుగా పీఎస్‌జీ బాలకృష్ణ (శ్రీకాకుళం), ఎల్ అనిత(కోనసీమ), జి.పార్థసారథి రెడ్డి(నంద్యాల), కోశాధికారిగా వి.శ్రీధర్(తిరుపతి), సంయుక్త కార్యదర్శులుగా కె.రామకృష్ణ(అనకాపల్లి), ఎల్.విష్ణు(విజయనగరం), టి.మోహనరావు(గుంటూరు) ఎన్నికైనట్లు ఏపీ వెటర్నరీ అసోసియేషన్ ట్రెజరర్ సాయిగోపాల్ తెలిపారు.



రావణ వాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవారు.. స్వామివార్లకు పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి ఆనం

రావణ వాహనంపై ఆది దంపతులు

- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం

శ్రీశైలం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి రావణ వాహనంపై విహరించారు. స్వామి, అమ్మవార్లను రావణవాహనంపై ఆశీనులను జేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం క్షేత్ర పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో కలిసి రాత్రి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. వీరి వెంట కలెక్టర్ రాజకుమారి, శ్రీశైలం ఈవో శ్రీనివాసరావు ఉన్నారు. అలాగే విజయవాడ దుర్గామలేశ్వరస్వామి దేవస్థానం తరపున ఈవో, దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ శ్రీశైలంలో స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.


వినయ్‌చంద్‌కు శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా దేవదాయశాఖ కార్యదర్శి వినయ్‌చంద్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆయనతో ప్రమాణం చేయించారు. అనంతరం వినయ్‌చంద్ కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



బొమ్మలు: అక్బర్


చెన్నై బుక్‌ఫెయిర్‌ను చూసి నేర్చుకోవాలి!

తెలుగు జాతి మనది... నిండుగ వెలుగు జాతి మనది అని పాడుకున్నంత మాత్రాన భాష బల పడదు. మనకు గుర్తింపైన మన భాష ఎదగాలంటే స్థిరపడాలంటే బలపడాలంటే సాహితీ వేత్తలు, మేధావులు, సృజనకారులు బతకాలి. వారికి తమ ఆలోచనలను ప్రకటించుకొనే అవకాశాలు, ఆ ఆలోచనలకు అక్షర రూపాన్ని ఇవ్వగల సామాజిక, ఆర్థిక వాతావరణం ఉండాలి. తమిళ భాష కోసం 'తమిళనాడు ఇంటర్నేషనల్ బుక్‌ఫెయిర్' ఈ పని సమర్థంగా చేస్తున్నది.



గత మూడేళ్లుగా తమిళనాడు ప్రభుత్వం చెన్నైలో నిర్వహిస్తున్న 'ఇంటర్నేషనల్ బుక్‌ఫెయిర్' ఈ సంవత్సరం జనవరి 16–18 తేదీల్లో జరిగింది. తమిళ సాహిత్యాన్ని ప్రపంచానికి విస్తరించడం, ప్రపంచ సాహిత్యాన్ని తమిళులకు అందించడం దీని లక్ష్యం. ఈ ఉత్సవంలో అనేక సదస్సులు, గోష్ఠులు జరిగాయి. ఎంపికైన రచయితలు, అనువాదకులు, ప్రచురణకర్తలు వీటిలో పాల్గొన్నారు.

ప్రభుత్వం ఈ ఉత్సవానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చిందంటే అక్కడి సాంస్కృతిక మంత్రి, విద్యా మంత్రి, పుస్తక ప్రచురణ సంస్థల డైరెక్టర్లు, ఆఖరికి ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఈ సభల్లో పాల్గొన్నారు. ముగింపుగా శశిధరూర్ చక్కని ఉపన్యాసం ఇచ్చారు. భాషల అనుసంధానం అనువాదాలతో సాధ్యమని, ఆలోచనలను అనుసంధానించి, అభివృద్ధి కాముక పథంలో నడవాలంటే సాహిత్యంలో అనువాద ప్రక్రియకి పెద్ద పీట వేయాలని ఆయన చెప్పారు. ఈ ఏడాది 64 దేశాలు ఈ ఫెస్టివల్‌లో భాగస్వాములయ్యాయి. వచ్చే ఏడాది వంద దేశాలకు వ్యాపించాలన్నది లక్ష్యం! దాదాపు 1100 రచనలను అనువాదం చేయడానికి సంతకాలు చేసుకున్నారు. అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ తదితర యూరోపియన్ దేశాలు, ఆఫ్రికా దేశాలు ఇందులో ప్రధానంగా ఆసక్తిని కనబరిచాయి.



అనువాదాల వల్ల తమిళ దళిత సాహితీవేత్త ఇమయం ఫ్రాన్స్‌లో ఎంతో ప్రాచుర్యం పొందారట. దళిత స్త్రీల అణిచివేతను, ధిక్కార స్వరాన్ని వినిపించే ఇమయం పుస్తకం ఫ్రెంచ్ భాషలో 'లే పేరే'గా ప్రసిద్ధి పొందింది. ఒక తమిళ రచయిత ఫ్రాన్స్‌లో చిరపరిచితుడయ్యాడు.

అనువాదాల వల్ల తమిళ దళిత సాహితీవేత్త ఇమయం ఫ్రాన్స్‌లో ప్రాచుర్యం పొందారట. దళిత స్త్రీల అణిచివేతను, ధిక్కార స్వరాన్ని వినిపించే ఇమయం పుస్తకం ఫ్రెంచ్ భాషలో 'లే పేరే'గా ప్రసిద్ధి పొందింది. ఒక తమిళ రచయిత ఫ్రాన్స్‌లో చిరపరిచితుడయ్యాడు. హిందీ, బెంగాలీ, మలయాళం, కన్నడ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులు తమిళం నుంచి తమ తమ భాషల్లోకి చేసిన అనువాదాలను వివరించారు. తమ భాషల నుండి తమిళంలోకి జరిగిన అనువాదాలను కూడా చర్చించారు. ప్రఖ్యాత తమిళ రచయిత్రి లక్ష్మి అనువాదాలు చేసేటప్పుడు తమిళ సాంప్రదాయాలను వివరించడంలో అనువాదకులు నిర్లక్ష్యం చేయకూడదని గట్టిగా పట్టుబట్టారు. అనువాదం అంటే కథ చెప్పడం మాత్రమే కాదని, సంస్కృతిని, అలవాట్లను, ఆచారాలను కూడా ప్రతిబింబించాలని అన్నారు.

భాషకు సంబంధించి ఇప్పటికే ద్రవిడ ఉద్యమం వలన తమిళనాడు ప్రభుత్వం అక్కడి సైన్ బోర్డులన్నీ తమిళం లోనే ఉండాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో తమిళ భాషనే వాడాలని తీసుకున్న నిర్ణయాలను కచ్చితంగా అమలు చేస్తున్నది. బడులలో తమిళం నేర్చుకోవడం తప్పనిసరి చేసి, తమిళ భాషా ఉపాధ్యాయులకు మంచి వేతనం ఇస్తూ ఎనలేని గౌరవం అందిస్తున్నది. రచయితలకు పారితోషికాలను ఏటేటా పెంచుతున్నది. లైబ్రరీలను ప్రోత్సహిస్తున్నది. లైబ్రరీలకు పుస్తకాలు అందజేస్తున్నది. అదనంగా ఇప్పుడు చేసిన ఉత్సవం రచయితలకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చేదిగా ఉంది. దానికి కొనసాగింపుగా ఈ అనువాద ఉద్యమం.

ఈ ఏడాది ఉత్సవంలో ప్రాచీన సాహిత్యం, వాడుక భాష కవిత్వం, కథ, నవల; దళిత, స్త్రీవాద సాహిత్యాలతో పాటుగా తమిళంలో సృష్టించబడుతున్న కొత్త పదాలు, డిక్షనరీల వంటి అంశాలు చర్చకు వచ్చాయి. పరిశోధనలకి ఆ ప్రభుత్వం చక్కటి అవకాశం ఇస్తున్నది. ఈ ఏడు జరిగిన చర్చలో ఒక పండితుడు, పరిశోధకుడు సంస్కృతంలోని 470 పదాలు తమిళంలోనివని రుజువు చేశారు. ఈ మధ్యనే జరిగిన తవ్వకాలలో దాదాపు బి.సి.3500 ఏళ్ల కిందటే తమిళనాడులో ఇనుము వాడకం జరిగినట్టు బయటపడింది. తమిళ శిలా ఫలకాలు దొరికాయి. ఈ ఉత్సవంలో ఈ అంశాలపై చర్చ జరిగింది.

ఇంతటి కోలాహలంలో తెలుగు స్వరం మూగపోవడం బాధాకరం. ఇక్కడి ఏ చర్చలోను ఏ వేదిక పైనా మన ప్రాతినిధ్యం లేదు. మనం కూడా తమిళ సాహిత్యాన్ని తర్జుమా చేసుకుంటున్నాం. మన సాహిత్యం కూడా తమిళంలోకి అనువాదం అవుతూనే ఉంది. కానీ ఏ వేదిక మీదా మనం కనిపించలేదు. భాష బతకాలంటే రచయితలకు అవకాశాలు ఉండాలి. ఆ ప్రాపకం ప్రభుత్వమే ఇవ్వాలి. రచయితలను అనువాదకులను ప్రచురణకర్తలను ఒకచోట చేర్చాలి. అందుకు ప్రభుత్వం అండదండలు ఇవ్వాలి. భాషాభిమానం గురించి గొప్పలు చెప్పకోకుండా, పూని ఏదైనా చేసినప్పుడే తెలుగు భాష బతుకుతుంది. వెలుగుతుంది. స్థిరపడుతుంది. జాతి గర్వంగా నిలబడుతుంది.

■ కె. ఉషారాణి

నీడలు కాదు, సమవుజ్జీలు

ఆర్. వసుంధరాదేవి, ఆచంట శారదాదేవి, శివరాజు వెంకట సుబ్బలక్ష్మి, అబ్బూరి ఛాయాదేవి, కె. రామలక్ష్మి – వీళ్ళందరి మధ్యా ఒక సామ్యం ఉంది. వారి భర్తలైన ఆర్.ఎస్. సుదర్శనం, ఆచంట జానకీరామ్, బుచ్చిబాబు, అబ్బూరి వరదరాజేశ్వరరావు, ఆరుద్రలకు తెలుగు సాహితీ ప్రపంచంలో ఒక విశిష్ట స్థానం ఉంది. అయినప్పటికీ వాళ్ళు భర్తచాటు భార్యల్లాగా ఉండిపోలేదు. రచయిత్రులుగా మర్రి చెట్ల నీడన కూడా మొలకలెత్తారు. శాఖోపశాఖలుగా విస్తరించారు. తమకంటూ ఒక అస్తిత్వం సాధించుకున్నారు.

ఆర్. వసుంధరాదేవి కథలుగా అందుబాటులో ఉన్నది నలభై ఎనిమిది కథలు మాత్రమే. కొన్ని రచనలకు ఏకబిగిన చదివించే లక్షణం ఉంటుంది. కానీ ఈ నలభై ఎనిమిది కథలను మాత్రం ఏకబిగిన చదవలేం. ఒక్కో కథ పూర్తవగానే మనసు ఏదో తెలీని భారంతో నిండిపోతుంది. సాంద్రతతో బరువెక్కిన లోతైన పదాలు, వాక్యాలు, ఆ బరువునీ, దిగులునీ మన గుండె లోతుల్లోకి ప్రతిష్ఠిస్తాయి. చదువుతున్నంతసేపూ మనకే తెలియని ఒక నిర్వేదంలో చిక్కుకుపోయి ఊపిరాడనివ్వని గాఢమైన అనుభూతికి లోనవుతాం. ఒక పక్క అమృతం, ఒక పక్క హాలాహలంగా ఆలోచన రెండు రెండుగా విడిపోతుంటుంది. "ఈ మానవజాతి ఎదుటి మనిషితోనూ, అతని సుఖదుఃఖాలతోనూ, కష్టనిష్ఠూరాలతోనూ సంబంధం కోల్పోవడాన రోగగ్రస్థమై పోతున్నది. మానవజాతిని ఏడ్చే నవ్వే మనుషులుగా, ఎదుటివాళ్ళను అర్థంచేసుకునే వాళ్ళుగా ఉండనీ స్వామీ" (పెంజీకటికవ్వల) లాంటి వాక్యాలు, పదబంధాలు ఆర్. వసుంధరాదేవి ప్రతిభకు, భావ వ్యక్తీకరణకు నిదర్శనం. శారదాదేవి కథల్ని కథలనే దానికన్నా ఆలోచనా శకలాలు అనవచ్చు. ఒక విషయం గురించి ఆలోచన ప్రారంభమై క్రమంగా విస్తరించి చివరికి కథగా మారిపోతుంది. అందుకే కె. రామలక్ష్మి శారదాదేవి కథల్ని 'లౌడ్ థింకింగ్' అంటారు.

ఆచంట శారదాదేవి కథలు ఎక్కడో ఆకాశం లోంచి ఊడిపడ్డట్టు ఉండవు. దిగజారిపోతున్న మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు, నైతిక విలువలు సమాజపు పోకడలు – వీటి చుట్టూ కథలు నడుస్తుంటాయి. ఎక్కడో సముద్ర గర్భంలో మొదలైన అల



తన ప్రయాణం మొదలుపెట్టి ఉవ్వెత్తున కెరటంలా ఎగసిపడి తీరంచేరడం ఎంత సహజంగా క్రమబద్ధంగా జరిగి పోతుందో శారదాదేవి కథ ఎత్తుగడ, నడక అంతే సహజంగా జరిగిపోతుంది. సమస్యలు వస్తుంటాయి. పోతుంటాయి. కానీ జీవితం మాత్రం అలాగే ఉంటుంది. జీవన క్రమంలో ఎదురైన సమస్యలను ఓర్పుతో నేర్పుతో పరిష్కరించుకోవడంలోనే మనిషి ప్రతిభ దాగుంటుంది అనే భావన అనేక కథల్లో అంతర్లీనంగా ప్రవహిస్తుంటుంది. 'కారుమబ్బులు', 'ఇరుగూ పొరుగూ', 'ప్రేమ పెళ్ళి', 'పగడాలు', 'పారిపోయిన చిలక', 'నిద్రలేని రాత్రి', 'తెల్లార్తే ముహూర్తం' లాంటి కథలన్నీ ఏ కథకు ఆ కథ ఒక ఆణిముత్యం.

శివరాజు వెంకట సుబ్బలక్ష్మి దాదాపు యాభై కథల వరకూ రాశారు. మొదట మొదట తనకు కథలు రాయడం అంత అలవాటు లేదని, బుచ్చిబాబు గారి కోసం ఇంటికి వచ్చే స్నేహితులు, అతిథులు 'మీరేం చేస్తుంటారు' అని అడుగుతుండడంతో చిన్నగా కథలు రాయడం ప్రారంభించానని చెప్పే శివరాజు వెంకట సుబ్బలక్ష్మి మంచి చిత్రకారిణి కూడా. సుబ్బలక్ష్మిగారి కథలన్నీ ఒక స్త్రీ హృదయంలోంచి వచ్చే కథలు. స్త్రీలు మాత్రమే రాయగలిగిన కథలు. పురుషుడు ఎంత ప్రతిభావంతుడైనా స్త్రీ స్వభావాన్ని తనకు అర్థమైన రీతి లోనే ఆవిష్కరించగలడు. ఒక స్త్రీ మాత్రమే మరొక స్త్రీ నిగూఢమైన అంతరంగ లోతుల్ని వెదికి పట్టుకోగలదు. ఆ రకంగా శివరాజు సుబ్బలక్ష్మి కథలు మధ్యతరగతి స్త్రీల మనో విశ్లేషణ కథలని చెప్పుకోవచ్చు. 'అదృష్టరేఖ', 'నీలంగాటు అయ్యగారు', 'తీర్పు', 'కావ్య సుందరి కథ', 'ఒడ్డుకు చేరిన కెరటం', 'మనోవ్యాధికి మందుంది', 'శివరాజు సుబ్బలక్ష్మి కథలు' లాంటి ఆమె నవలలు, కథల్లోని పాత్రలన్నీ సమస్యల్ని సహనంతో ఎదుర్కొంటాయి తప్ప ఆత్మహత్య పరిష్కారం అనే దిశగా పయనించవు.

అబ్బూరి ఛాయాదేవి అబ్బూరి వరదరాజేశ్వరరావు ఛాయ, ప్రచ్ఛాయ కాకుండా అబ్బూరి ఛాయాదేవిగా స్వయంసిద్ధ రచయిత్రి. ఛాయాదేవిపై చలం, జిడ్డు కృష్ణమూర్తి ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే ఎంతో సంక్లిష్టమైన జిడ్డు కృష్ణమూర్తి రచనల్ని కూడా ఆమె ఎంతో ప్రతిభావంతంగా, మూలంలోని అర్థం, భావం ఏ మాత్రం చెడకుండా అచ్చతెలుగులో అనువాదం చేసి విమర్శకుల ప్రశంసలు సైతం అందుకున్నారు. 'తన మార్గం' అనే కథా సంకలనానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న అబ్బూరి ఛాయాదేవి మధ్య తరగతి కుటుంబాలలోని స్త్రీలు ఎదుర్కొనే సమస్యలు, పురుషాధిక్య సమాజంలో అడుగడుగునా స్త్రీలు ఎదుర్కొనే వివక్ష ప్రధానంగా కథలు రాయడమే కాకుండా ఆ అనాచారాలన్నిటినీ ధైర్యంగా ప్రశ్నించాలని అంటారు. ఆడపిల్లల పెంపకంలోనూ, మగపిల్లల పెంపకంలోనూ వివక్ష చూపిస్తూ వివాహం అయిన తర్వాత బోన్సాయి మొక్కలానే స్త్రీల రెక్కల్ని కూడా కత్తిరించి 'భార్య' అనే బిరుదు తగిలించి ఆమెను కూడా బోన్సాయి మొక్కలా తయారు చేయడాన్ని తప్పు పడతారు ఛాయాదేవి ('బోన్సాయి బ్రతుకు'). తండ్రి అంటే భయం తప్ప తండ్రి ప్రేమ, ఆత్మీయ స్పర్శ తెలియని కూతురి వేదనీ; భర్తల ఆధిపత్యం కింద నలిగిపోయే భార్యల అంతర్మథనాన్నీ... ఇలా ప్రశ్నించడానికి అవకాశం వచ్చిన ఏ సందర్భాన్నీ ప్రశ్నించకుండా వదిలిపెట్టరు ఛాయాదేవి.

'తెలుగు స్వతంత్ర'లో సబ్ ఎడిటర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన కె. రామలక్ష్మి ఆరుద్ర సతీమణి గానే కాకుండా కె. రామలక్ష్మిగానే సుప్రసిద్ధులు. తొంభై రెండేళ్ళ జీవితంలో రామలక్ష్మి 'మెరుపు తీగె', 'అవతలి గట్టు', 'ఆంధ్రనాయకుడు', 'మానని గాయం', 'నా కూతురు ఫెమినిస్ట్' తదితర నవలలు; 'ఏ సర్టిఫికెట్', 'అందుకో ఈ ప్రేమలేఖ', 'అందమైన పొరుగు', 'అద్దం', 'అదెక్కడ' లాంటి అసంఖ్యాక కథలతో తెలుగు సాహితీ ప్రపంచంలో శాశ్వతంగా స్థానం సంపాదించుకున్నారు. సంప్రదాయకతకు, ఆధునికతకు మధ్య సంధియుగంలోని మధ్యతరగతి కుటుంబాలు, ఆ కుటుంబాల్లోని ఆడపిల్లలు, భార్యలు ఎదుర్కొన్న అనేక సమస్యల గురించి, స్త్రీల హక్కుల గురించి, స్త్రీల ఇంటి చాకిరికి గుర్తింపు లేకపోవడం గురించి ప్రశ్నిస్తారు రామలక్ష్మి. కేవలం రచనలకే పరిమితం కాకుండా మహిళా సంక్షేమ సంస్థలతో కూడా కలసి పనిచేసిన రామలక్ష్మి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసింది ఒకటుంది. 1970 ప్రాంతాల్లో ఆంధ్ర పత్రిక సచిత్ర వారపత్రికలో సుదీర్ఘంగా నడిచిన కె. రామలక్ష్మి 'ప్రశ్నలు–జవాబులు' శీర్షిక గురించి. ఎవరన్నా కొంటె ప్రశ్నలు వేస్తే అంతే చురుక్కు మనిపించేలా సమాధానం ఇచ్చేవారు. ఆ ఒక్క పేజీ పాఠకుల మొహాల్లో నవ్వుల పువ్వులు పూయించేది.

1960, 70 దశకాన్ని ఒక రకంగా మహిళా రచయితల దశకంగా చెప్పుకోవచ్చు. పాఠకుల్ని అందమైన ఊహాలోకంలో కలల ప్రపంచంలో విహరింపచేసే రచనలు ఒకవైపు, అపుడపుడే మొలకెత్తుతున్న స్త్రీ అస్తిత్వపు స్పృహ, చైతన్యం, అన్నిటినీ ప్రశ్నించే ధోరణులతో కూడిన రచనలు మరోవైపు– ఈ రెండు ధోరణులు సమాంతరంగా ప్రయాణించే సాహిత్య వాతావరణం కొత్తగా ఏర్పడింది. యద్దనపూడి సులోచనారాణి, కోడూరి కౌసల్యాదేవి, పోల్కంపల్లి శాంతాదేవి తదితర రచయిత్రులు మొదటి వర్గం కాగా ఆర్. వసుంధరాదేవి, ఆచంట శారదాదేవి, మాలతి చందూర్, తురగా జానకీరాణి, కళ్యాణ సుందరీ జగన్నాథ్, రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, కె. రామలక్ష్మి, అబ్బూరి ఛాయాదేవి, పి. శ్రీదేవి తదితరులు రెండో వర్గం.

నిజానికి అప్పట్లో యద్దనపూడి తదితరుల రచనా ధోరణే ప్రధాన ప్రవాహంగా, అన్ని రకాల ఆకర్షణలు, ఆదరణలు కలిగి ఉండేది. ఆకాశమార్గాన ప్రయాణించే ఆ సాహిత్యాన్ని భూమార్గం పట్టించి రంగనాయకమ్మ, కె. రామలక్ష్మి, ఆర్. వసుంధరాదేవి తదితరులు ఆచార సంప్రదాయాల పేరుతో, మాతృత్వం పేరుతో, ఆదర్శ గృహిణి పేరుతో స్త్రీల చుట్టూ కమ్మిన మాయా మోహపు తెరలను, బంగారు సంకెళ్ళను ఛేదించడానికి అహర్నిశలూ కృషి చేశారు. 60, 70 దశకాలలోని స్వర్ణయుగపు రోజులు అంతరించి తర్వాత కొంత కాలానికి రచయిత్రుల రచనలను హేళన చేసి చిన్నచూపు చూసే ఒక కొత్త పరిణామం తలెత్తినపుడు ఈ రెండో వర్గపు రచయిత్రులే ఆ అపప్రథ నుంచీ, అవమానం నుంచీ తప్పించి ఒక రకంగా రచయిత్రుల గౌరవానికి ప్రాణ ప్రతిష్ఠ కలిగించారని చెప్పుకోవచ్చు. అందుకే ఆర్.ఎస్. సుదర్శనం ఉన్నంత వరకూ ఆర్. వసుంధరా దేవి, ఆచంట జానకిరామ్ ఉన్నంత వరకూ ఆచంట శారదాదేవి, బుచ్చిబాబు ఉన్నంత వరకూ శివరాజు వెంకట సుబ్బలక్ష్మి, అబ్బూరి వరద రాజేశ్వరరావు ఉన్నంత వరకూ అబ్బూరి ఛాయాదేవి, ఆరుద్ర ఉన్నంత వరకూ కె. రామలక్ష్మి కూడా ఉంటారు. అయితే వాళ్ళ వెనక ఛాయలుగా, ప్రచ్ఛాయలుగా కాదు. వాళ్ళ పక్కనే సరి సమానంగా, సమాంతరంగా.

■ జి. లక్ష్మి

✆ 94907 35322


శివరాజు వెంకట సుబ్బలక్ష్మి


ఆర్. వసుంధరాదేవి


కె. రామలక్ష్మి


ఆచంట శారదాదేవి


అబ్బూరి ఛాయాదేవి

నా మొదటి పుస్తకం

ఇస్మాయిల్ మాటతో సాహసించాను



కవిత్వం నన్ను నేను, నా లోపలి నానో (nano) విశాల, plural బ్రతుకు గమనం కోసం రాశాను. అద్దాల్లేని reflection కోసం కూడా. నీళ్ళు అడుగంటిపోయిన ఎండుదిబ్బల్లో కుంటల్లో ఈత వంటిది కవిత్వం అని తెలిసొచ్చింది, మొదటి కవిత్వం పుస్తకం వేసిన తర్వాతే (1994). ఒక సాయంత్రం గోదావరి ట్రెయిన్ ఎక్కుతూ మా పెద్దన్న కవి ఇస్మాయిల్ తల నిమురుతూ చెప్పిన వాక్యం నన్ను కవిత్వం అచ్చు వెయ్యడానికి ముందుకు తోసింది. "కవిత్వం నీ స్వంతం కాదు. నీదీ కాదు. అచ్చు వేసి కాలం లోకి విసిరి పారేసి... ట్రెయినెక్కి వెళ్ళిపో" అన్న ఇస్మాయిల్ గొంతు ఇప్పటికీ నన్ను వెంటాడుతూనే ఉంది. ఆ వాక్యాలే నన్ను 'దీపశిల'ను అచ్చు వేయడానికి సాహసంతో ముందుకు తోశాయి. దాని కంటే ముందు మునుపటేడులో వరుసగా నాపై కురిసిన విధ్వంస విదారక అనుభవ దినాలు... రంజని అత్యుత్తమ కవిత్వ పురస్కారాలు. శ్రీ కల్లూరి భాస్కరంగారు, కె. శ్రీనివాస్‌గారు... కవిత్వ ఎంపికల్లోని గ్రూపు రాజకీయాల కుట్రలపై సాహిత్య మాఫియా కదలికల గురించి లక్డీకాపూల్ ఇరానీ హోటల్స్ ఛాయ్ ముచ్చట్లలో చాంద్ బిస్కట్లను ముంచుకుంటూ తిన్న దినాలు, మొదటి పుస్తకం వేస్తందుకు పటం గట్టి ముందుకు తోసినాయి. 'నెల నెలా వెన్నెల' కర్త కర్మ క్రియ పూజ్యులు శ్రీ సి.వి. కృష్ణారావు గారి సత్సంగం, సుమనశ్రీ గారి సోపతి అప్పటి అస్తిత్వ రోదనల ఆపతి నన్ను 'దీపశిల' వేయటానికి పురికొల్పాయి. నా కవిత్వానుభవ జీవితమ్మీద హిమోహ రాగ సమ్మోహనం చేసిన వడ్డెర చండీదాస్ అంటే ఇష్టం నాకు. బుచ్చిబాబును తన లోనాభిలో చుట్టుకొని తనదైన కవిత్వ వచనాన్ని దిద్దుకొని పాఠకానుభవానికి తాత్త్విక కల్పనను శృతిపరిచిన చండీదాస్‌తో.. నాలుగు మాటలు 'దీపశిల' కవిత్వం మీద రాయించాలన్న కోరికను ఎమ్మెస్ నాయుడుతో ఎక్స్‌ప్రెస్ చేసాను. అది వాస్తవమయ్యింది. తిరుపతిలో భవానీపురా లోని అపార్ట్‌మెంట్‌లో వొకే వొక్క గదిలో మంచం మీద స్పైనల్ ఇంజురీకి ట్రీట్‌మెంట్ తీసుకుంటూ పడుకొని ఉన్న తనని కలిసి నా హైదరాబాదీయతను పంచుకున్నాను. అనాహతనాద ప్రస్తావన, గీతాదేవి స్వప్నరాగలీనల పాత్రల నా పాఠకానుభవాన్ని పంచుకున్నాను. నా కవిత్వమ్మీద కొన్ని మాటలు రాయమన్నాను. కవిత్వం తనకు అర్థం కాదన్నాడాయన. రెండు మూడు కవితలు చదివాను. అవి వినగానే.. పడుకునే విన్న ఆయన కండ్లల్లోంచి కన్నీళ్ళు వొలికిపోతుండడం ఇప్పటికీ మర్చిపోలేను. నేను ఇంటికి చేరుకున్న రెండు రోజుల్లోనే 'మహాహం'గా తన ముందుమాట చేరుకుంది. దానిని తన లిపి లోనే పలకరించాను. మా పాఠకుల అన్న నాళేశ్వరం శంకరం, బోనగిరి ఆంజనేయులు, అసుర తత్త్వకత్వల విచారం, మెరుపుల మలుపులూ, ఏలె లక్ష్మణ్ స్వచిత్రరేఖల గాత్రాలూ, హైద్రాబాదీ ఆబాదీ ఫొటోల జీవ వాద్యకారుడు గోవిందన్నా, నున్నా నరేశ్, పసునూరి శ్రీధర్ బాబూ, ముక్కామల చక్రధర్, చల్లా రామఫణుల కవిత్వ పఠనాల గజల్ ముషాయిరాలూ, హెచ్చార్కేల, 'గుల్షన్' స్నేహాల నుంచి, అలా నా కవిత్వ ప్రస్థానం మొదలయింది పయిలంగా అభద్రంగా.. నాపరాళ్ళను పరుసుకుంటూ వేసుకుంటూ, చింతలగతిని గీసుకుంటూ, మోసుకుంటూ, నడిచి నిలిచిందే నా మొదటి పుస్తకం 'దీపశిల'. దీని కతల కమామీషంతా తెలుగు పాఠకానుభవానికింకా మూసిన కిటికీ రెప్ప అనే తోస్తుంటుంది నాకు.



సిద్ధార్థ

✆ 73306 21563

డ్రాయింగ్ బుక్



దశాబ్దాల క్రితం
బాల్యంలో బ్రష్‌ను ముంచి
డ్రాయింగ్ బుక్‌లో
పచ్చని చెట్లూ గుట్టలూ
ఆ పక్క ప్రవహిస్తున్న నదీ
అందంగా గీసాను
అంతా మెచ్చుకున్నారు

ఇవ్వాళ ఇంట్లో దేనికోసమో
అటక మీదినుంచి
దుమ్ముపట్టిన ఓ పాత ముల్లె
తీశాను

విప్పి చూద్దును కదా
అందులో నా చిన్నప్పటి
పాత డ్రాయింగ్ బుక్ కనబడింది

ఉత్సాహంగా పేజీ తిప్పాను
ఎండిపోయిన చెట్లూ
కరిగిపోయిన గుట్టలూ
ఆ పక్కనే పారుతున్న
కన్నీళ్ళూ కనిపించాయి

నా ముఖం వాడిపోయింది

■ వారాల ఆనంద్

మఖ్దూమ్ మొహియుద్దీన్ పురస్కారం

సిటీ కాలేజ్ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కారం (2025) ప్రదానోత్సవ సభ ఫిబ్రవరి 24 ఉ.11గంటలకు హైదరాబాద్ లోని ప్రభుత్వ సిటీ కళాశాల ఆజామ్ హాల్లో జరుగుతుంది. పురస్కార స్వీకర్త నలిమెల భాస్కర్. అధ్యక్షత పి. బాలభాస్కర్, ముఖ్య అతిథి వెలుదండ నిత్యానందరావు, అతిథులు దేవులపల్లి అమర్, యాకూబ్, అన్నవరం దేవేందర్.

కోయి కోటేశ్వర రావు

మాడభూషి రంగాచార్య కథా పురస్కారం

మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కారానికి పి. శ్రీనివాస్ గౌడ్ 'మార్జినోళ్ళు' కథా సంపుటి ఎంపిక అయ్యింది. పురస్కార ప్రదాన సభ ఫిబ్రవరి 25 సా.5.30గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షులు సుధామ, ముఖ్య అతిథి విహారి, పుస్తక పరిచయం నాళేశ్వరం శంకరం. ముగ్గురు సీనియర్ రచయిత్రుల కథా విశ్లేషణ సంకలనం 'నేటి కాలపు మేటి రచయితలు' పుస్తకావిష్కరణ కూడా ఉంటుంది.

మాడభూషి లలితాదేవి

కొలకలూరి పురస్కారాలు

కొలకలూరి సాహిత్య పురస్కారాల ప్రదానం కార్యక్రమం ఫిబ్రవరి 26 సా.6గంటలకు ఎన్‌టిఆర్ ప్రాంగణం, తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. జూకంటి జగన్నాథం, టేకుమళ్ళ వెంకటప్పయ్య, గడ్డం మోహనరావు పురస్కారాలు స్వీకరిస్తారు. ముఖ్యఅతిథి డి. మాణిక్య వరప్రసాద్, అధ్యక్షత కొలకలూరి మధుజ్యోతి, విశిష్ట అతిథి కొలకలూరి సుమకిరణ్. పి.వాసు, ఎ. అనురాధ, యం. సుబ్బరాజు పరిశోధన సన్మానం అందుకుంటారు.

కొలకలూరి ఇనాక్

'తడి ఆరని వాక్యమొకటి' కవితా సంపుటి

సుధామురళి తొలి కవిత్వ సంపుటి 'తడి ఆరని వాక్యమొకటి' ఆవిష్కరణ మార్చ్ 2 ఉ.10గంటలకు నెల్లూరు టౌన్ హాల్‌లో జరుగుతుంది. ప్రసేన్, విమల, ముక్కామల చక్రధర్, శ్రీరామ్ పుప్పాల, గోపాల్ సుంకర, పెరుగు రామకృష్ణ, ఈతకోట సుబ్బారావు ప్రసంగిస్తారు.

ముక్కామల చక్రధర్

'నేల తడుముతూనే' కవితా సంపుటి

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు – తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గుండెల్లి ఇస్తారి కవితా సంపుటి 'నేల తడుముతూనే' ఆవిష్కరణ మార్చ్ 2 ఉ.10గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త నందిని సిధారెడ్డి, అధ్యక్షత కందుకూరి శ్రీరాములు, విశిష్ట అతిథి నాళేశ్వరం శంకరం, ఆత్మీయ అతిథులు రూప్ కుమార్ డబ్బీకార్, కొండపల్లి నీహారిణి, ధూళిపాళ అరుణ, బెల్లంకొండ సంపత్ కుమార్.

కందుకూరి శ్రీరాములు

కథానికల పోటీ


భూపతి చంద్ర స్మారక సంస్థ నిర్వహిస్తున్న కథానికల పోటీకు సమకాలీన సామాజిక సమస్యలను ప్రతిబింబించే ఇతివృత్తాలతో, సున్నితమైన వ్యంగ్య, హాస్యాలతో కూడిన కథానికలను పంపాలి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు. ఐదు ప్రోత్సాహక బహుమతులు ఒకొక్కరికి రూ.1,000. కథానికలను మార్చ్ 10లోగా చిరునామా: సమన్వయకర్త, 'భూపతి చంద్ర' స్మారక కథానికల పోటీ, ఆనంద నిలయం, ఇం.నం. 1-5-1020/4, బి.ఆర్. రావు నగర్, ఓల్డ్ ఆల్వాల్, సికింద్రాబాద్ – 500010కు పంపాలి. వివరాలకు ఫోన్: 9963616999.


ఎమ్.ఎల్. కాంతారావు

కథా సంపుటాలకు ఆహ్వానం

'వెన్నెల సాహితీ పురస్కారం– 2024' కోసం 2023, 2024 సంవత్సరాలలో ప్రచురించిన కథా సంపుటాలు నాలుగు కాపీలను మార్చ్ 31లోగా పంపాల్సిన చిరునామా: పర్శపెల్లి యాదగిరి, ఇం.నెం.17-3-86/35, జ్యోతి నిలయం, వినాయక్ నగర్ రోడ్ 2, సిద్దిపేట – 502103. వివరాలకు ఫోన్: 9299909516. సిద్దిపేటలో జరుగు కార్యక్రమంలో నగదు పురస్కారం అందుతుంది.

వెన్నెల సాహితీ సంగమం





అవుటర్ ఆశలు

రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం

మౌలిక సదుపాయాల కల్పనకు అవకాశాలు

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)తో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పల్లెలకు మహర్దశ పట్టనుంది. తాజాగా ఓఆర్ఆర్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం లభించింది. గ్రామీణుల భూములు, ఆస్తుల విలువ పెరగనుంది. మారుమూల గ్రామాలకు సైతం మౌలిక సదుపాయాలు సమకూరనున్నాయి. రెసిడెన్షియల్, కమర్షియల్‌గా ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందటంతో పాటు స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు రానున్నాయి.

పెట్టుబడుల ఆకర్షణతో ఉపాధి, ఉద్యోగాల కల్పన

అమరావతి, విజయవాడ, గుంటూరు నగరాలతో అనుసంధానం

పరిశ్రమల స్థాపన, పర్యాటక, ఆతిథ్య రంగాల అభివృద్ధికి బాటలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. ఎన్టీఆర్ జిల్లాలో కంచిచర్ల, వీరులపాడు, జి.కొండూరు, మైలవరం, కృష్ణాజిల్లాలో బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు, కంకిపాడు, తోట్లవల్లూరు మండలాల పరిధిలోని మొత్త 52 గ్రామాల మీదుగా ఈ అవుటర్ రింగ్ రోడ్డు వెళుతుంది. కంచికచర్ల నుంచి మొదలై జుజ్జూరు, నందిగామ, జి.కొండూరు, మైలవరం, అంపాపురం, పెద్ద అవుటపల్లి, మారేడుమాక, దావులూరు, రొయ్యూరు, చిన పులిపాకల మీదుగా గుంటూరు జిల్లాలోకి ప్రవేశిస్తుంది. అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే ఆయా ప్రాంతాలన్నింటికీ మహర్దశ పట్టనుంది. విజయవాడ ఈస్ట్ బైపాస్ ప్రతిపాదన వెనక్కిపోవటంతో నిరాశతో ఉన్న ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజల్లో అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఆశలు రేకెత్తిస్తోంది. ఓఆర్ఆర్‌ను నమ్ముకుని పెట్టుబడులు పెట్టిన వారిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అతి త్వరలోనే ఓఆర్ఆర్‌కు భూ సేకరణ నోటిఫికేషన్లు వెలువడనున్నాయి. ఏడాది మిగతా 6లో..



పర్యాటకంగా అభివృద్ధి

ఓఆర్ఆర్ వల్ల పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుంది. ఓఆర్ఆర్ అలైన్‌మెంట్ తోటపల్లిలోని బ్రహ్మయ్య లింగం చెరువు పక్క నుంచి వెళుతోంది. దీంతో బ్రహ్మయ్య లింగం చెరువు, బ్రహ్మకైలాసం వంటివి దైవక్షేత్రం పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా మరింతగా అభివృద్ధి చెందటానికి దోహదపడనుంది. ఇలా ఎన్నో ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న పర్యాటక వనరులను బట్టి పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. అలాగే హోటల్స్ రెస్టారెంట్లు, కాటేజీలతో ఆతిథ్య రంగం కూడా విస్తరించనుంది.

గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు అనుసంధానం

అమరావతి, విజయవాడ, గుంటూరు వంటి పట్టణ ప్రాంతాలతో సెమీ అర్బన్ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలకు ఓఆర్ఆర్ వల్ల అనుసంధానం ఏర్పడుతుంది. దీనివల్ల పట్టణ ప్రాంతాలతో తేలిగ్గా అనుసంధానం కావటంతో పాటు తమ ఆర్థిక కార్యకలాపాలను విస్తరించుకోవటానికి కూడా ఉపయోగపడుతుంది.



పకడ్బందీగా గ్రూప్-2 పరీక్షలు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. విజయవాడలోని 19 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 8,792 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 8,146 మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఉదయం జరిగిన పేపర్-1కు 7,376 మంది, మధ్యాహ్నం జరిగిన పేపర్ - 2 కు 7,352 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 6లో

దశ తిరిగింది..!

- మెగా ఇన్ఫ్రా దిశగా రాయనపాడు శాటిలైట్ రైల్వేస్టేషన్!
- చురుగ్గా అభివృద్ధి పనులు
- కొత్త భవనాలు, ప్లాట్‌ఫామ్‌ల విస్తరణ
- విజయవాడ రైల్వే జంక్షన్‌కు తగ్గనున్న రద్దీ

6లో

ఇంద్రకీలాద్రిపై శాస్త్రోక్తంగా సరస్వతీయాగం

6లో





బాలుర ఉసురు తీసిన చేపల వేట!

- పోలవరం కాలువలో మునిగి ఇద్దరి మృతి
- ఇద్దరూ అన్నదమ్ముల పిల్లలే
- కోడూరుపాడులో విషాదం

6లో

వర్సిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం

భవన నిర్మాణాలు, పరిపాలన అంశాలకు ప్రాధాన్యం

కృష్ణా యూనివర్సిటీ వీసీగా కె.రాంజీ బాధ్యతల స్వీకరణ

మచిలీపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రణాళికలతో యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని కృష్ణా యూనివర్సిటీ వీసీ కె.రాంజీ తెలిపారు. నాణ్యమైన విద్యాబోధన, భవనాల నిర్మాణం, పరిపాలనాపరమైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. వీసీ చాంబరులో ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సెనెట్ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో శ్రీకాకుళం జిల్లా బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి మూడేళ్ల వీసీగా, నాగార్జున యూనివర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా ఏడాది పాటు పనిచేశానన్నారు. ఈ అనుభవంతో కృష్ణా యూనివర్సిటీని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇక్కడ నాణ్యమైన విద్యను అందించేందుకు తగు చర్యలు తీసుకుంటానన్నారు. బాలురు, బాలికల వసతి గృహాలను ఏడాది లోపు నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామన్నారు. మిగిలిన భవనాలు ఏ కారణంతో నిలిచిపోయాయో విచారణ జరిపి, త్వరితగతిన ఈ భవనాల నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులకు విద్యతోపాటు సామాజిక స్పృహను కలిగించేందుకు గ్రామాల్లో ఒకరోజు పాటు పర్యటించి అక్కడి పరిస్థితులపై అధ్యయనం చేయిస్తామన్నారు. వర్సిటీ పరిధిలో 120 కళాశాలలు ఉన్నాయని, వాటన్నింటినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తామన్నారు. వర్సిటీ ప్రాంగణాన్ని పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారుస్తామన్నారు. ఇందుకోసం ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించుకుంటామని తెలిపారు. అన్ని విభాగాల్లో పరిపాలనను గాడిన పెట్టేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తానని, ఎవరైనా సరిదిద్దుకోలేనంతగా తప్పులు చేసినట్లు రుజువైతే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోనని స్పష్టం చేశారు. రీసెర్చ్ విభాగంలో పరిపాలనా పరమైన అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించి చక్కదిద్దుతామని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి వీసీగా నియమించిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. తొలుత వీసీకి యూనివర్సిటీ రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ శోభన్‌బాబు, యూనివర్సిటీ క్యాంపస్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా, ఆయా విభాగాల అధిపతులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.



మీడియాతో మాట్లాడుతున్న వీసీ రాంజీ, చిత్రంలో బసవేశ్వరరావు, శోభన్‌బాబు, ఉషా

పోలీస్‌శాఖలో స్పా కోవర్టులు

రెండు రోజుల కిందట హైటెక్ స్పాపై నిఘా పెంచాలన్న ఇన్‌స్పెక్టర్

- వెంటనే నిర్వాహకులకు చేరిన సమాచారం
- తర్వాత రోజు మాచవరం పోలీస్ స్టేషన్‌కు వచ్చి భార్గవ్ వీరంగం
- న్యాయస్థానాల్లో నిలబెడతానని బెదిరింపులు
- రోల్‌కాల్‌లో ఇన్‌స్పెక్టర్ అన్న మాటలను చేరవేసిన సిబ్బందిపై ఆరా
- కోవర్టుల జాబితాపై దర్యాప్తు ముమ్మరం



- 'మన పోలీస్‌స్టేషన్ పరిధిలో దాదాపుగా అన్ని స్పా సెంటర్లు మూసివేశారు. వెటర్నరీ కాలనీలో చలసాని భార్గవ్ ఇంకా స్పా సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. మనకు దొరక్కుండా టెక్నాలజీని అడ్డుపెట్టుకుని వ్యవహారాలను నడుపుతున్నాడు. ఇక నుంచి వాహనాల తనిఖీలన్నీ ఆ స్పా సెంటర్ దగ్గర చేయాలి. బందోబస్తు నిర్వహించే పోలీసులు అక్కడే కూర్చోవాలి. ఇలా చేయడం వల్ల పోలీసులు నిత్యం ఇక్కడే ఉంటున్నారన్న భయం కలుగుతుంది' ఇది చలసాని ప్రసన్న భార్గవ్‌కు చెందిన స్టూడియో9 స్పా సెంటర్‌పై దాడులు చేయడానికి రెండు రోజుల ముందు రాత్రి మాచవరం ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ రోల్‌కాల్‌లో సిబ్బందితో అన్న మాటలు.
- 'నేను లీగల్‌గా స్పా సెంటర్‌ను నిర్వహిస్తున్నా. నాకు అన్ని అనుమతులు ఉన్నాయి. నన్ను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు. రాత్రి మీ సీఐ నా గురించి రోల్‌కాల్‌లో ఏదేదో చెప్పారంట. నా సత్తా ఏమిటో కోర్టుల ద్వారా చూపిస్తా. నా జోలికి వస్తే న్యాయస్థానాల్లో నిలబెడతా' ఇది పోలీసులు స్పా సెంటర్‌పై దాడి చేయడానికి ముందు రోజు భార్గవ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సిబ్బందితో చేసిన సవాలు.

ఈ విషయం ఇప్పుడు పోలీస్ శాఖలో పెద్ద దుమారం రేపుతోంది. సిబ్బందితో ఇన్‌స్పెక్టర్ అన్న మాటలు ఎక్కడా పొల్లుపోకుండా నిమిషాల వ్యవధిలో చలసాని ప్రసన్న భార్గవ్‌కు చేరిపోవడంతో స్టేషన్ కోవర్టు వ్యవస్థ విషయం మరోసారి బయటకు వచ్చింది.

-ఆంధ్రజ్యోతి, విజయవాడ

ఏమార్చేందుకు వేర్వేరు కార్యాలయాల ఏర్పాటు

నగరంలో అన్ని స్పా సెంటర్లను పోలీసులు మూసివేయించారు. పోలీసులు నిర్దేశించిన ఎస్‌వోపీ ఉన్న స్పా సెంటర్లు మాత్రమే ద్వారాలు తెరుచుకుని ఉన్నాయి. వెటర్నరీ కాలనీ ఫీడర్ రోడ్డులో చలసాని ప్రసన్న భార్గవ్ మాత్రం ఒక అత్యాధునిక సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేసుకొని స్పా ముసుగులో చేయాల్సిన పనులన్నీ చేస్తున్నాడు. తనకు ఒక యూట్యూబ్ చానల్ ఉందని, నిర్మాణ రంగంలో ఉన్నానని చెప్పుకునేందుకు రెండు కార్యాలయాలను అక్కడ ఏర్పాటు చేసుకున్నాడు. ఒకవైపు చలసాని కన్‌స్ట్రక్షన్స్ బోర్డు, మరో వైపు యూట్యూబ్ చానల్‌కు సంబంధించిన బోర్డు కనిపిస్తుంది. ఈ రెండింటికి పైభాగంలో మాత్రం రాసలీలలు జరుగుతుంటాయి.

పోలీస్ కోవర్టుల సమాచారంతో తప్పించుకుంటూ..

భార్గవ్‌ను పక్కా ఆధారాలతో పట్టుకోవాలని పోలీసులు కొన్ని నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. రెండు, మూడు సార్లు సోదాలకు వెళ్లినప్పటికీ ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వెనుతిరిగారు. స్పా చుట్టూ నిఘా వ్యవస్థను అమర్చుకున్నట్టే పోలీసు అధికారుల కదలికలను తెలుసుకునేందుకు మాచవరం పోలీస్ స్టేషన్‌లోనూ కోవర్టులను ఏర్పాటు చేసుకున్నాడు. దీనికి నిదర్శనమే ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ సిబ్బందికి చేసిన సూచనలు నేరుగా భార్గవకు చేరడం. ఇన్‌స్పెక్టర్ రోల్‌కాల్ నిర్వహించినప్పుడు ముగ్గురు ఎస్సైలు, ఆరుగురు కానిస్టేబుళ్లు, ముగ్గురు హోంగార్డులు, ఒక మహిళా కానిస్టేబుల్ ఉన్నారు. పోలీసులకు ప్రతిరోజు రాత్రి రోల్‌కాల్ ఉంటుంది. రాత్రిపూట విధుల్లో ఉండే సిబ్బందికి సంబంధిత స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పలు సూచనలు చేస్తుంటారు. ఎక్కడెక్కడ ఏవిధంగా నిఘా పెట్టాలో చెబుతారు. అటువంటి రోల్‌కాల్‌లో ఎస్‌హెచ్‌వో(స్టేషన్ హౌస్ ఆఫీసర్) అన్న మాటలు చలసానికి చేరడంతో అధికారులు ఒక్కసారిగా కంగు తిన్నారు.

భార్గవ్‌తో టచ్‌లో ఉన్నదెవరు?

పోలీసులను గుప్పెట్లో పెట్టుకుని వ్యవహారాలను చక్కబెట్టడంలో భార్గవ్‌కు మంచి నైపుణ్య ఉంది. వైసీపీ హయాంలో గురునానక్ కాలనీలో ఉన్న రైల్వే విశ్రాంత ఉద్యోగికి చెందిన స్పా కేంద్రాన్ని పటమట పీఎస్‌లో పనిచేసిన ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లను ఉపయోగించుకుని సెటిల్‌మెంట్ చేసి బలవంతంగా రాయించు కున్నాడని నాటి పోలీసు అధికారులు గుర్తించారు. నాడు భార్గవ్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి స్పా ముసుగులో అతడు చేస్తున్న అరాచకాలను బయటకు తీశారు. భార్గవ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి మిగతా 6లో..

నగరం సురక్షితం!

అన్ని అపార్ట్‌మెంట్లకు నిఘా నేత్రాలు

- బహుళ ప్రయోజనాలు ఉండేలా పోలీస్‌శాఖ ఏర్పాటు
- అపార్ట్‌మెంట్‌కు ఒక సీసీ కెమెరా ఉచితంగా ఇవ్వాలని నిర్ణయం
- మిగిలిన కెమెరాల ఏర్పాటు బాధ్యత ఆ సంక్షేమ సంఘాలదే
- ప్రయోగాత్మకంగా 'పశ్చిమ'లో అమలు



నగరానికి నలుదిక్కుల ఎటుచూసినా బహుళ అంతస్తులతో అపార్టుమెంట్లు కనిపిస్తున్నాయి. వాటికి ఎక్కడో ఒకచోట సీసీ కెమెరాలు కనిపిస్తాయి. వాటిలో ఎన్ని కెమెరాలు పనిచేస్తున్నాయో, ఎన్ని పనిచేయడం లేదో ఎవరికీ తెలియదు. ఒకవేళ పనిచేసినా ఫుటేజీల్లో స్పష్టత ఉండదు. దీనితో పోలీసులు ప్రాజెక్టు సురక్షకు శ్రీకారం చుట్టారు. నగరంలో ఉన్న ప్రతి అపార్టుమెంట్‌కు బహుళ ప్రయోజనాలు ఉండేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని నిర్ణయించారు. ఈ 'సురక్ష'లను ప్రయోగాత్మకంగా పశ్చిమ నియోజకవర్గంలో అమలు చేయాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ నగరాన్ని నిఘా నీడలోకి తెచ్చేందుకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం కేటాయించే నిధులతో సంబంధం లేకుండా కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా నగరానికి నాలుగు వైపులా నిఘా నేత్రాలను, సురక్ష కమిటీలను ఏర్పాటు చేశారు. నగరంలో ఉన్న ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ వర్గాల నుంచి 20 మందిని ఎంపిక చేసి సురక్ష కమిటీలుగా వేశారు. ఇప్పుడు ఈ కమిటీల ద్వారా నగరంలోని అపార్టుమెంట్లలో 'సురక్ష'లను ఏర్పాటు చేయించాలని నిర్ణయించారు. దీనికోసం పోలీసుశాఖ ఒక ఆఫర్‌ను ప్రకటించింది. ఒక్కో అపార్టుమెంట్‌కు పోలీసు శాఖ ఒక సీసీ కెమెరాను ఉచితంగా ఇవ్వనుంది. మిగిలిన సీసీ కెమెరాలను అపార్టుమెంట్ల సంక్షేమ సంఘాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. విజయవాడ నగరాన్ని భద్రతా వలయంలో పెట్టడానికి పోలీసు అధికారులు మూడు దశలుగా ప్రాజెక్టును అమలు చేయాలని నిర్ణయించారు. మొదటి దశలో కమ్యూనిటీ సీసీ కెమెరాల వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కాలనీలు, సంక్షేమ సంఘాల ద్వారా నిధులను సమీకరించి 1,264 కెమెరాలను ఏర్పాటు చేయించారు.

15 వేల కెమెరాల ఏర్పాటే లక్ష్యం

పోలీసు కమిషనరేట్ పరిధిలో 10 వేల నుంచి 15వేల వరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకోసం కమ్యూనిటీ సీసీ కెమెరాల ప్రాజెక్టును చేపట్టాం. ఒక సీసీ కెమెరాను అపార్టుమెంట్ సంక్షేమ సంఘాలకు ఉచితంగా అందజేస్తాం. ప్రతి అపార్టుమెంట్‌కు సంక్షేమ నిధి ఉంటుంది. దాని నుంచి రెండు, మూడు కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. ఆ కెమెరాలను ఏ కోణంలో ఏర్పాటు చేయాలో మా సిబ్బంది సూచిస్తారు. త్వరలో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం. ప్రతి గ్రామానికి ప్రవేశమార్గం, బయటకు వెళ్లే మార్గంతోపాటు ముఖ్యమైన కూడలిలో ఒక సీసీ కెమెరా ఇలా మొత్తం మూడు నుంచి నాలుగు కెమెరాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం.

-ఎస్వీ రాజశేఖరబాబు, పోలీసు కమిషనర్

అపార్టుమెంట్ సంక్షేమ సంఘాలతో సమావేశాలు

ఎంజీ రోడ్డు, ఏలూరు రోడ్డు విజయవాడలో విశాలంగా ఉన్న రహదారులు. నగరంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. ప్రధాన రహదారులు కాకుండా 85 శాతం అంతర్గత రహదారులు ఉన్నాయి. నగరంలో మొత్తం మూడు వేలకు పైగా అపార్టుమెంట్లు ఉన్నాయని పోలీస్ గణాంకాలు తేల్చాయి. ఈ అపార్టుమెంట్లన్నీ ఎక్కువగా ఈ అంతర్గత రహదారులను ఆనుకుని, వీధుల్లో ఉన్నాయి. వాటికి ప్రవేశ, బయటకు వెళ్లే మార్గాల్లో సీసీ కెమెరాలు మిగతా 6లో..

దశ తిరిగింది..!

మెగా ఇన్ఫ్రా దిశగా రాయనపాడు శాటిలైట్ రైల్వేస్టేషన్!

● చురుగ్గా అభివృద్ధి పనులు, కొత్త భవనాలు, ప్లాట్‌ఫామ్‌ల విస్తరణ
● విజయవాడ రైల్వే జంక్షన్‌కు తగ్గనున్న రద్దీ



రాయనపాడు శాటిలైట్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విజయవాడ రైల్వే జంక్షన్‌పై గణనీయంగా రద్దీని తగ్గిస్తున్న రాయనపాడు శాటిలైట్ రైల్వేస్టేషన్ ఆధునిక సొబగులను అద్దుకుంటోంది. అమృత్‌భారత్ పథకంలో భాగంగా ఆధునిక నిర్మాణాలు తుదిదశకు చేరుకుంటున్నాయి. ఒకప్పుడు విజయవాడ రైల్వేస్టేషన్ అవుటర్‌లో రైళ్లు గంటల తరబడి నిలిచిపోయేవి. రాయనపాడును శాటిలైట్ స్టేషన్‌ను చేసిన తర్వాత చాలా వరకు తగ్గింది. రాజధాని అమరావతి నేపథ్యంలో రానున్న రోజుల్లో మరింత కీలకంగా మారనున్న రాయనపాడు రైల్వేస్టేషన్ అభివృద్ధిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.. - ఆంధ్రజ్యోతి, గొల్లపూడి


కాంక్రీట్ బీమ్ వర్క్ చేస్తున్న వర్కర్లు


ప్లాట్ ఫామ్ పనులు చేస్తున్న వర్కర్లు


లిఫ్ట్ ఏర్పాటుకు నిర్మిస్తున్న గది


ఐరన్ వర్క్ చేస్తున్న వర్కర్లు


పాత బుకింగ్ కౌంటర్


రాయనపాడు స్టేషన్


అతి పెద్ద ప్లాట్ ఫామ్

దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే రైల్వేస్టేషన్లలో విజయవాడ రైల్వేస్టేషన్ ఒకటి. ఒడిశా, చెన్నై, ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లకు ప్లాట్‌ఫామ్స్ లభించక చాలాసేపు బయట ట్రాక్స్ పైనే ఉండాల్సి వస్తుంది. దీంతో ప్రయాణికుల విలువైన సమయం వృథాగా పోతోంది. ఈ సమస్యకు పరిష్కారంగా రైల్వే అధికారులకు ఒక ఆలోచన చేశారు. విజయవాడ రైల్వేస్టేషన్‌తో సంబంధం లేకుండా కొన్ని రైళ్లను రాయనపాడు రైల్వేస్టేషన్‌కు మళ్లించి అక్కడి నుంచి గమ్యస్థానాలకు చేర్చాలని, ఇందులో భాగంగా ఈ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని సంకల్పించి అమృత భారత్ పథకంలో నిధులు మంజూరు చేసి స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. దీంతో స్టేషన్ దశ మారిపోయింది. 3 దశాబ్దాల్లో జరగని అభివృద్ధి పనులు ఇప్పుడు జరుగుతున్నాయి. ప్లాట్‌ఫామ్‌పై ప్రయాణికుల నీడ కోసం 5 అతి పెద్ద భారీ షెడ్లను నిర్మించారు. ప్రస్తుతం ఉన్న పాతస్టేషన్ భవనం రెండు వైపులా 100 మీటర్ల చొప్పున స్టేషన్ ప్లాట్ ఫారంను పెంచారు. నూతనంగా నిర్మిస్తున్న మూడంతస్తుల భవనంలో శాఖలన్నీ ఉండేలా అధికారులు ప్రణాళికలు వేశారు. ఈ బిల్డింగ్ పొడవుగా నిర్మించారు. ఇదే మెయిన్ బిల్డింగ్ కానుంది. ఇందులోనే బుకింగ్ కౌంటర్, కామన్ వెయిటింగ్ హాల్, టీసీలు, లోకో పైలట్స్, గార్డ్స్ డ్యూటీలు మారేందుకు వసతులు కల్పిస్తున్నారు. హౌరా హైదరాబాద్‌కి మెయిన్ లైన్‌లోనే ఈ స్టేషన్ ఉంది. కాకినాడ - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, నాగవల్లి ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం నాందేడ్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ షాలిమార్ ఎక్స్‌ప్రెస్ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లు సుమారు 10 వరకు అక్కడే ఆగుతున్నాయి. వీటితో పాటు భద్రాచలం విజయవాడ ప్యాసింజర్, డోర్నకల్ విజయవాడ ప్యాసింజర్ రైళ్లు ఈ స్టేషన్లో ఆగి వెళుతున్నాయి. పనులు పూర్తయితే విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ మీదుగా ఢిల్లీ వెళ్లే రైళ్లు విజయవాడ వెళ్లకుండా బైపాస్ లైన్ నుంచి ఈ స్టేషన్‌లోనే ఆగనున్నాయి. దీంతో దక్షిణ భారతేశంలో అతి పెద్ద జంక్షన్ అయిన విజయవాడ రైల్వే స్టేషన్‌కు రైళ్ల రద్దీ తగ్గుతుంది. రాబోయే రోజుల్లో రాయనపాడు రైల్వేస్టేషన్‌కు ఎంతో ప్రాముఖ్యత ఏర్పడనుంది. అధిక సంఖ్యలో ప్రయాణికులు విజయవాడ స్టేషన్‌కి వెళ్లకుండా ఇక్కడికే వచ్చేందుకు ఇష్టపడతారు. నగరంలోని ట్రాఫిక్‌తో ప్రయాణికులు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్ని అధిగమించాలంటే రాయనపాడు రైల్వేస్టేషనే ప్రత్యామ్నాయం. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలోనే ఈ స్టేషన్ ఉంది. స్టేషన్ నుంచి హైవేకు చేరుకోగానే వెస్ట్ బైపాస్ వస్తుంది. స్టేషన్‌లో దిగిన ప్రయాణికులు వెస్ట్ బైపాస్ రోడ్డు మీదుగా అటు రాష్ట్ర రాజధాని ప్రాంతం అమరావతికి సునాయాసంగా చేరుకోగలుగుతారు. గుంటూరు, ప్రకాశం, ఒంగోలు తదితర జిల్లాల వాళ్లకు ఈ బైపాస్ ఎంతో ఉపయోగంగా ఉంటుంది. హైవే నుంచి రాయనపాడు రైల్వేస్టేషన్ వరకు ఇప్పుడున్న ఇరుకు రోడ్డును కాస్త విస్తరించి రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేయాలి. అలా చేస్తేనే ఈ స్టేషన్ అభివృద్ధికి అర్థం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా స్టేషన్‌కు చేరుకోగలుగుతామంటున్నారు. మొత్తం మీద స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులతో ఈప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నూతనంగా నిర్మిస్తున్న భవనం

పకడ్బందీగా గ్రూప్-2 పరీక్షలు

● మెయిన్స్‌కు జిల్లాలో ఉదయం 7,376, మధ్యాహ్నం 7,352 మంది పరీక్షలకు హాజరు

● పేపర్-1కు 83.89 శాతం, పేపర్-2కు 83.62 శాతం హాజరు ● బాగా రాశామన్న అభ్యర్థులు ● పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు



కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఎన్టీఆర్ జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. విజయవాడ నగరంలో మొత్తం 19 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. మొత్తం 8,792 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 8,146 మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఉదయం జరిగిన పేపర్-1కు 7,376 మంది, మధ్యాహ్నం జరిగిన పేపర్ - 2 కు 7,352 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కొద్దిరోజులుగా అభ్యర్థుల ఆందోళనల నేపథ్యంలో ఆదివారం జరగాల్సిన పరీక్షలకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. పరీక్షలను బాగానే రాసినట్టు అభ్యర్థులు చెబుతున్నారు. అభ్యర్థులు చెబుతున్న దాని ప్రకారం జనరల్ కేటగిరీ అభ్యర్థికి 240 మార్కులు దాటితే ఖచ్చితంగా గ్రూప్-2 ఎగ్జిక్యూటివ్ ఉద్యోగం వస్తుందన్న భావనలో ఉన్నారు. మిగిలిన కేటగిరీల కేటగిరీకి 15 మార్కులు తగ్గించుకుంటూ పోతే 170 మార్కుల వరకు ఉద్యోగం వచ్చే అవకాశం ఉందని చర్చించుకుంటున్నారు.

జిల్లాలో ప్రశాంతంగా పరీక్షలు: లక్ష్మీశ



గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఎన్టీఆర్ జిల్లాలో విజయవంతంగా ముగిసినట్టు కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం తెలిపారు. నగరంలో 19 కేంద్రాల్లో పేపర్-1కు 83.89 శాతం, పేపర్-2కు 83.62 శాతం మంది హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షను విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన కోఆర్డినేటింగ్, కస్టోడియన్, రూట్, లైజనింగ్ అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు. అలాగే రెవెన్యూ, పోలీస్, వైద్యారోగ్యం, విద్యుత్, ప్రజారవాణా శాఖల అధికారులు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.





ఏప్రిల్ 13, 14న ఏపీసీసీబీఈఏ డైమండ్ జూబ్లీ సమావేశాలు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీసీబీఈఏ) ఆఫీసు బేరర్స్ సమావేశం ఆదివారం ఎంజీ రోడ్డులోని అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఏప్రిల్ 13, 14న విజయవాడ కేంద్రంగా అసోసియేషన్ డైమండ్ జూబ్లీ సమావేశాలు విజయవంతంగా నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మాట్లాడుతూ అసోసియేషన్ 60 వసంతాల్లోకి అడుగుపెడుతుండటం సంతోషదాయకమన్నారు. ట్రేడ్ యూనియన్ ఇన్నేళ్లు దిగ్విజయంగా నిర్వహించడం సాధారణ విషయం కాదన్నారు. అసోసియేషన్ జాతీయ కార్యదర్శి మాట్లాడుతూ సహకార రంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, దానికి అనుగుణంగా ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు అసోసియేషన్ పోరాటాలకు సిద్ధంగా ఉందన్నారు. అనంతరం దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకుల ప్రాముఖ్యత, ట్రేడ్ యూనియన్ల పాత్ర అనే అంశంపై చర్చజరిగింది. డైమండ్ జూబ్లీ సమావేశాలకు సంబంధించిన రిసెప్షన్ కమిటీ ఏర్పాటు చేశారు. కృష్ణాజిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ నాయకులు, ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆఫీసు బేరర్స్, అర్బన్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలుర ఉసురు తీసిన చేపల వేట!

● పోలవరం కాలువలో మునిగి అన్నదమ్ముల మృతి

ఆదివారం సెలవుదినం కావడంతో తండ్రితో కలిసి చేపల వేటకు వెళ్లిన అన్నదమ్ముల కుటుంబాలకు చెందిన ఇద్దరు బాలురు మృత్యువాత పడి విగత జీవులవడంతో కోడూరుపాడులో విషాదఛాయలు అలముకున్నాయి. చేతికొచ్చిన కుమారులు కళ్లెదుటే నీటిలో మునిగిపోవడంతో ఆ తండ్రులు నిశ్చేష్టులయ్యారు. రెండు కుటుంబాల్లోనూ ఆ ఇద్దరే మగపిల్లలు కావడంతో వారి వేదన వర్ణనాతీతం.


మృతులు షేక్ నాగూర్ బాషా(17), షేక్ షరీఫ్(18)

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చేపల కోసం పోలవరం కాలువకు వెళ్లి గాలం చిక్కుకుపోవడంతో దాన్ని తీసేందుకు వెళ్లి ఒకరు, మునిగిపోతున్న సోదరుడిని రక్షించేందుకు వెళ్లి మరొకరు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన కోడూరపాడు పంచాయతీలోని శోభనాద్రిపురం శివారులో ఆదివారం జరిగింది. కొమ్మూరు అండర్‌టన్నెల్ వద్ద పోలవరం కాలువలో చేపల కోసం గేలం వేయగా అది చెత్తలో చిక్కుకుపోవడంతో తీసేందుకు కాలువలోకి దిగారు. లోతు అంచనా వేయలేక నాగూర్‌బాషా (17) మునిగిపోతుండటంతో షేక్ షరీఫ్ (18) చేయి అందించి లాగేందుకు చేసే ప్రయత్నంలో భాగంగా ఇద్దరూ మునిగిపోయారు. పిల్లలిద్దరూ మునిగిపోవడంతో సుభాని సహాయం కోసం పిలిచాడు. స్థానికులు వీరవల్లి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించగా, హుటాహుటిన వచ్చిన ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది దగ్గర్లో ఉన్న రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఈతగాళ్ల సహకారంతో వెతకగా బురదలో కూరుకుపోయిన బాలుర మృతదేహాలు లభ్యమయ్యాయి. వారిని గన్నవరం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. పోలవరం కాలువలో బాలుర మృతి సమాచారంతో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వారి కుటుంబాలకు సానుభూతిని తెలిపి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాలువ ప్రాంతంలో తక్షణం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని అధికారులను యార్లగడ్డ ఆదేశించారు.

పోలీస్‌శాఖలో స్పా కోవర్టులు

(5వ పేజీ తరువాయి)

అరెస్టు చేశారు. అప్పట్లో మాచవరంలో పనిచేసిన ఒక ఇన్‌స్పెక్టర్, పటమటలో పనిచేసిన ఇద్దరు కానిస్టేబుళ్ల పాత్ర భార్గవ్ అరాచకాల్లో ఉందని తెలియడంతో అప్పటి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ ముగ్గురిని వీఆర్‌కు పంపారు. తర్వాత ఆ ఇన్‌స్పెక్టర్ ఇక్కడి నుంచి ఏలూరు రేంజ్‌కు వెళ్లిపోయారు. మిగిలిన ఆ ఇద్దరు కానిస్టేబుళ్లు మొన్నటి వరకు జగ్గయ్యపేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేసేవారు. నెల కిందట అక్కడి నుంచి మాచవరం పీఎస్‌కు బదిలీపై వచ్చినట్టు తెలిసింది. రోల్‌కాల్‌లో ఇన్‌స్పెక్టర్ అన్న మాటలే భార్గవ్ చెవిలో పడేశారా, స్టేషన్‌లో జరిగే వ్యవహారాలన్నీ చేరవేశారా అని అధికారులు అనుమానిస్తున్నారు.

కోర్టుల్లో పోలీసులపై పిటిషన్లు

చలసాని ప్రసన్న భార్గవ్ పోలీసులపై న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలు చేస్తుంటాడు. అనుమతులు లేకుండా స్పాలు నిర్వహించడంలో, పరాయి వ్యక్తుల మీద అనుమతులు తీసుకుని నిర్వహించడంలోనూ దిట్ట. తనకు ఎలాంటి సంబంధం లేకపోయినా పోలీసులు వేధిస్తున్నారని ఇంతకుముందు కోర్టుల్లో పిటిషన్లు వేసిన దాఖలాలు ఉన్నాయి. తాజాగా కొద్దినెలల కిందట పోలీసులు వరుసగా తనిఖీలకు వెళ్లడంతో ఉన్నతాధికారులను కలిసి తన స్పా కేంద్రంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకపోయినా మాచవరం పోలీసులు వేధిస్తున్నారని ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. వైసీపీ హయాంలో నగరంలో సగం స్పా కేంద్రాలు భార్గవ్ కంబంధహస్తాల్లో ఉండేవి. ఒక్కమాటలో చెప్పాలంటే స్పా మాఫియాకు డాన్‌గా మారిపోయాడు. పోలీసులు అతడి స్పాలో తనిఖీలకు వెళ్తున్నారన్న సమాచారం తెలుకోవడానికి కొన్ని పోలీస్‌స్టేషన్లలో సిబ్బందిని కోవర్టులుగా మార్చుకున్నాడు. అతడు ఇచ్చే నెలావారీ మామూళ్లకు కక్కుర్తి పడిన కొంతమంది ఇన్‌స్పెక్టర్లు వేసే అడుగులను ముందుగానే తెలియజేసేవారు. ఇప్పటికీ పోలీసు స్టేషన్లలో కోవర్టులు ఉన్నారని మాచవరం పీఎస్‌లో జరిగిన ఘటనతో తేలిపోయింది. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. మాచవరం పీఎస్‌లో భార్గవ్ కోవర్టుల లెక్కలను తేల్చాలని అధికారులు నిర్ణయించారు. కొద్దిరోజుల్లోనే ఈ కోవర్టుల జాబితా బయటకు తీస్తామని అధికారులు వెల్లడించారు.


శ్రీశైలం మల్లన్నకు పట్టువస్త్రాలు తీసుకువెళుతున్న దేవదాయ కమిషనర్, దుర్గగుడి ఈవో రామచంద్రమోహన్

శ్రీశైలం మల్లన్నకు పట్టువస్త్రాలు

వన్‌టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామికి ఆదివారం దుర్గగుడి తరఫున ఈవో, దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయన వెంట స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ పాల్గొన్నారు. శ్రీశైలం దేవస్థానం ఈవో వి.శ్రీనివాసరావు, వేద పండితులు, అర్చకులు రామచంద్ర మోహన్‌కు ఆయన వెంట వచ్చిన బృందానికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పట్టువస్త్రాల సమర్పణ అనంతరం స్వామికి ప్రత్యేక అర్చన నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచనం ఇచ్చారు.


మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ చిత్రంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, టీడీపీ అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ

వేసే ప్రతి ఓటు అభివృద్ధికి దోహదం

● గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి

పటమట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వ్యక్తిగతంగా నాకు వేసే ప్రతి ఓటు కూటమి ప్రభుత్వంలో మరిన్ని అభివృద్ధి పనులకు దోహద పడుతుందని పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ నివాసంలో ఆదివారం న్యాయవాదుల, పట్టభద్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మచిలీపట్నం ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ ఆలపాటి రాజను 50 శాతం ఓట్ల మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు మాట్లాడుతూ గతంలో శాసనమండలిలో వైసీపీ సభ్యులు టీడీపీ సభ్యులపై భౌతికంగా దాడి చేశారని నారా లోకేశ్‌పై దాడిని సమర్థవంతంగా తిప్పి కొట్టామన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి రాజా లాంటి వ్యక్తే సరైన వాడన్నారు. గొట్టిపాటి రాజా మాట్లాడుతూ రాజకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. పాతూరి నాగభూషణం, పోతంశెట్టి నాగేశ్వరరావు, జనసేన నేత అమ్మిశెట్టి వాసు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

ఎ.కొండూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం గ్రామ శివారు లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొండేబోయిన రాంబాబు (45) అనే వ్యక్తి అప్పులు బాధతో ఆత్మహత్య చేసుకొన్నట్టు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. వారం క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన రాంబాబును కుటుంబ సభ్యులు వెతగ్గా ఆచూకీ తెలియలేదు. ఆదివారం గ్రామ సమీపంలో మొక్కజొన్న తోటలో దుర్వాసన రావడంతో స్థానికులు వెళ్లి చూడగా మామిడి చెట్టుకు రాంబాబు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు గుర్తించారు. మృతుడి కుమారుడు విష్ణువర్ధన్ ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



ఇంద్రకీలాద్రిపై సరస్వతీయాగం

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఆదివారం మాఘమాసం మూలానక్షత్రం సందర్భంగా యాగశాలలో మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అర్చకస్వాములచే శాస్త్రోక్తంగా సరస్వతీ యాగం నిర్వహించారు. రాష్ట్రమంతా విద్యలవాడగా వెలుగొందాలని వాగ్దేవి అయిన సరస్వతీదేవి అనుగ్రహం కోసం వేదపండితులు, అర్చకులు ఈ యాగం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించారు. త్వరలో ప్రారంభం కానున్న పరీక్షల్లో విజ యం సాధించాలని విద్యార్థులు అమ్మవారిని కోరుకుని ఆశీస్సులందుకున్నారు. మాఘమాసం ఆదివారం సందర్భంగా అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. కాగా కనకదుర్గమ్మ దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. కొందరు తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి కొండపైన అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున రావటంతో విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ వద్ద ట్రాఫిక్‌ను చిట్టినగర్ వైపునకు మళ్లించారు.భవానీపురం స్వాతి సెంటర్ నుంచి కుమ్మరిపాలెం సెంటర్ వరకు వాహనాలు బారులు తీరాయి. భక్తులతో పాటు వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను అంబేద్కర్ రోడ్డు మీదుగా చిట్టినగర్ వైపునకు మళ్లించారు.

నగరం సురక్షితం!

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. ఈ కెమెరాల్లో కొన్ని పనిచేస్తున్నాయని, మరికొన్ని పనిచేయడం లేదని పోలీసులు గుర్తించారు. ఏదైనా ఘటన జరిగిన తర్వాత కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తే అందులో స్పష్టత ఉండడం లేదు. కొన్ని అపార్టమెంట్లలో సీసీ కెమెరాలు కేవలం అలంకారప్రాయంగా ఉంటున్నాయి. ఇవన్నీ కొన్ని కారణాలైతే ఈ సీసీ కెమెరాలన్నీ అపార్టుమెంట్ల లోపల మాత్రమే ఉంటున్నాయి. వాటిలో బయట ఉన్న రహదారులు కనిపించలేదు. దీనితో ప్రతి అపార్టుమెంట్‌లోను బహుళ ఉపయోగాలు ఉండేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని భావిస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో 600-700 అపార్టుమెంట్లు ఉన్నట్టు గుర్తించారు. ఆ అపార్టుమెంట్ల సంక్షేమ సంఘాలతో సురక్ష కమిటీ సభ్యులు సమావేశాలు నిర్వహిస్తారు. పోలీసు శాఖ 4మెగా పిక్సల్ సీసీ కెమెరాను ఉచితంగా ఇస్తుందని, అటువంటి కెమెరాలను రెండు, మూడు వరకు సంక్షేమ సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పిస్తారు. ఈ కెమెరాలను 45 డిగ్రీల కోణంలో బయట రహదారులను చిత్రీకరించేలా ఏర్పాటు చేస్తారు. ఈ కెమెరాలకు ఎన్వీఆర్ (నెట్‌వర్క్ వీడియో రికార్డర్) అవసరం ఉండదు. ఇంటర్నెట్ సదుపాయం ఉంటే సరిపోతుంది. 256 జీబీ సామర్థ్యం ఉన్న ఎస్‌డీ కార్డును కెమెరాలో అమర్చుతారు. ఇది 28 రోజుల ఫుటేజీ భద్రంగా ఉంచుతుంది. తర్వాత అది చెరిగిపోతుంది. ఇలా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఐపీ అడ్రస్‌లను ఎంజీ రోడ్డులో ఉన్న ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తారు. తద్వారా నగరంలో ఉన్న ప్రతి రహదారిని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటికే పశ్చిమ నియోజవర్గంలో 'సురక్ష'ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. వచ్చేనెల రెండోవారంలో ప్రాజెక్టును ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.

అవుటర్ ఆశలు

(5వ పేజీ తరువాయి)

లోపు ఈ ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఓఆర్ఆర్‌తో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలకు ఊతం ఇవ్వడంతో పాటు, అభివృద్ధి అవకాశాలను సృష్టించడం వంటివి జరగనుండటంతో భూముల బూమ్ నెలకొంది.

పెరగనున్న భూములు, ఆస్తుల విలువ

అవుటర్ రింగ్ రోడ్డు అనుసంధానమవుతున్న ప్రాంతాల్లో భూములు, ఆస్తుల విలువలు గణనీయంగా పెరగనున్నాయి. ప్రధానంగా నందిగామ, జి.కొండూరు, మైలవరం, గన్నవరం, కంకిపాడు, పెనమలూరు వంటి ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందటానికి అవకాశం ఉంది. ఓఆర్ఆర్ సమీపంలోని భూములు రెసిడెన్షియల్, కమర్షియల్‌గా అభివృద్ధి చెందటానికి దోహదపడుతుంది. అవుటర్ రింగ్ రోడ్డు వెంబడి ఉన్న ప్రాంతాలు వాణిజ్య కేంద్రాలుగా మారనున్నాయి. షాపింగ్ మాల్స్, ఆఫీసులు, వెంచర్లు, నివాస ప్రాంతాలు, కాలనీలు, దాబాలు, షాపులు ఇలా అనేక రకాల కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. ఇలాంటి కార్యకలాపాల వల్ల రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు ఊపందుకోవటానికి ఆస్కారం ఏర్పడుతుంది. అవుటర్ వెంబడి కొత్త ప్రాజెక్టులను ప్రారంభించటానికి అవకాశం కలుగుతుంది. రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు ఎక్కువుగా సాగటం వల్ల స్థానిక ప్రాంతాల్లో ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. అనేక ఉపాధి, ఉద్యోగావకాశాలు ఏర్పడతాయి.

పెట్టుబడుల ఆకర్షణ

అవుటర్ రింగ్ రోడ్డు వల్ల పెట్టుబడులను ఆకర్షించటానికి అవకాశాలు పెరుగుతాయి. ప్రధానంగా మేజర్ గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలు, పట్టణ ప్రాంతాల పరిధిలో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతారు. పెట్టుబడులు ఏ స్థాయిలో అయినా ఉండవచ్చు. స్థానిక పెట్టుబడులతో పాటు జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను కూడా ఆకర్షించటానికి వీలుగా పరిస్థితులు ఉంటాయి.

మౌలిక సదుపాయాల కల్పనకు ఊతం

అవుటర్ రింగ్ రోడ్డు సాకారమవుతున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుంది. ప్రధానంగా ప్రభుత్వం ద్వారా నిరంతరాయ విద్యుత్, వాటర్ నెట్‌వర్క్, సీవరేజీ నెట్‌వర్క్, అనుసంధాన రోడ్లు, ఉద్యానవనాలు, పాఠశాలలు, కాలేజీలు ఏర్పాటుకు అన్ని అవకాశాలు ఉన్నాయి.

పరిశ్రమలు, వ్యాపార కేంద్రాల ఏర్పాటుకు మార్గం

అవుటర్ రింగ్ రోడ్డు వల్ల మెరుగైన కనెక్టివిటీని దృష్టిలో పెట్టుకుని పరిశ్రమలు కూడా అవుటర్ వెంబడి కొలువుదీరటానికి అవకాశం ఉంది. అవుటర్ వెంబడి పరిశ్రమల ఏర్పాటు వల్ల తమ ఉత్పత్తులను అత్యంత తేలిగ్గా ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేసుకోవటానికి అవకాశం ఉంటుంది. అలాగే దిగుమతులు చేసుకోవటానికి కూడా తేలిగ్గా ఉంటుంది. అనేక రకాల వ్యాపారాలను కూడా స్థాపించటానికి అవకాశం ఉంది. ఈ కార్యకలాపాల వల్ల స్థానికంగా ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరుగుతాయి.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 465

కృష్ణలంక ఇన్‌స్పెక్టర్‌కు సీపీ ప్రశంస

విజయవాడ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కృష్ణలంక ఇన్‌స్పెక్టర్ నాగరాజును పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ప్రశంసించారు. విజయవాడకు చెందిన నిందితులు మంగళగిరిలో బంగారం షాపులో చోరీ చేశారు. నిందితులను వారధి వద్ద ఉన్న గుంటూరు బస్టాప్ దగ్గర కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి పట్టుకున్నారు. కమ్యూనిటీ సీసీ కెమెరాల ప్రాజెక్టులో భాగంగా నాగరాజు పీఎస్ పరిధిలో మొత్తం 200 కెమెరాలను ఏర్పాటు చేయించారు. దీనిపై పోలీసు కమిషనర్ ఆయనను అభినందించారు.

పేరుకే..ప్రధాన జంక్షన్

రామవరప్పాడు రింగ్‌లో అన్నీ సమస్యలే

- ప్రయాణికులు నిలబడడానికీ షెల్టర్లు లేని వైనం
- చెట్ల కిందే బస్సుల కోసం పడిగాపులు
- తాగడానికి మంచినీరు, కూర్చోవడానికి బల్లలు లేవు





షెల్టర్ లేకపోవడంతో ఎండలోనే నిలబడిన ప్రయాణికులు, చెట్టు కింద నిలబడిన ఏలూరు, విశాఖ వైపు వెళ్లే ప్రయాణికులు



నో పార్కింగ్ బోర్డు వద్ద నిలిపి ఉంచిన ఆటోలు

(ఆంధ్రజ్యోతి-భారతీనగర్): నగరంలోని ప్రధాన జంక్షన్‌లో రామవరప్పాడు రింగ్ సెంటర్ ఒకటి. ఈ సెంటర్ ఏలూరు జాతీయ రహదారి వెంబడి ఉంటుంది. విజయవాడ నుంచి ఏలూరు, కాకినాడ, విశాఖపట్నం, అమలాపురం ప్రాంతాలకు వెళ్లే నాన్‌స్టాప్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు, పలు ఆర్టీసీ బస్సులు ఈ సెంటర్ వద్ద ఆగుతాయి. ఈ జంక్షన్ నాలుగు రోడ్లకూడలి కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. అంత ప్రాధాన్యం ఉన్న కూడలిలో కనీస సదుపాయాలు లేక ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఎండలో పడిగాపులు

ఏలూరు, విశాఖపట్నం వెళ్లేందుకు నిత్యం వందలాది మంది ఈ సెంటర్‌కు వస్తుంటారు. వారు వేచి ఉండడానికి బస్ షెల్టర్ లేకపోవడంతో రింగ్ సెంటర్‌లో ఫుట్‌పాత్ మీద చెట్టు కింద నిలబడుతున్నారు. మన లవ్ విజయవాడ సర్కిల్ వద్ద పాయకాపురం, కండ్రిక, పైపుల రోడ్డు, ముస్తాబాద, నున్న తదితర ప్రాంతాలకు వెళ్లే వారు, ముస్తాబాద రోడ్డులోని పలు ప్రైవేట్ సంస్థలో ఉద్యోగాలు చేసే వారు ఆటోల కోసం, కంపెనీల బస్సుల కోసం వేచి ఉంటారు. అక్కడ కూడా నిలబడడానికి షెల్టర్ లేదు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఆటోల కోసం అవస్థలు పడుతున్నారు. అక్కడ ఒక చిన్న బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అనధికారంగా షెడ్లు

ఈ జాతీయ రహదారి గ్రీనరీలో ప్రయాణికులు సౌకర్యార్థం షెల్టర్ ఏర్పాటు చేసుకోవడానికి అనువుగా ఉంటుంది. ఆ ప్రాంతంలో ప్రైవేట్ వాహనాలు, ఆటో డ్రైవర్లు వారి కోసం అనధికారికంగా షెడ్డును ఏర్పాటు చేసుకుని, వాహనాలను రోడ్డుపైన నిలిపివేస్తున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పురుషులు సమీపంలో ఉన్న కాలువ వైపుకు వెళుతున్నారు. వేసవికాలంలోనైనా అధికారులు బస్ షెల్టర్ నిర్మించాలని, తాగు నీరు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆటోనగర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ సెక్షన్ పరిధిలోని విజయలక్ష్మి కాలనీ ఫీడర్ 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు సీటీవో కాలనీ, టవర్‌లైన్ రోడ్డు, భారతీనగర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలుపుదల చేయనున్నట్లు ఏఈ ఏడుకొండలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.



బాలమేళాలో సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న బస్తీ పిల్లలు

సందడిగా బాలమేళా

మొగల్రాజపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సమాజసేవ అందరి బాధ్యత అని తెలిసేలా పిల్లలను సామాజిక స్పృహ ఉన్న భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న సేవాభారతి సంస్థను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సూచించారు. నగరం చుట్టుపక్కల అనేక బస్తీల్లో పిల్లలకు చదువు, ఆరోగ్య సూత్రాలను నేర్పుతున్న బాలభారతి సంస్థ బస్తీ పిల్లలతో వీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం బాలమేళా కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించింది. ముఖ్య అతిథిగా కామినేని విచ్చేశారు. సేవా కార్యక్రమాలకు ప్రభుత్వం కూడా తన వంతు సాయం అందిస్తుందని కామినేని అన్నారు. ఎన్జీవోల సహకారంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమని విజయవాడ ప్రచారక్ నవీన్ పేర్కొన్నారు. మానవ సేవే మాధవ సేవ అని పూర్వీకులు నేర్పిన దానిని ఆచరిస్తున్నందుకు సంస్థకు సేవికా సమితి ప్రాంత కోశాధికారి పద్మశ్రీ ధన్యవాదాలు తెలిపారు. సేవాభారతి సంస్థ విజయవాడ ఉపాధ్యక్షురాలు పత్తి నాగలక్ష్మి మాట్లాడుతూ తాము 186 ట్యూషన్ సెంటర్లలో 5460మంది పిల్లలకు శారీరక మానసిక ఆరోగ్య కార్యక్రమాలతో పాటు విద్యను బోధిస్తున్నామన్నారు. పిల్లలు దేశభక్తిని ప్రతిబింబించే పలు నృత్యాలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సేవాభారతి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సాయి కిషోర్, కార్యదర్శి శుభశేఖర్, కోశాధికారి మాధవ్, జాయింట్ సెక్రటరీ మాధురి, ఆంధ్రా ఆస్పత్రి గుండె వైద్య నిపుణుడు శ్రీమన్నారాయణ, నగరంలో వివిధ బస్తీల నుంచి వచ్చిన పిల్లలు పాల్గొన్నారు.



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

కుట్టుమిషన్ల పంపిణీ

లబ్బీపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధి కోసం రోటరీ క్లబ్, రోటరీ ఫౌండేషన్ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ తెలిపారు. బందర్‌రోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఫౌండేషన్ 120వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. పేద ప్రజలను ఆదుకునేందుకు తమ వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ పాస్ట్ గవర్నర్ దత్త సుబ్బారావు ఆర్థిక సహకారంతో లక్షా 80 వేల రూపాయల విలువైన కుట్టు మిషన్లను 30మంది పేద మహిళలకు ఉచితంగా పంపిణీ చేశామని ఆయన తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ కార్యదర్శి సుందర్, రోటరీ క్లబ్ వైస్ గవర్నర్ పార్థసారథి, క్లబ్ పూర్వ అధ్యక్షుడు నియంత, రోటరీ కమ్యూనిటీ ఉపాధ్యక్షుడు మధు, సభ్యులు శరత్ కృష్ణప్రభు, కరమ్ కౌర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు



పూర్ణాహుతి సమర్పిస్తున్న కాళీమాత ఆలయ కమిటీ సభ్యులు

కృష్ణలంక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): త్రిశక్తి పీఠంలోని కాళీమాత దేవస్థానంలో ఆదివారం ఇంటర్ విద్యార్థుల పరీక్షల నేపథ్యంలో మేధా దక్షిణామూర్తి హోమం, సరస్వతీ అమ్మవారి హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 200 మంది విద్యార్థులు హోమ పూజల్లో పాల్గొన్నారు. వీరందరికీ పెన్నులు, కంకణములు, ప్రసాదం, అమ్మవారి ఫొటోలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో సాహితీ సమావేశం



సాహితీ సమావేశంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్

పటమట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యదేవర పాపారావు అధ్యక్షతన సాహితీ సమావేశాన్ని నిర్వహించారు. గుంటూరుకు చెందిన విశ్రాంత ప్రొఫెసర్, వక్త గోనుగుంట్ల వైదేవి గజేంద్ర మోక్షం గురించి సవివరంగా వివరించారు. కొండపల్లి మాధవరావు అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. బూరుగుపల్లి ప్రభావతి, వి.ఉమామహేశ్వరి, పొట్లూరి సుభాష్ చంద్రబోసు, లోయ నాగేశ్వరరావు, వెనిగండ్ల సాంబశివరావు, కోనేరు వెంకట రామారావు, పొన్నగంటి సాంబశివరావు, వసంతం శివశంకరరావు, వెంకట కృష్ణారావు, లావు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన పుస్తక పంపిణీ



తమకు నచ్చిన పుస్తకాన్ని ఎంచుకుంటున్న ప్రజలు

పటమట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత పుస్తక పంపిణీ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. తత్వశాస్త్రం, నవలలు, ఆధ్యాత్మిక, సాంఘిక, బాలసాహిత్యం, పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్ వంటి 25 వేలకు పైగా పుస్తకాలను ప్రదర్శించారు. ఆదివారం ఉద్యోగులు, విద్యార్థులు భారీగా ఈకార్యక్రమానికి హాజరయ్యారు. 8 వేల మందికి పైగా పౌరులు, పెద్దలు పుస్తకాలను తిలకించారు. 14 వేలకు పైగా పుస్తకాలను తీసుకెళ్లారు. ఎనిమిదేళ్లుగా తాము నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అన్ని విధాలా సహకరిస్తున్న పుస్తక దాతలకు వివిధ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, ప్రచురణ కర్తలు, తల్లిదండ్రులకు కార్యక్రమ నిర్వహణ కార్యదర్శి రావి శారద కృతజ్ఞతలు తెలిపారు.



కమర్షియల్ టాక్సెస్ కాలనీ రోడ్డులో వృథాగా పోతున్న మంచి నీరు



శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలో 11(ఏ) రోడ్డు, గుత్తికొండ సత్యనారాయణ రోడ్డులో మరమ్మతుల కోసం తవ్విన గుంతలు



జలం వృథా

- కమర్షియల్ టాక్సెస్ కాలనీలో పైపులైన్ల మరమ్మతుల కోసం గుంతలు తీసి వదిలేసిన వీఎంసీ సిబ్బంది
- ఉదయం, సాయంత్రం సరఫరా చేసినప్పుడు వృథాగా పోతున్న నీరు
- మరమ్మతులు త్వరగా చేయాలని కోరుతున్న స్థానికులు

(ఆంధ్రజ్యోతి-భారతీనగర్): నాలుగో డివిజన్‌లోని శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలోని కమర్షియల్ టాక్సెస్ కాలనీలోని ప్రధాన, అంతర్గత రోడ్లలోని మున్సిపల్ వాటర్ పైపులు ధ్వంసం కావడంతో నీరు వృథాగా పోతోంది. ఈ ప్రాంతాల్లో ఇటీవల మంచి నీటి పైపులు ధ్వంసం కావడంతో వీఎంసీ సిబ్బంది మరమ్మతుల కోసం గుంతలు తీశారు. వీటి పనులు పూర్తి చేయడంలో ఆలస్యం జరగడంతో ఉదయం, సాయంత్రం నీరు వదిలిన ప్రతిసారి నీరు వృథాగా పోతోందని స్థానిక పెద్దలు చెబుతున్నారు. ఈ గుంతలు రోడ్డు మార్జిన్‌లో ఉండడంతో రాత్రి సమయంలో ప్రయాణించేవారు ప్రమాదాల బారిన పడే అవకాశముందని, త్వరగా మరమ్మతులు చేయాలని అధికారులను స్థానిక పెద్దలు కోరుతున్నారు.

ఆలపాటికి ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ మద్దతు

గవర్నర్‌పేట: ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంజీ రోడ్డులోని ఎంబీవీకేలో నిర్వహించిన పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమావేశానికి హాజరైన ఆలపాటి రాజేంద్రప్రసాద్ తమకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారని వివరించారు.

10న అంగన్వాడీ సమస్యలపై మహాధర్నా

గాంధీనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల సమస్యలపై మార్చి 10న నగరంలో 'మహాధర్నా' చేపడుతున్నట్టు సీఐటీ యూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘాల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ల నేతలు పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రెస్ మీట్‌లో ఆయా సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. అంగన్వాడీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కె.సుబ్బరావమ్మ, ఎన్‌సీహెచ్.సుప్రజ, ఎస్.మంజుల, జి.భారతీ, సీహెచ్.విజయదుర్గ, వీఆర్.జ్యోతి మాట్లాడారు.

ముసాయిదా నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలి

లబ్బీపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వాహన కాలపరిమితిని కుదిస్తూ కేంద్రం జారీ చేసిన ముసాయిదా నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. 12 ఏళ్లకంటే పాత వాహనాలపై ఆంక్షలు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 7న జారీ చేసిన డ్రాఫ్ట్ పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శికి లేఖ పంపినట్టు అధ్యక్షులు నాగమోతు రాజా, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీరవెంకట సత్యనారాయణ తెలిపారు.

ఎఫ్1లో పడి మునిగిపోయారు

- దంపతుల నుంచి రూ.91.62 లక్షలు లాగేసిన ఈ-కేటుగాళ్లు

విజయవాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు దంపతులకు షేర్ల పేరుతో వల వేసి సైబర్ నేరగాళ్లు రూ.91.62లక్షలు లాగేశారు. దీనిపై సైబర్ క్రైం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. నగరానికి చెందిన ఒక మహిళ కొద్దిరోజుల క్రితం వీఐపీ ఎఫ్1 హై పెర్‌ఫార్మెన్స్ స్టాక్ సర్కిల్ వాట్సాప్ గ్రూపులో చేరింది. ఇందులో షేర్ల అమ్మకాలు, కొనుగోలు ప్రకటనలు వచ్చాయి. తర్వాత ఫైయర్స్ ఐటీ అనే వెబ్‌సైట్‌లో అకౌంట్ తెరిచారు. గ్రూపు చాటింగ్‌లో గుర్తుతెలియని వ్యక్తి తమ కంపెనీ మేనేజర్ ఆర్యన్ (8976044159)తో టచ్‌లో ఉండాలన్నారు. దీంతో ఆమె ఆ నంబర్‌కు ఫోన్ చేసి అతడి సూచనలతో రూ.26.99 లక్షలను వేర్వేరు మార్గాల్లో చెల్లించారు. అంతేకాక భర్త మరో రూ.64.63 లక్షలను బదిలీ చేశారు. వారికున్న అకౌంట్లో డబ్బులున్నట్టుగా చూపించడంతో విత్‌డ్రాకు ప్రయత్నించగా డబ్బులు తమ బ్యాంకు ఖాతాలో జమ కాకపోవడంతో మోసపోయినట్టుగా గుర్తించారు. దీంతో వారు 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. అనంతరం సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



తరచూ ప్రమాదాలు జరుగుతున్న బెత్లేహేమ్‌నగర్ చిన్న చర్చి సమీపంలో మలుపు, దంత వైద్య కళాశాల వద్ద జంక్షన్

(ఆంధ్రజ్యోతి-ప్రభుత్వాసుపత్రి): గుణదల ప్రభుత్వ దంత వైద్య కళాశాల వద్ద నాలుగు రోడ్ల కూడలిలో స్పీడ్ బ్రేకర్ లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు వేగంగా వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నారని, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దంత కళాశాల సమీపాన ఉన్న జంక్షన్ వద్ద నుంచి గుణదల చర్చి, ఈఎస్ఐ ఆస్పత్రి, ఆటోనగర్, ప్రభుత్వాస్పత్రి, రమేష్ ఆస్పత్రికి ఈ జంక్షన్ మీదుగానే వెళ్లాలి. గుణదల బెత్లేహేమ్‌నగర్ చిన్న చర్చి సెంటర్ సమీపంలో ఉన్న రోడ్డులో పెద్ద మలుపు ఉంది. ఇక్కడ కూడా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, స్పీడ్ బ్రేకర్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

దిక్సూచి
DIKSUCHI

పరీక్షల ముందు ఇలా చదవండి

త్వరలో తెలుగు రాష్ట్రాల్లో బోర్డు పరీక్షలు మొదలు కాబోతున్నాయి. రెండు రాష్ట్రాల్లో కలిపి గత సంవత్సరం సుమారు 10 లక్షల మంది పదో తరగతి, 12 లక్షల మంది ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. ఈ సంవత్సరం కూడా దాదాపు అంతే సంఖ్యలో విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. సమగ్రమైన ప్రణాళిక, సమయ నిర్వహణతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని విద్యా నిపుణులు చెబుతున్నారు. బోర్డు పరీక్షల మార్కులు ఉన్నత విద్యా అవకాశాలను నిర్ణయిస్తాయి. ప్రిపరేషన్ బాగుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పరీక్షా హాల్‌లో సమయం సరిపోతుంది. అలాగే సరైన స్టడీ ప్లాన్, రివిజన్, మాక్ టెస్టులు రాయడం వల్ల బాగా గుర్తుంటాయి. టాపర్ల టిప్స్ అనుసరించడం, తప్పులు తగ్గించడం ఉత్తమ ఫలితాలకు దోహదం చేస్తాయి. పరీక్షలకు ఉన్న ఈ కొద్ది రోజుల్లో స్మార్ట్ వర్క్ ముఖ్యం అంటున్నారు నిపుణులు...



ప్లానింగ్ ముఖ్యం

1. తప్పక చదవాల్సిన చాప్టర్లను గుర్తించండి. బోర్డు పరీక్షలలో ఎక్కువ స్కోరింగ్ టాపిక్స్ తెలుసుకోండి.
2. రోజువారీ టైమ్ టేబుల్ తయారు చేసుకోండి. ప్రతి రోజు చదవడానికి ఖచ్చితమైన సమయాన్ని కేటాయించండి.
3. చిన్న చిన్న లక్ష్యాలను నిర్ధారించుకోండి. కష్టమైన సబ్జెక్టులో ఒక్కో రోజు ఒక హార్డ్ ఛాప్టర్, ఈజీ చాప్టర్ లేదా ముఖ్యమైన టాపిక్స్ పూర్తిచేయండి.
4. సమయం వృథా చేయొద్దు. మొబైల్, టీవీ వంటి దృష్టి మళ్లించే విషయాలను తగ్గించాలి.
5. కనీసం 6-8 గంటలు నిద్ర ముఖ్యం.

మంచి మార్కుల చిట్కాలు

6. సొంత నోట్స్ ప్రిపేర్ చేసుకోండి. ముఖ్యమైన పాయింట్లు, ఫార్ములాలు, డయాగ్రామ్స్ ఒక దగ్గర రాసుకోండి.
7. రివిజన్ చేయండి. ఒకే విషయాన్ని పదే పదే చదివితే మరచిపోయే ప్రసక్తి లేదు.
8. పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయండి. గత 5-10 ఏళ్ల ప్రశ్నపత్రాలను రాసి ప్రాక్టీస్ చేయండి. అకడమిక్ పరీక్షల్లో ఇవే దాదాపుగా రిపీట్ అవుతుంటాయి.
9. పరీక్షల్లో టైమ్ మేనేజ్‌మెంట్ ముఖ్యం. మాక్ టెస్ట్ రాయడం ద్వారా లోటుపాట్లను అధిగమించవచ్చు.

సబ్జెక్టుకు ఒక వ్యూహం

10. మేథ్స్ రోజూ ప్రాక్టీస్ చేయాలి. రోజుకు కనీసం 10-15 ముఖ్యమైన లెక్కలు సాల్వ్ చేయండి.
11. సైన్స్ విషయంలో ఫార్ములాలు, డయాగ్రామ్స్, ఈక్వేషన్స్, రియాక్షన్స్ ఒక దగ్గర రాసుకుని ప్రాక్టీసు చేయండి.
12. సోషల్ స్టడీస్‌లో డేట్స్, ఈవెంట్స్ ముఖ్యం. కథల మాదిరిగా చదివి అర్థం చేసుకోవడం ఉత్తమం.
13. ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టుల్లో వ్యాకరణం ప్రాక్టీస్ చేయండి. ముఖ్యమైన వ్యాకరణ నియమాలను రాసి చదవండి.
14. స్మార్ట్ స్టడీ మెథడ్స్ ఉపయోగించండి.

పరీక్ష రోజు

15. తక్కువ ఒత్తిడితో చదవండి. కొండను ఎత్తుకుంటున్నట్లుగా కాకుండా ఆసక్తిగా చదవండి.
16. ఒత్తిడిని తగ్గించుకోవడానికి రోజుకు 10 నిమిషాలు ధ్యానం, యోగా వంటివి చేయండి.
17. ఆకుకూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ వంటి పోషకాహారాన్ని పెంచండి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా మెదడు చురుకుగా ఉంటుంది.
18. పరీక్ష ముందు రోజు కొత్త విషయాలు చదవొద్దు. రివిజన్ మాత్రమే చేయాలి.
19. పరీక్ష రోజు ప్రశాంతంగా ఉండండి. సమయం కంటే ముందే హాల్‌కు చేరుకోండి. ఇతరులు ఎలా చదివారు, ఎంత చదివారు అనే విషయాలపై చర్చ వద్దు. ప్రశాంతంగా ప్రశ్నపత్రం చదివి సమాధానాలు రాయండి.

- డాక్టర్ పవన్‌కుమార్ కాసు

సమాధానాలు రాసేప్పుడు



1. ప్రశ్నను పూర్తిగా చదవండి. తొందరలో తప్పుగా అర్థం చేసుకోవద్దు. ముఖ్యంగా 'ఎక్స్‌ప్లెయిన్, కంపేర్, డిస్క్రైబ్' వంటి పదాలు గమనించండి.
2. టైమ్ ప్లానింగ్ ముందే చేసుకోండి. చిన్న ప్రశ్నలకు తక్కువ సమయం, దీర్ఘ సమాధానాలకు ఎక్కువ సమయం పక్కాగా పాటించండి. బాగా వచ్చు కదా అని చిన్న ప్రశ్నకు ఎక్కువ సమయం తీసుకుని చివర్లో ఇబ్బంది పడొద్దు.
3. స్పష్టమైన, క్రమబద్ధమైన రాత ముఖ్యం. సమాధానాన్ని పాయింట్స్‌గా రాయండి. ఎక్కువ పేరాలు అన్నట్లు కాకుండా లాజికల్ ఫ్లోలో ఉండేలా చూసుకోండి.
4. ముఖ్యమైన పాయింట్లకు అండర్‌లైన్ చేయండి. ఆయా పదాలను హైలైట్ చేయడం వల్ల పరిశీలకుడు సమాధానం స్పష్టంగా చూడగలుగుతాడు.
5. తగిన డయాగ్రామ్స్ చార్ట్‌లు వాడండి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, జాగ్రఫీ వంటి సబ్జెక్టులకు సరైన పటాలు, డయాగ్రామ్స్ గీయండి.
6. తప్పులు తగ్గించేందుకు స్పష్టమైన భాష వాడండి. అపరిపక్వమైన పదజాలం, క్లిష్టమైన వ్యాకరణాన్ని ఉపయోగించ వద్దు.
7. లెక్కలు, సైన్స్‌ల్లో స్టెప్ బై స్టెప్ ఆన్సర్ రాయండి. నేరుగా సమాధానం రాయకుండా, ప్రతి స్టెప్ చూపించి రాయడం వల్ల పూర్తి మార్కులు వస్తాయి.
8. మినిమమ్, మాగ్జిమమ్ లిమిట్స్‌లో రాయండి. రెండు మార్కుల ప్రశ్నకు 10 లైన్లు రాయడం, 5 మార్కుల ప్రశ్నకు 3 లైన్లు రాయడం తప్పు. సరిపడే సమాచారం అందించండి.
9. చివర్లో సమాధానాలు చెక్ చేసుకోండి. తప్పులు సవరించుకునేందుకు చివరి 5-10 నిమిషాలు కేటాయించండి.
10. పేపర్‌ను క్లీన్‌గా ఉంచండి. అర్థం కాని రాత, ఎక్కువ సార్లు కొట్టివేతలు, స్క్రిబ్లింగ్ ఉండకుండా చూసుకోవాలి.

ఐఐఎమ్‌లు అందించే ఉచిత కోర్సులు ఇవే

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లు పలు విభాగాలకు సంబంధించిన ఉచిత కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సుల గురించి కేంద్రప్రభుత్వం నిర్వహించే 'స్వయం పోర్టల్' (https://swayam.gov.in/) ద్వారా తెలుసుకోవచ్చు.

బిజినెస్ కమ్యూనికేషన్ ఎసెన్షియల్స్: ఇది ఐఐఎం బెంగళూరు అందించే 6 వారాల కోర్సు. ఉద్యోగ, వ్యాపారాల్లోని సవాళ్లను ఎదుర్కొనేలా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందిస్తారు. 2025 మే 18 నుంచి క్లాసులు మొదలవుతాయి. 2025 ఫిబ్రవరి 28 వరకు నమోదు కావచ్చు.

బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ మార్కెట్స్: రిస్క్ మేనేజ్‌మెంట్‌పై ఐఐఎం బెంగళూరు అందించే ఈ కోర్సు కాలవ్యవధి ఆరు వారాలు. ఎన్‌రోల్‌మెంట్ 2025 ఫిబ్రవరి 28 వరకు చేసుకోవచ్చు.

ఆర్గనైజేషనల్ బిహేవియర్ అడ్వాన్స్‌డ్ టాపిక్స్: ఐఐఎం షిల్లాంగ్ అందించే ఆరు వారాల కోర్సు ఇది. మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉపయోగం.

స్ట్రాటజిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్: ఇది 8 వారాల కోర్సు. ఐఐఎం బెంగళూరు అందిస్తోంది.

వాల్యుయేషన్ అండ్ క్రియేటింగ్ సస్టయినబుల్ వాల్యూ: వాల్యుయేషన్ మెథడ్స్, ఎలా వాల్యుయేషన్ చేయాలో ఉదాహరణలతో సహా వివరిస్తారు. ఐఐఎం బెంగళూరు అందించే ఆరు వారాల కోర్సు ఇది. 2025 ఫిబ్రవరి 28 తేదీ వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు.

డిజిటల్ మార్కెటింగ్: ఐఐఎం బెంగళూరు నిర్వహించే ఆరు వారాల కోర్సు ఇది. డిజిటల్ ఇన్‌బౌండ్, ఔట్‌బౌండ్ మార్కెటింగ్, లీవరేజింగ్ సోషల్ మీడియా, కస్టమర్ ఇన్‌సైట్స్ తదితరాలు నేర్పిస్తారు. 2025 ఫిబ్రవరి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలి.

హెచ్ఆర్ఎం స్ట్రాటజీ ఎగ్జిక్యూషన్: ఐఐఎం అహ్మదాబాద్ నిర్వహిస్తున్న ఆరు వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలి.

డేటా డ్రైవెన్ మార్కెటింగ్ డెసిషన్ మేకింగ్: మార్కెటింగ్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఐఐఎం విశాఖపట్నం డిజైన్ చేసిన 8 వారాల కోర్సు ఇది. కొనుగోళ్లను ప్రభావితం చేసే అంశాలను బోధిస్తారు.

ఫైనాన్షియల్ అకౌంటింగ్ అండ్ అనాలిసిస్: ఐఐఎం బెంగళూరు డిజైన్ చేసిన కోర్సు. ఫైనాన్షియల్ కాన్సెప్ట్స్, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్, అకౌంటింగ్ స్టాండెడ్స్ తదితరాలు ఇందులో ఉంటాయి.

జనరేటివ్ ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్: ఐఐఎం బెంగళూరు అందించే 8 వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలి.

SCHOLARSHIP ALERT

Ramalingaswami Re-entry

Description: Ramalingaswami Re-entry Fellowship 2024-25 is offered by the Department of Biotechnology, Ministry of Science & Technology, Government of India, to students with relevant PhD/MD degrees or equivalent.
Eligibility: This is open to Indians below 45 years on the application closing date. Applicants must hold a PhD/MD/M.Tech or equivalent degree in specified fields.
Prizes & Rewards: A fellowship of 1,35,000 per month and other benefits. *Last Date:* 28-02-2025
Url: www.b4s.in/aj/RFIB2

Quad Fellowship

Description: It is initiated by the governments of Australia, India, Japan, and the US, is administered by the Institute of International Education (IIE).
Eligibility: Open to citizens or legal permanent residents of specific countries including India. Applicants must be at least 18 years of age at the time of application submission and possess a bachelor's degree
Prizes & Rewards: The fellowship offers a one-time stipend of $40,000 and other benefits.
Last Date: 03-03-2025
Url: ww.b4s.in/aj/QUFD1

buddy4study.com

ఆంత్రప్రెన్యూర్ కావడానికీ కోర్సులు ఉన్నాయి

ఉద్యోగాలు చేయడం కాదు, ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదగాలి. 'ఆంత్రప్రెన్యూర్‌షిప్' కరిక్యులమ్‌లో భాగమైతేనే ఇది సాధ్యం. దేశవ్యాప్తంగా విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌లో ఆంత్రప్రెన్యూర్ మైండ్‌సెట్ అభివృద్ధి అవుతుందనే ఆలోచనతో హైదరాబాద్ ఐఐటీ 'ఇన్నోవేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్' స్కూల్‌ను ప్రారంభించింది. అదే బీవీఆర్ సైయింట్ (బీవీఆర్ స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్). భారతదేశంలో ఆంత్రప్రెన్యూర్‌షిప్‌పై ప్రత్యేక స్కూల్ ఇది ఒక్కటే. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సంఖ్యను పెంచడం, అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం, అవసరమైన వాతావరణాన్ని ఏర్పడరచడం లక్ష్యాలుగా 2024 జనవరిలో దీనిని ఏర్పాటు చేశారు.

ఇక్కడ ఫార్మల్ డిగ్రీలు కాకుండా ఇన్నోవేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్‌పై షార్ట్‌టర్మ్ కోర్సులు అందిస్తారు. వీటికి సంబంధించి ఇంజనీరింగ్ వంటి కాలేజీలకు, కార్పొరేట్ సంస్థలకు వెళ్లి అవగాహన కల్పిస్తారు. ఆలోచనలు అవకాశాలుగా, బిజినెస్‌గా ఎలా మలచాలో ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులు, ఐఐటీ ఫ్యాకల్టీలు ఇక్కడ శిక్షణ ఇస్తారు. దీనితోపాటు టీహబ్, ఇతర ఇన్నోవేషన్ సెంటర్లతో కలిసి వర్క్ చేస్తున్నారు.

కోర్సులు: ప్రస్తుతం బీవీఆర్ సైయింట్ కొన్ని కోర్సులను ఆఫర్ చేస్తోంది. 'ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ ఇన్ డిజిటల్ ఎరా' కోర్సు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. త్వరలో 'డిజిటల్ ఆంటర్ ప్రైజెస్', 'ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ ఫర్ ఆంత్రప్రెన్యూర్స్' తదితర కోర్సులు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాల కోసం బీవీఆర్ సైయింట్ వెబ్‌సైట్ చూడవచ్చు.



Address: BVR SCIENT, IIT- Kandi, Sangareddy, Telangana– 502284**Mobile:** +91 9160006190, https://bvrscient.iith.ac.in/

చిత్రజ్యోతి
SINCE 1965

కర్మఫలం నేపథ్యంలో..



అను ఇమ్మాన్యుయేల్, శివ కందుకూరి ప్రధాన పాత్రల్లో ఆండ్రూ బాబు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'బూమరాంగ్'. లండన్ గణేశ్, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని 'గ్లింప్స్'ని చిత్ర బృందం లాంచ్ చేసింది. ఈ సందర్భంగా శివ కందుకూరి మాట్లాడుతూ 'ఈ సినిమాలో ఒక డార్క్ సైడ్ ఉంది. కచ్చితంగా ఇది డిఫరెంట్ మూవీ అవుతుంది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు ఆండ్రూ బాబు మాట్లాడుతూ 'కరోనా సమయంలో చాలా కథలు రాశాను. అందులోంచి ఎంపిక చేసిన మొదటి కథ 'బూమరాంగ్'. ఇది మెసేజ్ ఓరియెంటెడ్ సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రం' అని తెలిపారు. నిర్మాత ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ 'అవుట్ పుట్ అద్భుతంగా వచ్చింది. మీ అందరి సపోర్ట్ కావాలి' అని కోరారు. సవాలు విసిరే కథ ఇది. శివ కందుకూరి మంచి నటుడు. భిన్నమైన కథలు చేస్తున్నారు' అని ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ కె.ఎల్. దామోదర ప్రసాద్ అన్నారు.

శబ్దం ఒక అద్భుతం



నాని

"హారర్ సినిమా చూసినా కళ్లు చెమ్మగిల్లుతాయని నేను ఎప్పుడూ అనుకోలేదు. మంచి కథతో పాటు భావోద్వేగాలు ఉన్న చిత్రం 'శబ్దం'. ఈ సినిమా నేను చూశాను. అద్భుతంగా ఉంది" అని నాని అన్నారు. ఆది పినిశెట్టి కథానాయకుడిగా, అరివళగన్ దర్శకత్వంలో శివ నిర్మించిన చిత్రమిది. సిమ్రాన్ లైలా, లక్ష్మీ మీనన్ కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా యూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన నాని మాట్లాడుతూ 'ఉపయోగించుకోవాలే కానీ సౌండ్ కూడా ఒక ఆయుధం అవుతుందనే అంశాన్ని 'శబ్దం' చిత్రంలో అద్భుతంగా చూపారు' అని ప్రశంసించారు. ఆది పినిశెట్టి మాట్లాడుతూ 'వైశాలి నా కెరీర్‌లో స్పెషల్ మూవీ. ఇప్పుడు శబ్దం కూడా నాకు స్పెషల్ మూవీ అవ్వాలని కోరుకుంటున్నాను' అన్నారు. తమన్ తన సంగీతంతో సినిమాకు ప్రాణం పోశాడని అరివళగన్ చెప్పారు.



అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది

సందీప్ కిషన్

సందీప్ కిషన్, రీతూ వర్మ, అన్షు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మజాకా'. త్రినాథ రావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేశ్ కెఆర్ బన్సల్ నిర్మించారు. ఈనెల 26న విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో హయ్యస్ట్ నెంబర్స్‌ని ఈ సినిమా ఇస్తుంది. థియేటర్‌లో కుటుంబసమేతంగా చూసే చిత్రమిది. రావు రమేశ్ అద్భుతంగా నటించారు. ఆయన వల్ల కథ మరింత పండింది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు త్రినాథరావు మాట్లాడుతూ 'నేను ప్రతి సీన్‌లో మ్యాజిక్ ఉండాలని నమ్ముతాను. నా ప్రతి సినిమాలో కూడా మ్యాజిక్ జరుగుతుంది. ఇందులో కూడా ఓ మ్యాజిక్ ఉంది. శివరాత్రి నాడు డబుల్ మ్యాజిక్ జరుగుతుంది. డబుల్ బ్లాక్ బస్టర్ అవుతుంది' అని తెలిపారు. రావు రమేశ్ మాట్లాడుతూ 'ఇలాంటి సినిమా చేయడం నాకు కొత్తే. ఇందులో రొమాంటిక్‌గా నటించడం చాలా సవాల్‌గా అనిపించింది. ఒక ఎమోషనల్ సీన్ ఉంది. అది ఐకానిక్‌గా నిలిచిపోతుంది' అని అన్నారు. హీరోయిన్ రీతూ వర్మ మాట్లాడుతూ 'ఈ సినిమాని ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు. నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ' ప్రతి ఒక్కరికీ ఈ సినిమా నచ్చుతుంది. రీతు వర్మ డ్యాన్స్ అదరగొట్టింది' అని అన్నారు.

మాఫియాతో పోలీస్ పోరాటం



సంఘ విద్రోహ శక్తుల ఆటకట్టించే పోలీసాఫీసర్ కథతో తెరకెక్కుతోన్న చిత్రం 'విద్రోహి'. రవిప్రకాశ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వీఎస్‌వీ దర్శకత్వంలో వీ వెంకట సుబ్రహ్మణ్యం, పీ కనకదుర్గారావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నటుడు శ్రీకాంత్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. రవి ప్రకాశ్ మాట్లాడుతూ 'ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్. కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి. దర్శకుడిగా వీఎస్‌వీకి పేరు తెస్తుంది' అన్నారు. ఒక తెలివైన పోలీసు మాఫియాను మట్టుబెట్టిన తీరు ప్రేక్షకులను అలరిస్తుందని నిర్మాతలు చెప్పారు. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సతీశ్ ముత్యాల.

పది లక్షల క్షయ వ్యాక్సిన్లు ఔట్!

ఈ నెల 28వ తేదీ నాటికి ఎక్స్‌పైరీ

- ఏడాది క్రితం మొదలైన పంపిణీ
- ఇంకా 40 % కూడా పూర్తికాని వైనం
- దీంతో కేంద్రం పంపిన వ్యాక్సిన్లకు కాలపరిమితి
- అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ల విలువ రూ.కోట్లలోనే!
- ఆరోగ్యశాఖలో కొందరు అధికారుల తీరుతో వృథా
- వ్యాక్సిన్లు వేశాక కూడా క్షయ లక్షణాలు?



అమరావతి/గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్షయ (టీబీ) వ్యాధి నివారణకు ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలు సత్ఫలితాలు ఇవ్వడంలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయ వ్యాధి నివారణకు రూ.కోట్లు చేస్తున్నాయి. క్షయ సెంటర్ల ద్వారా ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నాయి. అయినా...కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం తాను నిర్దేశించుకున్న లక్ష్యాలను అందుకోలేకపోతోంది. రాష్ట్రంలో 60 ఏళ్లు దాటిన వారికి క్షయ సోకకుండా కేంద్ర ప్రభుత్వం అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఈ వ్యాక్సిన్ సరఫరా చేసి వృద్ధుల్లో క్షయ నివారణకు ప్రయత్నిస్తోంది. ఇందులోభాగంగా మన రాష్ట్రంలో దాదాపు 60 లక్షల మందికి వ్యాక్సిన్ వేయాలని కేంద్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. వ్యాక్సిన్ డోస్‌లను నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా ఏపీకి పంపించింది. గత ఏడాది మే నెల నుంచి ఈ వ్యాక్సిన్ వేయడం ప్రారంభించారు. అయినా, ఇప్పటి వరకూ 40 శాతం లక్ష్యాన్ని కూడా చేరుకోలేకపోయారు. టీబీతో బాధపడుతున్న వ్యక్తితోపాటు ఆయన కుటుంబ సభ్యులకు, ఆ ఇంటి చుట్టూ ఉన్న వారికి కూడా వ్యాక్సిన్ ఇవ్వాలి. కొవిడ్ వ్యాక్సిన్ పట్ల అప్పట్లో ఏర్పడిన నెగిటివ్ ప్రచారం వల్ల వీరిలో కొంత మంది అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందుకురావడం లేదు. అలాంటివారిని గుర్తించి అవగాహన కలిగించడంలో రాష్ట్ర ఆరోగ్యశాఖలోని కొందరు అధికారులు వైఫల్యం చెందుతున్నారు. దీంతో వ్యాక్సిన్ పంపిణీ అనుకున్నంత చురుగ్గా జరగడం లేదని ఆరోగ్యశాఖ వర్గాలే చెబుతున్నాయి.

కొరవడిన సమన్వయం

కేంద్రం నుంచి రాష్ట్రానికి మొత్తం 70 లక్షల అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్లు అందాయి. అందులో 30 లక్షలు అనంతర కాలంలో తమిళనాడుకు పంపించారు. ఇక మిగిలిన 40 లక్షల వ్యాక్సిన్లలో 24 లక్షలు ఉపయోగించారు. ఇక మిగిలింది 16 లక్షలు. అందులో పది లక్షల వ్యాక్సిన్ల కాల పరిమితి ఈ నెల 28వ తేదీతో ముగుస్తోంది. ముందుగా నిర్దేశించుకున్న దానికి ప్రకారం వ్యాక్సిన్ వేయలేకపోవడంతో తలెత్తిన సమస్య ఇది. దీనిపై ఏం చేయాలన్న దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ వ్యాక్సిన్ల విలువ రూ. కోట్లలో ఉంటుంది. కొంత డబ్బుల ద్వారా, కొంత క్రైండ్ గ్రాంట్ కింద.. ఇలా వివిధ మార్గాల్లో కేంద్రం సహకరిస్తోంది. ఇందులో.. మందులు, వ్యాక్సిన్లు, వైద్య పరికరాలు క్రైండ్ గ్రాంట్ కింద అందిస్తోంది. ఎక్స్‌పైరీ అవుతున్న వ్యాక్సిన్ విలువ క్రైండ్ గ్రాంట్ కింద చూపించి ఆ మేరకు నిధులకు కేంద్రం కోత పెడుతుందా? లేక ఎక్స్‌పైరీ వ్యాక్సిన్ల స్థానంలో కొత్తవి అందిస్తుందా అనేది చూడాలి. రాష్ట్ర ఆరోగ్యశాఖలోని కొందరి అధికారుల నిర్వాకంతో సకాలంలో వ్యాక్సిన్లు వేయలేకపోతున్నారు. దీనిపై కేంద్రంతో సమన్వయం చేసుకోవడంలోనూ విఫలమవుతున్నారు.

వ్యాక్సిన్ పని చేస్తున్నదా?

మన రాష్ట్రంలో ప్రస్తుతం 76,590 మంది క్షయవ్యాధికి చికిత్స పొందుతున్నారు. టీబీ వ్యాధి సోకకుండా ముందస్తుగా కాపాడేందుకు అడల్ట్ బీజీసీ వ్యాక్సిన్లు ఇవ్వాలని కేంద్రం నిర్దేశించింది. అయితే, ఈ వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత కూడా కొందరిలో క్షయ లక్షణాలు కనిపించడం ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో వ్యాక్సిన్ పనితీరుపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇటీవల గుంటూరులో ఈ తరహా కేసులు వెలుగు చూడటం చర్చనీయాంశంగా మారింది. వీరిలో క్షయ లక్షణాలు వ్యాక్సిన్ వేయకముందే ఉన్నాయా? లేక వ్యాక్సిన్ వేసిన చాలా కాలానికి తలెత్తాయా అనేది చెప్పాల్సింది రాష్ట్ర ఆరోగ్యశాఖ. కానీ, ఈ శాఖలోని కొందరు అధికారులు దీనిపై నిర్లక్ష్యంగా ఉంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మా దృష్టికి రాలేదు



"అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ల కాలపరిమితి ముగుస్తున్న సమాచారం మా దృష్టికి రాలేదు. కొవిడ్ వ్యాక్సిన్‌పై వచ్చిన ప్రతికూల ప్రచారం ఈ వ్యాక్సిన్ల పంపిణీపై ప్రభావం చూపుతోంది. వ్యాక్సిన్ చేసుకోవడానికి కొంత మంది సుముఖత చూపడం లేదు. దీని వల్ల లక్ష్యాన్ని చేరుకోవడంలో జాప్యం జరుగుతోంది"

- ఎం.టి.కృష్ణబాబు, ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్

'లోకల్ బాయ్' నాని అరెస్టు

- బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేశాడని అభియోగం
- మరి కొందరిపైనా చర్యలు



విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేశాడనే అభియోగంపై విశాఖకు చెందిన సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ వాసుపల్లి నాని అలియాస్ 'లోకల్ బాయ్' నానిని సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. నగరానికి చెందిన ఓ యువకుడు దఫాబెట్, పారీమ్యాచ్, మహదేవ్‌బుక్, రాజాబెట్ వంటి ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల్లో ఇప్పటికే రూ.2 కోట్లు వరకు పోగొట్టుకొని అప్పుల పాలయ్యాడు. ఈ సమయంలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చంటూ నాని ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తూ యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల్లో వీడియో అప్‌లోడ్ చేశాడు. దీనిపై ఆ యువకుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇలాంటి ప్రచారం వల్ల యువత ప్రభావితమయ్యే అవకాశం ఉందని, నానిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. అప్పటికే తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ లోకల్‌బాయ్ నానిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు తక్షణం వీడియోలను తొలగించాలని ఆదేశించిన విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ ద్వారా కలర్ ప్రిడిక్షన్ బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేశాడని, అందుకు కొంత డబ్బు కూడా అందినట్టు నిర్ధారణ అయింది. దీంతో నానిని అరెస్ట్ చేసి శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. మరికొందరు సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలడంతో.. వారిపైనా త్వరలో చర్యలు తీసుకుంటామని సీపీ శంఖబ్రతబాగ్చి తెలిపారు. ఎవరైనా తమ సొంత ప్రయోజనాల కోసం యువతను తప్పుదారి పట్టించడం, బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడం వంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

పెరిగిన ఎండ

- కర్నూలులో 38.5 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వాయవ్య భారతం నుంచి వీస్తున్న పొడిగాలుల ప్రభావంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఆదివారం ఎండతీవ్రత కొనసాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. దేశంలోనే అత్యధికంగా కర్నూలులో 38.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు, మూడు రోజులు కోస్తా, రాయలసీమల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఎండ తీవ్రత కొనసాగుతుందని పేర్కొంది.

టన్నెల్ నిండా బురద!

- నిమిషానికి 3,500 లీటర్ల దాకా సొరంగంలోకి వస్తున్న ఊటనీరు
- చిక్కుకుపోయిన వారి పరిస్థితిపై అందరిలోనూ ఆందోళన
- ఎస్ఎల్‌బీసీ సొరంగం లోపలికి వెళ్లిన మూడు రెస్క్యూ బృందాలు



టన్నెల్‌లో సహాయక చర్యలను పరిశీలిస్తున్న టీ మంత్రి ఉత్తమ్ కుమార్

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూలు/అచ్చంపేట/ దోమలపెంట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పరిధిలోని శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గంలో పైకప్పు కూలిన ఘటనలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. టన్నెల్ లోపల ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు ఆపరేటర్లు, నలుగురు కార్మికులు చిక్కుకోవడంతో.. వారిని కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలు, హైడ్రా, ఇండియన్ ఆర్మీ, స్పెషల్ బెటాలియన్స్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి 10.30 గంటల నుంచి సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. ఆదివారం సాయంత్రం వరకు మూడు బృందాలు లోపలికి వెళ్లాయి. అయితే సొరంగంలో దాదాపు 2.5 మీటర్ల నుంచి 3 మీటర్ల ఎత్తున బురద పేరుకుపోవడం, నిమిషానికి 3500 లీటర్ల వరకు ఊటనీరు వస్తుండటం, ప్రమాదం జరిగిన తర్వాత పేరుకుపోయిన నీరు నిల్వ ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. దాదాపు 13 కిలోమీటర్ల వరకు విద్యుత్తు సరఫరాను, వైపైని పునరుద్ధరించగా.. అక్కడి వరకు ఆక్సిజన్ సరఫరా నిర్విరామంగా కొనసాగుతోంది. టన్నెల్ లోపల ఇరుకుగా ఉండటం, దిగువన బురద కారణంగా అడుగు తీసి అడుగు వేయలేని స్థితి ఉండటంతో.. సహాయక చర్యలకు ఎక్కువ బృందాలను తీసుకెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) నుంచి దాదాపు 400 మీటర్ల వరకు మట్టి కూరుకుపోయిందని సహాయక చర్యల్లో పాల్గొని తిరిగివచ్చిన వారు చెబుతున్నారు. దీంతో లోపల చిక్కుకున్నవారి పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని భావిస్తున్నారు. లోపలికి వెళ్లివచ్చిన వారు కూడా.. సహాయక చర్యలు పూర్తయి, టన్నెల్‌లో చిక్కుకున్న వారి వద్దకు వెళ్లాలంటే కనీసం మూడు రోజుల సమయం పడుతుందంటున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం మూడో బృందంలో మధ్యాహ్నం ఒంటి గంటకు టన్నెల్ లోపలికి వెళ్లి సాయంత్రం 6.40 గంటలకు బయటకు వచ్చారు. అక్కడ నెలకొన్న పరిస్థితి ప్రకారం ఎన్ని రోజులు పడుతుందో స్పష్టంగా చెప్పలేమన్నారు.

నిర్విరామంగా డీ వాటరింగ్ ప్రక్రియ..

సహాయక చర్యలకు ప్రధానంగా బురద, నీరు అడ్డంకిగా ఉండడంతో డీ వాటరింగ్ చేయడం సవాల్‌గా మారింది. లోపలికి వెళ్లివచ్చిన రెస్క్యూ బృందాల్లోని సభ్యులు కూడా ఇదే విషయం చెబుతున్నారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు నిల్వ ఉన్న బురద నీటిని తరలించడం కష్టంగా మారిందని అంటున్నారు. ఇప్పటికే డీ వాటరింగ్ కోసం అక్కడ 150 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటార్ ఉండగా, మరో 100 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటార్‌ను బిగించారు. నిమిషానికి దాదాపు 4500 లీటర్ల నీటిని బయటకు తోడుతున్నారు. పేరుకుపోయిన మట్టి.. లూజ్ బురదగా మారితే దానిని కూడా డీ వాటరింగ్‌లో భాగంగానే బయటకు తరలించే ప్రయత్నం చేస్తే సహాయక చర్యల్లో వేగం పెరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అయితే టన్నెల్ ఇరుకైనది కావడం కూడా సమస్యగా మారింది. టన్నెల్ దాదాపు 9 మీటర్ల వ్యాసంతో ఉంటుంది. ఇందులో ఎయిర్ పంపింగ్ కోసం పైపు లాంటి వ్యవస్థ ఉంటుంది. కిందివైపు.. పైపులు, విద్యుత్తు సరఫరా లైన్లు, మట్టి తరలించడానికి కన్వేయర్లు ఉంటాయి. ఈ ఇరుకు సొరంగంలోకి ఎక్కువ మంది వెళ్లి పనిచేయడానికి లేదా ఎక్స్‌కవేటర్లు, పెద్ద మెషినరీ వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొనడానికి అవకాశం లేదు. 50 నుంచి 60 మంది మాత్రమే వెళ్లి పనిచేయడానికి వీలుంటుంది. సొరంగం లోపల బురద పేరుకుపోవడంతో.. బృందాలు అందులోకి దిగి నడవడం కోసం తడకలను, లూజ్ బురద ఎక్కువగా ఉంటే అందులో నుంచి వెళ్లేందుకు థర్మకోల్ తెప్పలను, ఊటనీరు ఎక్కువగా వస్తే రక్షణ కోసం ట్యూబ్‌లను సహాయక బృందాలు లోపలికి తీసుకెళ్లాయి. మట్టికి అడ్డుగా ఐరన్ షీట్లు, రాడ్లు పడడంతో.. వాటిని కట్ చేయడానికి కట్టర్లు, గ్యాస్ సిలిండర్లు, విద్యుత్తు సరఫరా నిలిచిపోతే ఇబ్బంది కాకుండా డీజిల్ జనరేటర్లను తీసుకెళ్లారు.

సహాయక చర్యల్లో వందల మంది..

సొరంగంలో సహాయక చర్యల్లో భాగంగా భారత సైన్యం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడంతోపాటు రెండు ఆర్మీ హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచారు. ఎన్డీఆర్ఎఫ్ నుంచి 120 మంది సహాయక చర్యల్లో పాల్గొంటుండగా, ఎస్డీఆర్ఎఫ్ నుంచి 70 మంది, సింగరేణి రెస్క్యూ టీం నుంచి 35 మంది, హైడ్రా నుంచి 15 మంది పాల్గొంటున్నారు. నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, ఐఏఎస్ శ్రీధర్, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, నాగర్‌కర్నూలు కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్లు సుధీశ్‌కుమార్, ప్రసన్న, పవన్, అగ్నిమాపక శాఖ నుంచి ఆర్ఎఫ్ హరినాథ్‌రెడ్డి, సింగరేణి రెస్క్యూ టీం చీఫ్ కలందర్ తదితరులు పాల్గొంటున్నారు. మొదటి టీంలో 8 మంది మాత్రమే సొరంగంలోకి వెళ్లగా, రెండో టీంలో 23 మంది, మూడోసారి 50 మంది లోపలికి వెళ్లారు. జేపీ, రాబిన్ కంపెనీకి సంబంధించిన వారు విద్యుత్తు, ఎయిర్, వాటర్, డీవాటర్ ప్రక్రియను పరిశీలిస్తున్నారు. మరోవైపు సహాయక చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం సంబంధిత విభాగాలతో ఆరా తీశారు. సహాయక బృందాలకు సహకారం అందించేందుకు సికింద్రాబాద్ బైసన్ డివిజన్ ఇంజనీర్ టాస్క్‌ఫోర్స్ (ఈటీఎఫ్) బృందాలు కూడా ఆదివారం రంగంలోకి దిగాయి. భారత నావికా దళం బృందాలు కూడా రానున్నాయి.

బిజినెస్

బీఓఎం వడ్డీరేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ: ఇంటి రుణాలు, ఆటో రుణాలు సహా అన్ని రకాల రిటైల్ రుణాలపై వడ్డీ రేటును బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) 0.25 శాతం మేరకు తగ్గించింది. దీంతో ఇంటి రుణాలపై వడ్డీ రేటు 8.10 శాతానికి దిగివచ్చింది. బ్యాంకింగ్ పరిశ్రమలో అతి తక్కువ వడ్డీ రేటు ఇదేనని బీఓఎం తెలిపింది. కార్ రుణంపై వడ్డీ రేటు 8.45 శాతానికి తగ్గింది. విద్యా రుణాలపై రెపో అనుసంధానిత వడ్డీరేటు (ఆర్ఎల్ఎల్ఆర్) కూడా 0.25 శాతం మేరకు తగ్గించారు.

ప్రస్తుత పొదుపు.. భవిష్యత్‌లో సరిపోదేమో..!

మెజారిటీ భారతీయుల మనోగతమిదే..

ముంబై: పొదుపునకు సంబంధించి భారతీయుల మనోగతంపై యూగవ్, ఎడెల్‌వీజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఓ సర్వే చేపట్టింది. పూర్తి స్థాయి లేదా పాక్షిక ఆర్థిక ప్రణాళికను రూపొందించుకున్నప్పటికీ, భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా లేమన్న భావన కలుగుతోందని ఈ సర్వేలో పాల్గొన్న సగానికి పైగా మంది అభిప్రాయడ్డారు. తల్లిదండ్రులు, ఎదుగుతున్న పిల్లల ఆర్థిక అవసరాలు తీరుస్తున్న 35-54 ఏళ్ల వ్యక్తులపై ఈ అధ్యయనం జరిపినట్లు యూగవ్ వెల్లడించింది. దేశంలోని 12 నగరాలకు చెందిన 4,000 మందిని సర్వే చేసింది. అందులో 60 శాతం మంది ప్రస్తుతం ఆదా చేస్తున్న సొమ్ము భవిష్యత్ అవసరాలను తీర్చలేవేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. మరిన్ని విషయాలు..

- 94% మంది: ఇప్పటికే పూర్తి స్థాయి లేదా ఎంతో కొంత ఆర్థిక ప్రణాళికతో ఉన్నారు
- 50%కి పైగా: ప్రస్తుతం ఆర్జిస్తున్న సొమ్ము సరిపోవడం లేదు. ఆర్థికంగా వెనకబడి ఉన్నాం. ప్రయత్నించినా తగినంత రాణించలేకపోతున్నాం. రుణాలపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. అలాగే, ఆదా చేసుకున్న సొమ్ము, సంపాదన కూడా కరిగిపోయింది
- 64%: అప్పు చేసి స్వల్పకాలిక కోరికలను ఎలా తీర్చుకుంటున్నాం
- 79%: ఆర్థిక పథకాల్లో పెట్టుబడులపై వచ్చే ప్రతిఫలాలతో దీర్ఘకాలిక కోరికలను నెరవేర్చుకోవాలనుకుంటున్న వారు.

ఐటీలో జీతాల పెంపు అంతంతే..

- 4 నుంచి 8.5% మించకపోవచ్చు
- ఫ్రెషర్స్ పరిస్థితి మరింత దారుణం
- వేచి చూసే ధోరణిలో కంపెనీలు
- ప్రత్యేక నైపుణ్యాలకు మాత్రం ఫుల్ డిమాండ్
- టీమ్‌లీజ్ డిజిటల్



న్యూఢిల్లీ: భారత ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగం ఇంకా కష్టాల్లోనే ఉంది. ఈ ప్రభావం ఉద్యోగుల జీతాలపైనా కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో కూడా ఐటీ ఉద్యోగుల జీతాల పెంపు అంతంత మాత్రంగానే ఉంటుందని అంచనా. ఈ పెంపు మహా అయితే సగటున 4 నుంచి 8.5 శాతానికి మించకపోవచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఐటీ ఉద్యోగుల జీతాలు సగటున 8.4 శాతం నుంచి 9 శాతం వరకు పెరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్థిక అనిశ్చితి, సరికొత్త నైపుణ్యాలకు డిమాండ్ పెరగడం, కృత్రిమ మేధ (ఏఐ)కు పెరుగుతున్న ప్రాధాన్యత ఈ ఏడాది ఐటీ ఉద్యోగుల జీతాల పెరుగుదలను దెబ్బతీయనున్నాయి. 'ఈ సంవత్సరం జీతాల పెంపుపై ఐటీ కంపెనీలు ఆచితూచి వ్యవహరించబోతున్నాయి' అని టీమ్‌లీజ్ డిజిటల్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ విజ్ తెలిపారు. ఆర్థిక అనిశ్చితితో పాటు కంపెనీలు ఐటీ ఖర్చులు తగ్గించుకోవడం, మారుతున్న వ్యాపార ప్రాధాన్యతలూ ఇందుకు దోహదం చేస్తున్నట్లు ఆమె చెప్పారు.

మదింపు వాయిదా

సాధారణంగా ఐటీ కంపెనీలు ఏటా మార్చికల్లా ఉద్యోగుల పనితీరు మదింపు పూర్తి చేసి ఏప్రిల్ నుంచి జీతాలు పెంపు అమలు చేస్తాయి. ఈ సంవత్సరం ఇప్పటి వరకు టీసీఎస్ ఒక్కటే ఈ పని పూర్తి చేసింది. తన ఉద్యోగుల జీతాలు సగటున 4 నుంచి 8 శాతం వరకు పెంచింది. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రా వంటి ఐటీ దిగ్గజాలు ఈ సంవత్సరం జీతాలు ఎప్పటి నుంచి పెంచేది ఇంకా ప్రకటించలేదు. దీంతో ఈ కంపెనీల్లో పని చేసే ఉద్యోగులు మా జీతాలు ఎప్పటి నుంచి పెంచుతారు బాస్? అని ఆశతో ఎదురు చూస్తున్నారు. 'ప్రస్తుతానికైతే రెండంకెల్లో జీతాల వృద్ధి గతం. ఈ సంవత్సరం జీతాల పెంపు మహా అయితే 5 నుంచి 8.5 శాతం మించకపోవచ్చు' అని రీడ్ అండ్ విల్లో సీఈఓ జానూ మొత్వాని చెప్పారు.

తగ్గిన వలసలు

పరిస్థితులు బాగోకపోవడంతో ఐటీ ఉద్యోగులు కూడా గతంలోలా అధిక జీతాలకు ఆశపడి పెద్దగా కంపెనీలు (ఉద్యోగాలు) మారడం (అట్రిషన్) లేదు. 2023లో ఐటీ ఉద్యోగుల సగటు అట్రిషన్ రేటు 18.3 శాతం ఉండేది. గత ఏడాది ఇది 17.7 శాతానికి పడిపోయింది. కంపెనీలు జీతాల పెంపు ఆలస్యం చేయడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం. కొన్ని ఐటీ కంపెనీలు మంచి పనితీరుతో కంపెనీనే అంటిపెట్టుకున్న ఉద్యోగులకు ఏటా రిటెన్షన్ బోనస్ పేరుతో ప్రత్యేక బోనస్‌లు చెల్లించేవి. ఈ సంవత్సరం చాలా కంపెనీలు ఈ బోనస్ గురించీ నోరు మెదపడం లేదని ఉద్యోగులు చెబుతున్నారు.

ఒక్కొక్కరికి ఒక్కోలా

ఐటీ ఉద్యోగులందరి జీతాల పెంపు ఈ సంవత్సరం ఒకేలా ఉండదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), క్లౌడ్ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ. డేటా సైన్స్, బ్లాక్‌చెయిన్ వంటి టెక్నాలజీలపై పట్టు, మంచి పనితీరు ఉన్న మిడ్ లెవల్ ఉద్యోగుల జీతాలు 10 నుంచి 12 శాతం, సరికొత్త డొమైన్స్‌లో ప్రత్యేక నైపుణ్యాలు, నాయకత్వ స్థానాల్లో ఉండే సీనియర్ల జీతాలు 12 నుంచి 15 శాతం పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఫ్రెషర్స్ జీతాలు మాత్రం వారి పనితీరు ఆధారంగా రెండు నుంచి నాలుగు శాతం మాత్రమే పెరిగే అవకాశం ఉందని అడెకో ఇండియా అనే ఐటీ నియామక సేవల సంస్థ తెలిపింది.

23,100పైన బుల్లిష్

(ఫిబ్రవరి 24-28 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 23,134-22,720 పాయింట్ల మధ్యన కదలాడి 133 పాయింట్ల నష్టంతో 22,796 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,100 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22,873, 22,917, 23,181, 23,195 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,100
బ్రేక్‌డౌన్ స్థాయి: 22,500
నిరోధ స్థాయిలు: 23,000, 23,100, 23,200 (22,900 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22,600, 22,500, 22,400 (22,700 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

24వ తేదీ



హైదరాబాద్	435	విజయవాడ	475
వరంగల్	437	గోదావరి	460
చిత్తూరు	493	విశాఖపట్నం	460
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	70	విజయవాడ	71
వరంగల్	70	గుంటూరు	71
కరీంనగర్	70	ఒంగోలు	71
మహబూబ్‌నగర్	70	చిత్తూరు	68
కర్నూలు	70	నెల్లూరు	73
విశాఖపట్నం	70	అనంతపురం	73
గోదావరి	71		

కన్సాలిడేషన్‌కు చాన్స్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశం ఉంది. గ్లోబల్ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందే వరకు సూచీలకు ఒక గమనం ఉండకపోవచ్చు. డొనాల్డ్ ట్రంప్ టారిఫ్స్‌పై వరుసగా ప్రకటనలు చేస్తుండటంతో మదుపరులు గందరగోళానికి లోనవుతున్నారు. ఇప్పటికే బెంచ్‌మార్క్ సూచీలు కనిష్ఠాలకు చేరటంతో కన్సాలిడేషన్‌కు అవకాశం లేకపోలేదు. నిఫ్టీకి 22,800 స్థాయిలో బలమైన మద్దతు ఉంది.

స్టాక్ రికమండేషన్స్

వాబగ్ టెక్నాలజీ: డిసెంబరులో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ షేరు 42 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. కీలకమైన రూ.1,200 స్థాయిలో మద్దతు దొరికింది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ పెరుగుతండటం, ట్రెండ్ రివర్సల్‌కు అవకాశం ఉండటం శుభపరిణామం. గత శుక్రవారం రూ.1,434 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,400 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,550/1,600 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,360 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సెయిల్: గత ఏడాది మే నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ కౌంటర్‌లో జనవరి నుంచి బేస్ ఏర్పడుతోంది. ప్రైస్ యాక్షన్ టైట్‌గా కొనసాగుతోంది. డిసెంబరు త్రైమాసిక ఫలితాల అనంతరం మదుపరులు ఆసక్తి చూపిస్తున్నారు. పైగా రిలేటివ్ స్ట్రెంత్ ఎక్కువగా ఉంది. గత శుక్రవారం రూ.112 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.110/107 శ్రేణిలో ఎంటరై రూ.125/130 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.103 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గోద్రెజ్ ఇండస్ట్రీస్: జనవరిలో రూ.1,246 స్థాయిలో నిరోధం ఎదుర్కొన్న ఈ షేరు వరుసగా పతనమవుతూ 34 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. కీలకమైన రూ.780 స్థాయిలో మళ్లీ పుంజుకుంది. భారీ వాల్యూమ్‌తో చివరి రెండు సెషన్లలోనే 40 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం రూ.1,131 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.1,050/1,000 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,250/1,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.960 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ: గత ఏడాది సెప్టెంబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో సాగుతూ వస్తున్న ఈ షేరుకు రూ.420 స్థాయిలో మద్దతు లభించింది. చివరి నాలుగు సెషన్లలో లాభాల్లోనే ముగిసింది. భారీ వాల్యూమ్‌తో 10, 20 రోజుల మూవింగ్ యావరేజీని బ్రేక్ చేసింది. గత శుక్రవారం ఈ షేరు 5.99 శాతం లాభంతో రూ.496 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.470 స్థాయిలో ప్రవేశించి రూ.550/600 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.445 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్: నష్టాల మార్కెట్లోనూ ఈ షేరు జోరు ప్రదర్శిస్తోంది. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా ట్రేడవుతున్నాయి. ప్రాథమికంగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్నప్పటికీ హయ్యర్ లోస్ నమోదవడం ఇన్వెస్టర్లను ఆకర్షిస్తోంది. చివరి త్రైమాసికంలో ఈపీఎస్ విపరీతంగా పెరిగింది. గత శుక్రవారం రూ.4,545 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.4,480/4,450 పొజిషన్ తీసుకుని రూ.4,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,410 స్థాయిని స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

మద్దతు స్థాయిలు 22,600, 22,400

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ కీలక మద్దతు స్థాయి 23,000 వద్ద విఫలమై అంతకన్నా దిగువన 22,800 సమీపంలో ముగిసింది. వరుసగా 14 ట్రేడింగ్ దినాలుగా నిరంతర డౌన్‌ట్రెండ్‌నే కొనసాగిస్తూ 1,000 పాయింట్లకు పైగా నష్టపోయింది. అమెరికన్ మార్కెట్లో శుక్రవారం నాటి ట్రెండ్ కారణంగా ఈ వారంలో మరింత నెగిటివ్‌గా ప్రారంభం కావచ్చు. సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో ప్రధాన మద్దతు స్థాయి 22,400 వద్ద కన్సాలిడేట్ కావాలి. మిడ్ క్యాప్-100 సూచీ 830 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 230 పాయింట్ల మేరకు లాభపడినా అది కేవలం టెక్నికల్ పుల్‌బ్యాక్ రికవరీగానే భావించాలి.

బుల్లిష్ స్థాయిలు: సానుకూలత కోసం నిఫ్టీ మైనర్ నిరోధ స్థాయి 22,800 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం, మానసిక అవధి 23,000.

బేరిష్ స్థాయిలు: ప్రధాన మద్దతు స్థాయి 22,400 మార్కెట్ కన్సాలిడేట్ కావచ్చు. సానుకూలత కోసం మార్కెట్ ఈ మద్దతు స్థాయి కన్నా పైన తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి.

బ్యాంక్ నిఫ్టీ: గత 6 వారాలుగా ఈ సూచీ కన్సాలిడేషన్ ధోరణిలో ఉంది. సానుకూలత కోసం ప్రధాన నిరోధం 49,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 49,600. మద్దతు స్థాయి 48,500 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 47,800.

పాటర్న్: గత వారం మార్కెట్ 22,800 వద్ద ఏర్పడిన "డబుల్ బాటమ్ పాటర్న్" వద్ద బలహీనంగా ముగిసింది. 23,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఉంది. సానుకూలత కోసం ఆ పైన నిలదొక్కుకోవాలి. ఈ వారం మరింత డౌన్‌ట్రెండ్‌లో ప్రవేశించినట్టయితే మార్కెట్ ఓవర్‌సోల్డ్ స్థితిలోకి ప్రవేశిస్తుంది. ఇక్కడ రికవరీ ఏర్పడవచ్చు.

టైమ్: ఈ సూచీ ప్రకారం సోమవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,800, 22,880
మద్దతు	22,660, 22,600

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

పాక్ పనిబట్టారు

కోహ్లీ 51వ వన్డే శతకం

భారత్ సూపర్ విక్టరీ

మనదే పైచేయి

పాకిస్థాన్‌ను చిత్తుచేసిన టీమిండియా ఐసీసీ టోర్నమెంట్లలో ఆ జట్టుపై ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. ఇప్పటిదాకా ఐసీసీ ఈవెంట్లలో (టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్, చాంపియన్స్ ట్రోఫీ) ఇరుజట్లు 22 సార్లు తలపడితే, భారత్ ఏకంగా 18 విజయాలతో పైచేయి సాధించింది. చాంపియన్స్ ట్రోఫీలో మూడుసార్లు (2004, 2009, 2017లో), టీ20 ప్రపంచకప్ (2021)లో ఓసారి భారత్‌పై పాక్ గెలిచింది.


రిజ్వాన్



కోట్లాదిమంది భారతీయులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూసిన మ్యాచ్ ఆశించిన రీతిలోనే ముగిసింది. బలాబలాల విషయంలో సమవుజ్జీ కాకపోయినా అనిశ్చితి ఆటకు మారుపేరు పాకిస్థాన్. అందుకే ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో? అనే సందేహం అందరిలోనూ నెలకొంది. కానీ ఛేజింగ్‌లో రారాజు 'కింగ్' కోహ్లీ ఎక్కడ, ఎవరితో ఆడాలో అక్కడే కదం తొక్కాడు. ప్రత్యర్థి పాక్ అయినప్పుడు విరాటుడి విశ్వరూపం ఎలా ఉంటుందో మరోసారి కళ్లముందుంచాడు. చివరికంటూ నిలిచి అజేయ శతకంతో మురిపించాడు. అతడికి శ్రేయాస్, గిల్ కూడా జత కలవడంతో ఛేదన సులువైంది. అటు వరుసగా రెండో ఓటమితో ఆతిథ్య పాక్ తమ సెమీస్ ఆశలపై ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సిందే. మరోవైపు భారత్ నాకౌట్ బెర్తు దాదాపు ఖరారైనట్టే.



ఆ విరాటుడు సాక్షాత్కరించాడు!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

సమకాలీన క్రికెట్‌లో తిరుగులేని బ్యాటర్ విరాట్ కోహ్లీ. మొత్తం 547 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన అనుభవం అతడి సొంతం. మూడు ఫార్మాట్లలో కలిపి 27వేలకు పైగా పరుగులు. ఎన్నో రికార్డులతో 16 సంవత్సరాలుగా తనదైన ముద్ర. కానీ ఇటీవలి కాలంలో ఫామ్ కోల్పోయిన విరాట్ ఇంటా..బయటా..తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాడు. దశాబ్దంన్నరకు పైగా అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న ఆటగాడు ఇంత సుదీర్ఘకాలం ఫామ్ లేమితో సతమతం కావడమా? ఎప్పటికి బయటపడతాడు ఆ 'తడబ్యాటు' నుంచి? ఎంత కాలం అతడికి ఇంకా జట్టులో చోటు ? అని తీవ్రంగా ప్రశ్నించిన వారూ లేకపోలేదు. అయితే బోర్డర్-గవాస్కర్ సిరీస్ తొలి టెస్ట్‌లో సెంచరీతో విరాట్ ఆట మళ్లీ గాడిలో పడినట్టేనని అతడి అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ తర్వాత నాలుగు టెస్టులలో అతడు నిరాశ పరిచాడు. చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఆఖరి వన్డేలో హాఫ్ సెంచరీతో కోహ్లీ మళ్లీ టచ్‌లోకి వచ్చాడు. ఇక..ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో విరాట్ విఫలమయ్యాడు. దాంతో టోర్నీలో అతి కీలకమైన పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో కోహ్లీ ఎలా ఆడతాడోననే ఆందోళన వ్యక్తమైంది. అయితే చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై మ్యాచ్ అంటే కోహ్లీ రెచ్చిపోతాడు. 2022 టీ20 వరల్డ్ కప్ మెల్‌బోర్న్ మ్యాచ్‌లో తన అద్భుత బ్యాటింగ్‌ను గుర్తు చేస్తూ..చాంపియన్స్ ట్రోఫీ పోరులో విరాట్ చెలరేగాడు. క్రీజులో కుదురుకొనే వరకు బ్యాక్‌ఫుట్ గేమ్ ఆడిన కోహ్లీ ఆపై క్రీజు బయటకు వచ్చి సంధించిన షాట్లు అదరహో అనిపించాయి. హారిస్ రౌఫ్ బౌలింగ్‌లో కవర్స్ దిశగా అతడు కొట్టిన బౌండరీ చూసి తీరాల్సిందే. చాన్నాళ్ల తర్వాత తన ట్రేడ్‌మార్క్ షాట్లతో ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించాడు. ఓర్పు, నేర్పు ఇన్నింగ్స్‌తో టీమిండియా విజయంలో మరోసారి కీలక భూమిక పోషించాడు. అజేయ సెంచరీతో తనలో ఇంకా సత్తా ఉందని నిరూపించాడు. ఇక విరాట్ ఒక్కో షాట్ కొడుతుంటే కెప్టెన్ రోహిత్ శర్మలో కలిగిన ఆనందం అంతా ఇంతాకాదు. అతడి ఒక్కో షాట్‌కు చప్పట్లు చరిచి కోహ్లీలో ఉత్సాహం నింపాడు. చివరగా విరాట్ సెంచరీ మార్క్ చేరగానే రోహిత్ సంతోషం రెండింతలైంది.

శ్రేయాస్ అర్ధసెంచరీ • చాంపియన్స్ ట్రోఫీ

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీకి తలమానికంగా నిలిచిన భారత్-పాకిస్థాన్ మ్యాచ్ ఏకపక్షంగా ముగిసింది. అటు బౌలింగ్.. ఇటు బ్యాటింగ్‌లోనూ అదరగొట్టిన టీమిండియా వరుసగా రెండో విజయం అందుకుంది. ఆదివారం పాక్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ (111 బంతుల్లో 7 ఫోర్లతో 100 నాటౌట్) అజేయ శతకం సాధించగా, మరో 45 బంతులుండగానే భారత్ ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. తద్వారా 2017 సీటీ ఫైనల్లో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నట్టయ్యింది. గ్రూప్ 'ఎ'లో నాలుగు పాయింట్లతో భారత్ దాదాపు సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకోగా, ఆఖరి మ్యాచ్ మార్చి 2న కివీస్‌తో తలపడుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. సౌద్ షకీల్ (62), రిజ్వాన్ (46), ఖుష్‌దిల్ (38) కీలక ఇన్నింగ్స్ ఆడారు. స్పిన్నర్ కుల్దీప్‌నకు మూడు, హార్దిక్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 42.3 ఓవర్లలో 4 వికెట్లకు 244 పరుగులు చేసి గెలిచింది. శ్రేయాస్ (56), గిల్ (46) సహకరించారు. విరాట్ శతకంలో 72 పరుగులు సింగిల్స్, డబుల్స్ రూపంలో రావడం అతడి ఫిట్‌నెస్ స్థాయిని తెలుపుతుంది. షహీన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు.

సమష్టి రాణింపుతో..: ఓ మాదిరి ఛేదనలో భారత్‌ను పాక్ బౌలర్లు పెద్దగా ఇబ్బంది పెట్టలేకపోయారు. దీనికితోడు వారి పేలవ ఫీల్డింగ్ కూడా తోడైంది. అటు విరాట్ సెంచరీ, శ్రేయాస్ హాఫ్ సెంచరీ, గిల్ సమన్వయ ఆటతీరుతో జట్టు సునాయాసంగా నెగ్గింది. ఆరంభంలో పేసర్ షహీన్ సూపర్ యార్కర్లతో కట్టడి చేసే ప్రయత్నం చేశాడు. కానీ రోహిత్ (20) రెండో ఓవర్లో 4,6తో ఎదురుదాడికి దిగాడు. అటు గిల్ మూడో ఓవర్లో రెండు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. దీంతో ఒత్తిడిని తగ్గించారు. చివరకు షహీన్ ఇన్‌స్వింగ్ యార్కర్‌కు రోహిత్ క్లీన్‌బౌల్డ్‌గా వెనుదిరిగాడు. అయితే ఈ సంతోషాన్ని గిల్-విరాట్ వమ్ము చేశారు. షహీన్ వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్లో గిల్ మూడు ఫోర్లతో 14 రన్స్ రాబట్టి అతడి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాడు. పిచ్‌ను అర్థం చేసుకుంటూ ఎక్కువగా సింగిల్స్‌పై దృష్టి సారిస్తూ వీరు స్కోరును ముందుకు నడిపారు. అయితే వరుసగా ఐదో 50+ స్కోరు ఖాయమనిపించిన వేళ గిల్‌ను స్పిన్నర్ అబ్రార్ బౌల్డ్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత విరాట్‌కు జతగా శ్రేయాస్ కలవడంతో పాక్ బౌలర్ల కష్టాలు రెట్టింపయ్యాయి. అటు బంతి కూడా చక్కగా బ్యాట్ మీదకు రావడంతో ఈ జోడీ ఆడుతూ పాడుతూ బ్యాటింగ్ సాగించింది. ఈ క్రమంలో ఇద్దరూ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకోగా, అటు 36వ ఓవర్లోనే స్కోరు 200కి చేరింది. అయితే విజయానికి మరో 28 పరుగుల దూరంలో శ్రేయాస్ కవర్స్‌లో ఇచ్చిన క్యాచ్‌ను ఇమామ్ గాల్లోకి డైవ్ చేస్తూ పట్టేశాడు. తర్వాతి ఓవర్‌లోనే హార్దిక్ (8) కూడా వెనుదిరిగాడు. ఈ దశలో విరాట్ శతకానికి, జట్టు విజయానికి సమాన పరుగులు అవసరపడడంతో అభిమానుల్లో కాస్త ఉత్కంఠ నెలకొంది. కానీ 43వ ఓవర్‌లో ఓ చక్కటి ఫోర్‌తో ఆ రెండింటినీ పూర్తి చేసి అందరినీ సంబరాల్లో ముంచెత్తాడు.

ఆదుకున్న షకీల్-రిజ్వాన్: టాస్ గెలిచిన వెంటనే పాక్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. ఇక్కడి పిచ్ ఛేజింగ్‌కు కష్టమనే భావనలో ఈ నిర్ణయం తీసుకోగా.. భారత బౌలర్లు అంత సులువుగా పరుగులేమీ ఇవ్వలేదు. బంతి బ్యాట్ మీదకు రాకపోవడంతో పాక్ బ్యాటర్లు ఇబ్బందిపడ్డారు. అయితే సౌద్ షకీల్ అర్ధసెంచరీ, కెప్టెన్ రిజ్వాన్ సంయమన ఆటతీరుతో పాటు చివర్లో ఖుష్‌దిల్ వేగంతో జట్టు స్కోరు ఫర్వాలేదనిపించింది. షమి ఏకంగా ఐదు వైడ్లతో ఓవర్‌ను ఆరంభించడం గమనార్హం. ఇక ఓపెనర్ బాబర్ ఆజమ్ (23) క్రీజులో ఉన్నంత సేపు చక్కటి షాట్లతో ఆకట్టుకున్నాడు. ఐదు ఫోర్లతో జోరు మీదున్న అతడి నుంచి భారీ ఇన్నింగ్స్ వస్తుందనిపించినా హార్దిక్‌కు చిక్కాడు. ఆ వెంటనే మరో ఓపెనర్ ఇమామ్ (10)ను అక్షర్ కళ్లుచెదిరే రీతిలో రనౌట్ చేయడంతో పవర్‌ప్లేలో పాక్ రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో జట్టుపై ఒత్తిడి పడనీయకుండా కెప్టెన్ రిజ్వాన్, సౌద్ షకీల్ మాత్రం పట్టుదలగా ఆడారు. మధ్య ఓవర్లలో పిచ్ నెమ్మదించడంతో పరుగులు కష్టమయ్యాయి. ముఖ్యంగా స్పిన్నర్ కుల్దీప్ ఇబ్బందిపెట్టాడు. వికెట్‌ను కాపాడుకునే క్రమంలో రిజ్వాన్-షకీల్ జోడీ కూడా ఎలాంటి దూకుడు ప్రదర్శించలేదు. దీంతో 55 బంతులపాటు కనీసం ఫోర్ కూడా నమోదుకాలేదు. కానీ ఓపికతో ఆడిన ఈ ఇద్దరూ స్కోరును 34వ ఓవర్‌లో 150 దాటించారు. ఇక 24 ఓవర్లపాటు క్రీజులో నిలిచి భారత్‌ను విసిగించిన జోడీకి 34వ ఓవర్‌లో బ్రేక్ పడింది. రిజ్వాన్‌ను అక్షర్ బౌల్డ్ చేయడంతో మూడో వికెట్‌కు 104 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఈ వికెట్‌తో పాక్ బ్యాటింగ్ ఆర్డర్ కూడా చెల్లాచెదురైంది. హాఫ్ సెంచరీతో జోరు మీదున్న షకీల్‌ను తర్వాతి ఓవర్‌లో హార్దిక్ దెబ్బతీశాడు. ఆ తర్వాత కుల్దీప్ ఒకే ఓవర్‌లో రెండు వికెట్లతో పాక్‌ను మరింత ఒత్తిడిలోకి నెట్టాడు. చివర్లో ఖుష్‌దిల్ మాత్రం బంతికో పరుగు చొప్పున సాధించాడు. తమ ఇన్నింగ్స్‌లో తొలి సిక్సర్‌ను 42వ ఓవర్‌లో అతడే సాధించాడు. ఆఖరి ఓవర్‌లో ఖుష్‌దిల్ వికెట్‌ను రాణా తీయడంతో పాక్ ఆట ముగిసింది.


శ్రేయాస్ (56)

6 ఓపెనర్‌గా 9వేల పరుగులు పూర్తి చేసిన ఆరో ఆటగాడిగా రోహిత్ శర్మ (181 ఇన్నింగ్స్) నిలిచాడు.

12 వన్డేల్లో వరుసగా 12సార్లు టాస్ నెగ్గని జట్టుగా భారత్ సరికొత్త రికార్డునెలకొల్పింది. చివరిసారిగా 2023 వరల్డ్‌కప్ సెమీస్‌లో న్యూజిలాండ్‌పై టీమిండియా టాస్ గెలిచింది. 2011-13 మధ్య నెదర్లాండ్స్ వరుసగా 11సార్లు టాస్‌లు ఓడింది.


విరాట్ కోహ్లీ (100 నాటౌట్)

1 వన్డేల్లో అత్యధికంగా 158 క్యాచ్‌లు అందుకొన్న భారత ఆటగాడిగా కోహ్లీ. అజరుద్దీన్ 156 క్యాచ్‌ల రికార్డును విరాట్ అధిగమించాడు. ఓవరాల్‌గా మహేల జయవర్ధనె (218 క్యాచ్‌లు), రికీ పాంటింగ్ (160) కోహ్లీ కంటే ముందున్నారు.

3 వన్డేల్లో వేగంగా 14 వేల పరుగుల మైలురాయిని చేరిన బ్యాటర్‌గా, ఓవరాల్‌గా మూడో ఆటగాడిగా కోహ్లీ (287 ఇన్నింగ్స్) రికార్డులకెక్కాడు. కాగా, 50 ఓవర్ల ఫార్మాట్‌లో సచిన్ టెండూల్కర్ (18,246 పరుగులు) 350 ఇన్నింగ్స్‌లో, శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కర (14,243 పరుగులు) 378 ఇన్నింగ్స్‌లో 14 వేల పరుగులు చేశారు.


బాబర్‌కు పాండ్యా బై..బై



పాక్ బ్యాటర్ బాబర్ ఆజమ్ మరోసారి ఆశించిన స్థాయిలో ఆడడంలో విఫలమయ్యాడు. ఐదు బౌండ్రీలతో భారీ ఇన్నింగ్స్ ఆడేలా కనిపించాడు. అయితే, 8వ ఓవర్‌లో హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో తొలి బంతిని బౌండ్రీగా మలిచిన బాబర్.. ఆ తర్వాతి బంతికి భారీ షాట్ ఆడే క్రమంలో రాహుల్‌కు క్యాచిచ్చాడు. జట్టుకు బ్రేక్ అందించిన పాండ్యా.. బై..బై అన్నట్టుగా చేతితో చూపిస్తూ సంబరాలు చేసుకోవడం వాతావరణాన్ని వేడెక్కించింది. నెట్‌లో ఈ వీడియో వైరల్‌గా మారింది.

6 అంతర్జాతీయ క్రికెట్‌లో 4వేల పరుగులు, 200 వికెట్లు పడగొట్టిన ఆరో భారత క్రికెటర్‌గా హార్దిక్ పాండ్యా. గతంలోనే 4 వేల మార్క్ చేరిన హార్దిక్.. బాబర్, షకీల్‌ను అవుట్ చేసి 200 వికెట్ల క్లబ్‌లో చేరాడు. సచిన్, కపిల్, రవిశాస్త్రి, జడేజా, అశ్విన్‌లు పాండ్యా కంటే ముందున్నారు.

స్టాండ్స్‌లో హార్దిక్ గాళ్‌ఫ్రెండ్?



హార్దిక్ పాండ్యా గాళ్‌ఫ్రెండ్‌గా సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్న జాస్మిన్ వాలియా స్టాండ్స్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచింది. అక్షర్ పటేల్ భార్య పక్కన కూర్చొని జాస్మిన్ మ్యాచ్‌ను వీక్షించడం.. ఊహాగానాలకు బలం చేకూర్చుతోంది. ఇక, హార్దిక్ ధరించిన వాచ్ కూడా అభిమానులను ఎంతో ఆకర్షించింది. దీంతో దాని గురించి నెట్‌లో తెగవెతికేసిన ఫ్యాన్స్.. దానిని రిచర్డ్ మిల్లే కంపెనీకి చెందిన లగ్జరీ వాచ్‌గా తేల్చారు. దీని ధర రూ. 15 కోట్లు ఉంటుందని చెబుతున్నారు.

షమి.. చెత్త రికార్డు



షమి ఓ చెత్త రికార్డును మూటగట్టుకొన్నాడు. చాంపియన్స్ ట్రోఫీలో సుదీర్ఘమైన ఓవర్ వేసిన మూడో బౌలర్‌గా నిలిచాడు. తొలి ఓవర్ బౌల్ చేసిన షమి.. మొత్తం 11 బంతులు వేయాల్సి వచ్చింది. ఐదు వైడ్లు వేసి ఆరు పరుగులిచ్చాడు. కాగా, 2000లో బంగ్లా బౌలర్ హసిబుల్ హసన్, 2004 టోర్నీలో జింబాబ్వే ఆటగాడు టినాషి పన్యాంగర ఓ ఓవర్‌లో 13 బంతులు వేసి చెత్త రికార్డును మూటగట్టుకొన్నారు. సుదీర్ఘ ఓవర్ వేసిన తొలి భారత బౌలర్‌గా షమి నిలిచాడు. 2017 ఫైనల్లో బుమ్రా 9 బంతుల పేలవ రికార్డును షమి మరుగునపడేలా చేశాడు. కాగా, షమికి గాయం తిరగబెట్టిందా? అనే అనుమానం కలుగుతోంది. 5వ ఓవర్ బౌల్ చేస్తున్నప్పుడు అతడి కుడి కాలి చీలమండలో సమస్య తలెత్తింది. ఫిజియో వచ్చి ట్రీట్‌మెంట్ ఇచ్చిన తర్వాత.. ఆ ఓవర్ పూర్తి చేసి మైదానం వీడాడు. అయితే, మళ్లీ 12వ ఓవర్‌లో షమి బౌలింగ్‌కు దిగాడు. కానీ, కీలక మ్యాచ్‌లో మాత్రం అతడి రనప్ ఇబ్బందిగానే కనిపించింది.

కుల్దీప్@300



అన్ని ఫార్మాట్లలో కలిపి 300 వికెట్ల మైలురాయిని చేరిన ఐదో భారత స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన 13వ భారత బౌలర్. సల్మాన్ అఘాను అవుట్ చేయడం ద్వారా కుల్దీప్ ఈ ఫీట్ సాధించాడు.

స్కోరుబోర్డు

పాకిస్థాన్: ఇమామ్ ఉల్ హక్ (రనౌట్) 10; బాబర్ (సి) రాహుల్ (బి) హార్దిక్ 23; సౌద్ షకీల్ (సి) అక్షర్ (బి) హార్దిక్ 62; రిజ్వాన్ (బి) అక్షర్ 46; సల్మాన్ అఘా (సి) జడేజా (బి) కుల్దీప్ 19; తయ్యాబ్ (బి) జడేజా 4; ఖుష్‌దిల్ (సి) విరాట్ (బి) హర్షిత్ 38; షహీన్ (ఎల్బీ) కుల్దీప్ 0; నసీమ్ (సి) విరాట్ (బి) కుల్దీప్ 14; రౌఫ్ (రనౌట్) 8; అబ్రార్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 17; మొత్తం: 49.4 ఓవర్లలో 241 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-41, 2-47, 3-151, 4-159, 5-165, 6-200, 7-200, 8-222, 9-241, 10-241. **బౌలింగ్:** షమి 8-0-43-0; హర్షిత్ 7.4-0-30-1; హార్దిక్ 8-0-31-2; అక్షర్ 10-0-49-1; కుల్దీప్ 9-0-40-3; జడేజా 7-0-40-1.

భారత్: రోహిత్ (బి) షహీన్ 20; గిల్ (బి) అబ్రార్ 46; విరాట్ (నాటౌట్) 100; శ్రేయాస్ (సి) ఇమామ్ (బి) ఖుష్‌దిల్ 56; హార్దిక్ (సి) రిజ్వాన్ (బి) షహీన్ 8; అక్షర్ (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 42.3 ఓవర్లలో 244/4. వికెట్ల పతనం:** 1-31, 2-100, 3-214, 4-223. **బౌలింగ్:** షహీన్ 8-0-74-2; నసీమ్ 8-0-37-0; రౌఫ్ 7-0-52-0; అబ్రార్ 10-0-28-1; ఖుష్‌దిల్ 7.3-0-43-1; సల్మాన్ 2-0-10-0.


ఇమాముల్ రనౌట్

కుటుంబమంతా ఇంతేనా?

ఓపెనర్ ఇమామ్ ఉల్ హక్ రనౌట్ మరోసారి అతడి మామ ఇంజమాముల్ హక్‌ను గుర్తు చేసింది. 26 బంతులాడి క్రీజులో నిలదొక్కుకొనే ప్రయత్నం చేస్తున్న ఇమాముల్.. కుల్దీప్ బౌలింగ్‌లో సింగిల్ దొంగిలించే ప్రయత్నం చేశాడు. అయితే, మెరుపు వేగంతో బంతిని అందుకొన్న అక్షర్ డైరెక్ట్ త్రోతో రనౌట్ చేశాడు. హక్ డైవ్‌చేసినా.. క్రీజులోకి చేరుకోలేక పోయాడు. దీంతో కామెంటేటర్ రవిశాస్త్రి.. పాత విషయాలను గుర్తు చేసే విధంగా సరదాగా స్పందించాడు. 'ఇది కుటుంబంలోనే ఉందా?' అని పక్కనున్న అక్రమ్‌ను అడిగాడు. దీంతో అక్రమ్ చిరునవ్వు నవ్వి ఊరుకొన్నాడు. 90వ దశకంలో ఇంజమామ్ డేంజరస్ హిట్టర్ అయినా.. వికెట్ల మధ్య పరుగెత్తడం మాత్రం ఘోరంగా ఉండేది. తన కెరీర్‌లో 40సార్లు అతడు రనౌట్ అయ్యాడు. ఇప్పుడు ఇమామ్ కూడా అతడి అడుగుజాడల్లోనే నడుస్తున్నాడా? అనే విధంగా మీమ్స్ నెట్‌లో కనిపిస్తున్నాయి.

అఫ్రీది స్వార్థం..

అవుటైనట్టు స్పష్టంగా తెలుస్తున్నా.. కీలక రివ్యూను వ్యర్థం చేశాడని షహీన్ షా అఫ్రీదిపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 43వ ఓవర్‌లో కుల్దీప్ బౌలింగ్‌లో అఫ్రీది వికెట్ల ముందు దొరికిపోయాడు. భారత ఆటగాళ్లు అప్పీలు చేయడంతో.. అంపైర్ మరో ఆలోచన లేకుండా అవుటిచ్చాడు. అయినా, అఫ్రీది ఏ మాత్రం ఆలోచించకుండా రక్కున రివ్యూకు వెళ్లాడు.

ట్రాఫిక్ జామ్‌లో భారత్..

ట్రాఫిక్ ఇబ్బందుల కారణంగా టాస్‌కు కేవలం 35 నిమిషాల ముందు టీమిండియా స్టేడియానికి చేరుకొందట. భారత్, పాక్ జట్లు బస్సుల్లో వేదికకు బయల్దేరిన సమయంలో భారీ జన సందోహం కారణంగా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. పాక్ బస్సు ఎలాగోలా ముందుగానే వేదిక వద్దకు చేరుకొన్నా.. రోహిత్ సేన మాత్రం ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని ఛేదించుకొని వచ్చే సరికి బాగా ఆలస్యమైంది.



ధోనీ టీవీలో..



హైవోల్టేజ్ మ్యాచ్‌ను ధోనీ లైవ్‌లో వీక్షించాడు. యాడ్ షూటింగ్‌లో ఉన్న మహీ ఇందుకోసం బ్రేక్ తీసుకొన్నాడు. బాలీవుడ్ నటుడు సన్నీ దెవోల్ కూడా ధోనీ పక్కనే ఉన్నాడు. కాగా, చిరంజీవి, క్రికెటర్లు తిలక్ వర్మ, అభిషేక్ శర్మ స్టాండ్స్‌లో కనిపించి సందడి చేశాడు.

బుమ్రాకు ఐసీసీ అవార్డుల ప్రదానం



దుబాయ్: భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా గత ఏడాదికి ఐసీసీ ప్రకటించిన అవార్డులను అందుకున్నాడు. భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య ఆదివారం జరిగిన చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్ ప్రారంభానికి ముందు ఐసీసీ ఈ అవార్డులను అతడికి ప్రదానం చేసింది. 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్', 'టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారాలకు బుమ్రా ఎంపికైన సంగతి తెలిసిందే. వెన్ను గాయానికి లోనైన బుమ్రా చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. అయితే ఈ అవార్డులను స్వీకరించేందుకు బుమ్రా ఇక్కడకు విచ్చేశాడు. ఆ రెండు పురస్కారాలతోపాటు 2024.. టెస్ట్, టీ20 జట్లకు ఎంపికైన బుమ్రా మొత్తం నాలుగింటిని అందుకున్నాడు.

టాప్-10లో ఆంద్రీవా

దుబాయ్ టైటిల్ కైవసం



దుబాయ్: రష్యా యువ సంచలనం మిర్రా ఆంద్రీవా తన కెరీర్‌లో అతి పెద్ద టైటిల్ దుబాయ్ చాంపియన్‌షిప్స్‌ను సొంతం చేసుకుంది. ఈ టోర్నీలో హేమాహేమీ క్రీడాకారిణులను ఓడించిన ఆంద్రీవా తాజా ర్యాంకింగ్స్‌లో టాప్-10లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన ఫైనల్స్‌లో ఆంద్రీవా 7-6, 6-1తో క్లారా టౌసన్ (డెన్మార్క్)పై సునాయాసంగా గెలిచింది. 2007 తర్వాత 17 ఏళ్ల పిన్న వయసు క్రీడాకారిణి టాప్-10లోకి రావడం ఇదే తొలిసారి.

రెండో టీ20లో జింబాబ్వే గెలుపు

హరారే: ఐర్లాండ్‌తో రెండో టీ20లో జింబాబ్వే మూడు వికెట్లతో నెగ్గింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మొదట ఐర్లాండ్ 20 ఓవర్లలో 137/8 స్కోరు చేసింది. టకెర్ (46), టెక్టర్ (28), క్యాంఫెర్ (26) రాణించారు. ట్రెవర్ మూడు, సికిందర్ రజా, రిచర్డ్ ఎన్‌గవారా రెండేసి వికెట్లు పడగొట్టారు. ఛేదనలో జింబాబ్వే 19.2 ఓవర్లలో 141/7 స్కోరు చేసి నెగ్గింది. టోనీ (43), ర్యాన్ (27), సికిందర్ రజా (22) సత్తా చాటారు. యంగ్ నాలుగు వికెట్లు తీశాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య జట్టు 1-0తో ఆధిక్యంలో నిలిచింది. వర్షంతో తొలి టీ20లో ఫలితం తేలలేదు.

60 కోట్లు దాటిన వ్యూయర్‌షిప్

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో ఆదివారం జరిగిన ఇండో-పాక్ మ్యాచ్ వ్యూయర్‌షిప్‌లో సరికొత్త రికార్డు సృష్టించింది. కొత్తగా ఏర్పడిన జియో హాట్‌స్టార్‌లో వీక్షకుల సంఖ్య భారీగా 60.2 కోట్లుగా నమోదైంది. తొలి ఓవర్ షమి బౌల్ చేస్తున్నప్పుడు 6.8 కోట్లుగా ఉన్న వ్యూయర్‌షిప్.. క్రమంగా 32 కోట్లకు చేరుకొంది. భారత్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు 33.8 కోట్ల నుంచి 36.2 కోట్లతో నిలకడగా సాగింది. ఇక, విరాట్ ఫైనల్ షాట్ కొట్టేటప్పుడు 60 కోట్లు దాటింది.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
బెంగళూరు X యూపీ
రాత్రి 7.30 నుంచి

సెమీస్‌పై కివీస్ కన్ను | చాంపియన్ ట్రోఫీ

బంగ్లాతో మ్యాచ్ నేడు • మ.2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



రావల్పిండి: తొలి మ్యాచ్‌లో ఆతిథ్య పాకిస్థాన్‌ను చిత్తు చేసిన న్యూజిలాండ్ ఆత్మవిశ్వాసంతో ఉరకలేస్తోంది. ఈనేపథ్యంలో గ్రూప్-ఎలో సోమవారం జరిగే పోరులో బంగ్లాదేశ్‌తో తలపడుతోంది. ఈ మ్యాచ్‌లోనూ నెగ్గి సెమీఫైనల్ స్థానం దాదాపు ఖాయం చేసుకోవాలని కివీస్ పట్టుదలతో ఉంది. ముక్కోణపు టోర్నీ మ్యాచ్‌లో గాయపడిన రచిన్ రవీంద్ర కోలుకోవడంతో బంగ్లాతో పోరులో తుది జట్టు ఎంపిక న్యూజిలాండ్‌కు తలనొప్పిగా మారింది. వాస్తవంగా రచిన్ స్థానంలో జట్టులోకి వచ్చిన యంగ్‌ను పక్కకు తప్పించాల్సి ఉంది. కానీ పాక్‌తో మ్యాచ్‌లో ఓపెనర్ యంగ్ సెంచరీతో సత్తా చాటాడు. పైగా స్పిన్నర్లను యంగ్ సమర్థంగా ఎదుర్కొన్నాడు. ఒకవేళ రచిన్ కోసం అతడిని తప్పిస్తే..కుడి, ఎడమ కాంబినేషన్ దెబ్బతినే అవకాశం ఉంది. మరి న్యూజిలాండ్ యాజమాన్యం ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరం. మరోవైపు తొలి మ్యాచ్‌లో ఆరు వికెట్లతో భారత జట్టు చేతిలో ఓడిన బంగ్లాదేశ్‌కు న్యూజిలాండ్‌తో పోరు చావోరేవోనే. ఈ మ్యాచ్‌లో నెగ్గి నాకౌట్ అవకాశాలు సజీవంగా ఉంచుకోవాలంటే..బంగ్లా టాపార్డర్ బ్యాటర్లు శక్తికి మించి రాణించాల్సి ఉంటుంది. కాగా..గత చాంపియన్స్ ట్రోఫీలో కివీస్‌ను ఓడించిన బంగ్లాదేశ్ ఆ జట్టును టోర్నీ నుంచి నాకౌట్ చేసింది. ఆ ఒక్కటే సోమవారంనాటి మ్యాచ్‌కు బంగ్లాదేశ్‌కు స్ఫూర్తినిచ్చే అంశం.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

» ఆరు జిల్లాల న్యాయవాదుల సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ

మహారాణిపేట (విశాఖపట్నం), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని, అప్పటి వరకు దశలవారీగా ఆందోళనలు చేయాలని ఉత్తర కోస్తాలోని ఆరు జిల్లాల న్యాయవాదులు ఏకగ్రీవంగా తీర్మానించారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం విశాఖ బార్ అసోసియేషన్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన విశాఖ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జెవర సత్యనారాయణ మాట్లాడుతూ, విశాఖలో ప్రిన్సిపల్ హైకోర్టు, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న అడ్వొకేట్ అమెండ్‌మెంట్ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న కార్యాచరణలో ప్రజలను కూడా భాగస్వాములను చేస్తామన్నారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు 1993 నుంచి ఉద్యమాలు జరుగుతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఇకపై పట్టువీడకుండా ఉద్యమించాలని తీర్మానిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా స్టీరింగ్ కమిటీని ఏర్పాటుచేసి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ముఖ్యమంత్రి, గవర్నర్‌కు నివేదిస్తామన్నారు. వివిధ కేసుల కోసం ఉత్తరకోస్తా ప్రజలు 350-700 కిలోమీటర్లు ప్రయాణించి హైకోర్టుకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నిరకాలుగా అనువైన ప్రదేశం అయిన విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలన్నారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు మాట్లాడుతూ విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు.

జనం ఛీత్కరించినా మారని జగన్ తీరు

» మేం గూండాలం కాదు, చిన్నాన్నను చంపలేదు: మంత్రి డోలా



ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని జనం ఛీత్కరించినా ఆయన తీరు ఏమాత్రం మారలేదని మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి విమర్శించారు. ఆదివారం ఒంగోలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో గుంటూరు మిర్చి యార్డ్‌కు వెళ్లిన జగన్.. పక్కనే ఉన్న రైతులు ఏం మాట్లాడారో తెలియకుండా కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు. జగన్ యార్డుకు వెళ్లకముందే సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించి, మిర్చి రైతులకు గిట్టుబాటు ధరల కల్పన విషయమై కేంద్ర ప్రభుత్వానికి లేఖ కూడా రాశారని, దీనిపై కేంద్రం స్పందించి రైతులను ఆదుకుంటామని హామీ కూడా ఇచ్చిందని తెలిపారు. అసెంబ్లీకి రావడానికి భయపడటం లేదని జగన్ చేసిన వ్యాఖ్యలపై మీడియా అడిగిన ప్రశ్నకు మంత్రి స్వామి ఘాటుగా స్పందించారు. మేము రౌడీలం, గూండాలం కాదని.. చిన్నాన్నను చంపలేదని.. మమ్మల్ని చూసి ఆయన భయపడాలని మేము కోరుకోవడం లేదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

వారం రోజులు సామాజిక సేవ చేయండి!

» నిందితులకు లోక్ అదాలత్ వినూత్న శిక్ష



రోడ్డు ప్రమాదాల నివారణపై ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న నిందితులు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా బనగానపల్లెలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో న్యాయాధికారి ఓ కేసు నిందితులకు విన్నూత శిక్ష విధించారు. వారం రోజుల పాటు సామాజిక సేవ చేయాలని ఆదేశించారు. వివరాల ప్రకారం.. కొలిమిగుండ్ల మండలానికి చెందిన ఇరువర్గాల యువకులు ఐదుగురు ఈనెల 22న స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో ఘర్షణ పడ్డారు. దీంతో పోలీసులు వారిపై అదే రోజు కేసు నమోదు చేసి, బనగానపల్లె లోక్ అదాలత్‌లో హాజరుపరిచారు. పోలీసుల పర్యవేక్షణలో వారం రోజుల పాటు సామాజిక సేవ చేయాలని నిందితులను ఆదేశిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చారు. దీంతో ఆదివారం ఆ యువకులు సామాజిక సేవలో పాల్గొన్నారు. కొలిమిగుండ్ల పోలీసుస్టేషన్‌కు ఎదురుగా ప్లకార్డులపై ప్రదర్శిస్తూ ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన కల్పించారు.



మార్క్సిస్టు ఆలోచనాపరుల వేదిక సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

కమ్యూనిస్టుల పునరేకీకరణ ఎంతో అవసరం

» మార్క్సిస్టు ఆలోచనాపరుల వేదికలో వక్తల ఉద్ఘాటన

» బెజవాడలో కమ్యూనిస్టు ఉద్యమ వందేళ్ల సదస్సు

» సీపీఐ, సీపీఎం, 17 ఎంఎల్ పార్టీల రాష్ట్ర నేతలు హాజరు

గవర్నర్‌పేట(విజయవాడ), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): దేశంలో కమ్యూనిస్టుల పునరేకీకరణ ఎంతో అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. కార్మిక, రైతాంగ పోరాటాలతోపాటు విశాఖ ఉక్కు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా వంటి అనేక సమస్యల మీద 9 వామపక్ష పార్టీలు ఐక్యంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమం 100 సంవత్సరాల సందర్భాన్ని పురస్కరించుకుని మార్క్సిస్టు ఆలోచనాపరుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ లైబ్రరీ హాలులో 'కమ్యూనిస్టు ఉద్యమ పురోగమనం ఆవశ్యకత, అవకాశాలు, అవరోధాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సీపీఐ, సీపీఎంలతోపాటు 17 ఎంఎల్ పార్టీల రాష్ట్ర నాయకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. వేదిక కన్వీనర్ చిగురుపాటి భాస్కరరావు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలకు ఎంతో పోరాట చరిత్ర ఉందన్నారు. 1964లో నాటి పరిస్థితుల కారణంగా చీలికకు కొన్ని కారణాలు ఉండవచ్చని, వర్తమానంలో కమ్యూనిస్టు ఉద్యమ ఆవశ్యకతను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. విశాల దృక్పథంలో అన్ని కమ్యూనిస్టు వేదికలు దీన్ని గుర్తించాలన్నారు. మార్క్స్, లెనిన్, మావో, అంబేద్కర్ ఆలోచనా విధానాలతో ముందుకు సాగాలని కమ్యూనిస్టు నేతలను కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వివిధ సీపీఐ(ఎంఎల్) పార్టీల నాయకులు కేజీ రామచందర్, స్ట్రగుల్ కమిటీ తరఫున నరసింహాస్వామి, పి.ప్రసాద్, ఎంపీ రామ్‌దేవ్, ఎం.హరిప్రసాద్, పి.కోటేశ్వరరావు, విరసం కార్యదర్శి పినాకపాణి, ఎం.సీపీఐ(యూ) నాయకులు కె.నాగభూషణం, వెంకటరెడ్డి, అమర్‌నాథ్ తదితరులు ప్రసంగించారు. న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్, జి.శ్రీనివాసరావు, బండ్ల శ్రీనివాస్, మోతుకూరి అరుణ్‌కుమార్, డానీ, సైకం రాజశేఖర్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సులభంగా మెయిన్స్



విజయవాడలోని ఓ కళాశాల వద్ద పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న గ్రూప్ 2 అభ్యర్థులు



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న గ్రూప్ 2 అభ్యర్థులను తనికీ చేస్తున్న భద్రతా సిబ్బంది

(మొదటి పేజీ తరువాయి)

సాంస్కృతిక చరిత్ర, భారత రాజ్యాంగంపై ఉదయం జరిగిన పేపర్-1 సులభంగానే ఉందని అభ్యర్థులు పేర్కొంటున్నారు. చరిత్రలో చాలా సులభమైన ప్రశ్నలు ఇచ్చారని తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన జరిగిన ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ పేపర్-2 కూడా పెద్ద కష్టంగా లేదని అభ్యర్థులు వెల్లడించారు. పేపర్లు సులభంగా రావడంతో కటాఫ్ మార్కులు భారీగా పెరిగే అవకాశం ఉంది. అయితే ప్రశ్నలు సులభంగా ఇవ్వడంపై కొందరు అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి కష్టపడి చదివి, గ్రూప్-2కు సన్నద్ధమయ్యామని, పేపరు చూస్తే కొద్దికాలం నుంచి చదివినవారు కూడా ఎక్కువ ప్రశ్నలకు సరైన సమాధానాలు రాసే స్థాయిలో ఉందని వాపోతున్నారు. ఇదే గ్రూప్-2 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రం అత్యంత కఠినంగా వచ్చింది. అందువల్లే ఎక్కువ మందికి అవకాశం కల్పించడం కోసం కూటమి ప్రభుత్వం మెయిన్స్‌కు 1:50కి బదులుగా 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసింది. ప్రిలిమ్స్ కఠినంగా రావడంతో మెయిన్స్ ఇంకా కష్టంగా ఉంటుందని అభ్యర్థులు అంచనా వేశారు. కానీ అందరినీ ఆశ్చర్యపరుస్తూ సులభమైన ప్రశ్నలతో ప్రశ్నపత్రం రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ సామాజిక, సాంస్కృతిక చరిత్రలో భాగంగా 'వీరతెలంగాణ అనుభవాలు, జ్ఞాపకాలు' రచయిత ఎవరునే తెలంగాణకు సంబంధించిన ప్రశ్న అడగడం అభ్యర్థులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఎకానమీ పేపరులో ఏపీ కంటే భారత ఎకానమీపైనే ఎక్కువ ప్రశ్నలు అడిగారు. విభజన చట్టంలోని సంస్థలు ఎక్కడున్నాయి? కేంద్ర ప్రభుత్వ పథకాలు, జల్‌జీవన్ మిషన్‌పై ప్రశ్నలు వచ్చాయి. సైన్స్ అండ్ టెక్నాలజీలోనూ ప్రశ్నలు కఠినంగా లేవు. రెండు పేపర్లలోనూ గతంలో అడిగిన పలు ప్రశ్నలు ఇప్పుడూ కనిపించాయి. మెయిన్స్‌కు మొత్తం 92,250 మంది ఎంపిక కాగా, వారిలో 86,459 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. పేపర్-1కు 79,599 మంది, పేపర్-2కు 79,451 మంది హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో 175 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. కాగా, గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష రెండు పేపర్లకు సంబంధించి ఏపీపీఎస్సీ ప్రాథమిక 'కీ'ని విడుదల చేసింది. కమిషన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 25 నుంచి 27 వరకూ అభ్యంతరాలను తెలపడానికి గడువు ఇచ్చింది. అనంతరం తప్పులను సరిచేసి తుది 'కీ' విడుదల చేయనుంది.

పెళ్లి పీటలపై నుంచి పరీక్షకు!



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పెళ్లి పీటల మీద నుంచి నేరుగా గ్రూప్-2 పరీక్షకు ఓ నవవధువు హాజరయ్యారు. తిరుపతికి చెందిన మమతకు ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో చిత్తూరులో వివాహం జరిగింది. ఆమె తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల పరీక్షా కేంద్రంలో మెయిన్స్ రాయాల్సి ఉంది. దీంతో ఉదయం 10గంటల సమయంలో పెళ్లి దుస్తులతోనే పరీక్షా కేంద్రం వద్దకు చేరుకున్నారు. ప్రవేశద్వారం ఉన్న భద్రతా సిబ్బంది ఆమెను ఆపి, తలపై జీలకర్ర, బెల్లం, తమలపాకు తీసేసి లోపలకు వెళ్లాలని సూచించారు. దీనికి ఆమె నిరాకరించడంతో విషయాన్ని పరీక్ష కేంద్రం ఇన్‌చార్జి, ప్రిన్సిపల్ నారాయణమ్మ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె బయటకు వచ్చి నవవధువుతో మాట్లాడారు. అనంతరం ఏపీపీఎస్సీ అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వారి సూచన మేరకు తలపై తమలపాకును తీసి జీలకర్ర, బెల్లాన్ని పరిశీలించిన అనంతరం పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు.

గ్రూప్-1 హాల్‌టికెట్‌తో..

అనంతపురం టౌన్, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు ఓ అభ్యర్థి గ్రూప్-1 హాల్‌టికెట్‌తో వచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా ఆమడగూరు మండలానికి చెందిన ఆంజనేయులు పరీక్ష రాయడానికి అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కేంద్రానికి వచ్చారు. పరీక్ష కేంద్రంలో తన హాల్ టికెట్ నంబరు కనిపించలేదు. అక్కడున్న అధికారులు అతని హాల్‌టికెట్‌ను పరిశీలించి, అది గ్రూప్-1 పరీక్షదిగా గుర్తించారు. అప్పటికి 12 నిమిషాల సమయం మాత్రమే ఉంది. అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ జాఫర్ విషయం తెలుసుకుని, అభ్యర్థిని సమీపంలో ఉన్న ఎస్పీ బంగ్లాకు తీసుకెళ్లారు. అక్కడ ఆన్‌లైన్‌లో గ్రూప్-2 హాల్‌టికెట్ తీయించి, పరుగున పరీక్షా కేంద్రంలోకి పంపించారు.

విజయవాడ నుంచి వచ్చినా నిరాశే

అనంతపురానికి చెందిన గణేశ్ గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలని శనివారం విజయవాడలో చేపట్టిన ఆందోళనలో పాల్గొన్నారు. పరీక్షలు నిర్వహిస్తారని తెలిపోవడంతో విజయవాడ నుంచి వాహనం అద్దెకు తీసుకుని, పరీక్ష రాయడానికి శారదానగర్‌లోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రం వద్దకు చేరుకున్నారు. అప్పటికే 9.50గంటలు అయిందని అధికారులు కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో గణేశ్ నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. కాగా, విశాఖపట్నం నగరం కొమ్మాదిలోని ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు హాజరైన అభ్యర్థి పి.గంగరాజు అస్వస్థతకు గురికాగా, వెంటనే సమీపంలోని గాయత్రి వైద్య కళాశాలకు తరలించి చికిత్స అందించారు.

చరిత్ర సృష్టించిన జెన్కో

» రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

» 241.523 మిలియన్ యూనిట్ల ఉత్పాదన

» వీటీపీఎస్‌లో 52.73 మి.యూనిట్లు

» ఇది సువర్ణాధ్యాయం: ఎండీ చక్రధరబాబు

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యుదుత్పత్తిలో ఏపీజెన్కో ఆదివారం చరిత్ర సృష్టించింది. రికార్డు స్థాయిలో 241.523 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసింది. దీనికితోడు .. విజయవాడ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్కేంద్రం(వీటీపీఎస్) స్థాపించిన నాటి నుంచి ఇప్పటిదాకా సాధించని విధంగా 52.73 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని ఆదివారం సాధించింది. మునుపెన్నడూ లేనంతగా ఉత్పాదన జరగడంపై రాష్ట్ర ఇంధన శాఖ హర్షం వ్యక్తం చేస్తోంది. ఏపీజెన్కో చరిత్రలో ఆదివారం సువర్ణాధ్యాయమని సంస్థ ఎండీ కేవీఎస్ చక్రధరబాబు తెలిపారు. థర్మల్ కేంద్రాల్లో 123.055 ఎంయూ, హైడల్ 9.411 ఎంయూ, సోలార్ 1.957 ఎంయూ, సెంట్రల్ జనరేషన్ స్టేషన్ 32.282 ఎంయూ, అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ (సెం ట్రల్ పూల్), 29.359 ఎంయూ, విండ్ 6.817 ఎంయూ, ప్రైవేటు సోలార్ 22.032 ఎంయు, జెన్‌కో పరిధిలోని ఉత్పత్తి సంస్థలు 3.763 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశాయి. దరిమిలా రాష్ట్రంలో ఆదివారం విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు కేవలం 7.967 మిలియన్ యూనిట్లనే బహిరంగ మార్కెట్లో జెన్కో సేకరించింది. అటు వీటీపీఎస్ నాలుగో యూనిట్‌ను ప్రారంభించాక 100 రోజుల పాటు నిర్విరామంగా పనిచేస్తూనే ఉండడం గమనార్హం.

జగన్ మూసేయాలని చూస్తే..!

బొగ్గు కొరతను సాకుగా చూపిస్తూ బ్యాకింగ్‌డౌన్ పేరిట రాష్ట్ర థర్మల్ విద్యుత్కేంద్రాలను నాటి సీఎం జగన్ మూసేయాలని చెబితే.. 2024లో చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం గరిష్ఠ స్థాయిలో విద్యుదుత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకుంది. దానికి అనుగుణంగానే ఆదివారం రికార్డు స్థాయిలో ఉత్పత్తి సాధించిందని నిపుణులు చెబుతున్నారు. ఇదే తరహాలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తే.. ఈ వేసవిలో కరెంటు డిమాండ్‌ను అవలీలగా దాటేయొచ్చని అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో వేసవి డిమాండ్‌ను తట్టుకునేలా ఉత్పత్తి సాధించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని జెన్కో ఎండీ చక్రధరబాబు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు

» ఏపీటీఎఫ్ అమరావతి, ఆప్టా తీర్మానం

పట్టభద్రుల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతిస్తున్నట్లు ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖరంలకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. అలాగే, గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతు ఇస్తున్నట్లు ఏపీ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం(ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కాకి ప్రకాష్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర శాఖ తీర్మానం చేసిందన్నారు.

గేటా.. గేట్లా?!

తుంగభద్ర ప్రాజెక్టుకు గేట్లు అమర్చే విషయంలో కాలయాపన కొనసాగుతోంది. గత ఏడాది ఆగస్టులో 19వ నెంబరు గేటు కొట్టుకుపోయింది. ఈ నేపథ్యంలో 'స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్'ను ఏర్పాటు చేశారు. కానీ, డ్యాంను పరిశీలించిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ మొత్తం 33 గేట్లు మార్చాలని సూచించింది. అయితే.. ఈ వ్యవహారంపై తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మరో నాలుగు మాసాల్లో వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో గేట్లు మార్చాలని లేకపోతే 19వ గేటైనా ఏర్పాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

తుంగభద్ర డ్యాం గేట్లపై తేల్చని ప్రాజెక్టు బోర్డు.. 19వ గేటు కొట్టుకుపోయి ఆరు మాసాలకు పైగా పూర్తి



తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో వృథాగా పోతున్న నీరు(ఫైల్)

» మొత్తం 33 గేట్లు మార్చాలని నిపుణుల కమిటీ సూచనలు

» నెలలు గడిచినా చర్యలు శూన్యం

» 4 మాసాల్లో వర్షాలు ప్రారంభం

» 19వ గేటైనా ఏర్పాటు చేయాలని సూచిస్తున్న జలవనరుల నిపుణులు

» లేకుంటే మొత్తానికే ముప్పని హెచ్చరిక

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

తుంగభద్ర ప్రాజెక్టు కర్ణాటక, తెలుగు రాష్ట్రాల జీవనాడి. కరువుతో తల్లడిల్లే రాయలసీమకు ప్రాణాధారం. గత ఏడాది ఆగస్టులో వచ్చిన వరదలకు 19వ నెంబరు క్రస్ట్‌గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. సాగునీటి ప్రాజెక్టుల గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు ఆధ్వర్యంలో పది రోజులకు పైగా శ్రమించి 'స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్' ఏర్పాటు చేశారు. తరువాత డ్యాంను పరిశీలించిన కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) "డ్యాం గేట్లు జీవిత కాలం తీరిపోయింది. మరమ్మతులతో కాలయాపన చేయడం సరికాదు. అత్యాధునిక డిజైన్‌తో 33 గేట్లు కొత్తగా ఏర్పాటు చేయడమే ఉత్తమం" అని నివేదిక ఇచ్చింది. ఈ నివేదికను అందుకున్న తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు.. దీనిపై క్రస్ట్‌గేట్ల నిపుణులతో అధ్యయనం చేయించాలని, గత ఏడాది డిసెంబరు ఆఖరులోగా డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్(డీపీఆర్) తయారు చేయించాలని నవంబరులోనే నిర్ణయించింది. అయితే.. నెలలు గడిచిపోతున్నా గేట్ల నిపుణులతో అధ్యయనం చేయించలేదు. కనీసం కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో కొత్త గేటు ఏర్పాటు చేయలేదు. మరోవైపు.. వర్షాకాలం ప్రారంభమయ్యేందుకు నాలుగు నెలలే గడువుంది. అప్పటిలోగా అయినా గేటు ఏర్పాటు చేయాలని జలవనరుల నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే, 2009లో వచ్చిన భారీ వరదలు పోటెత్తితే డ్యాం భద్రతకే ముప్పు ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వం, తుంగభద్ర బోర్డు అధికారులు స్పందించి గేట్ల ఏర్పాటుపై తక్షణ చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు.

నెలలు గడిచినా నిదానమే!

డ్యాం 19వ నెంబరు గేటు కొట్టుకుపోయి ఆరు నెలలు పూర్తయ్యాయి. బజాజ్ కమిటీ నివేదిక బోర్డుకు చేరి ఐదారు నెలలు కావస్తోంది. క్రస్ట్‌గేట్ల నిపుణులతో అధ్యయనం చేయించి నివేదిక తెప్పించాలని తీర్మానించి కూడా 4 నెలలు అవుతోంది. అయినప్పటికీ గేట్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోలే దు. మరోవైపు, జంషెడ్‌పూర్‌లో సీడబ్ల్యూసీ పర్యవేక్షణలో కొనసాగుతున్న సంస్థకు చెందిన క్రస్ట్‌గేట్ల నిపుణులతో అధ్యయనం చేయించాలని బోర్డులో చర్చ జరుగుతోంది. పోనీ ఆ దిశగా అయినా చర్యలు తీసుకుంటున్నారా? అంటే అదీ లేదు.

పొంచి ఉన్న ముప్పు!

తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో తాత్కాలికంగా స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ వేశారు. ఈ నేపథ్యంలో తక్షణమే కొత్త గేటు ఏర్పాటు చేస్తామని అప్పట్లో ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు ప్రకటించాయి. నెలలు గడిచినా గేటు ఏర్పాటుపై అడుగులు పడడం లేదు. ఇదిలావుంటే, మరో నాలుగు మాసాల్లో(జూన్) డ్యాంకు వరద ప్రారంభమవుతుంది. ఇప్పటికీ గేట్ డిజైన్, డీపీఆర్ తయారు కాలేదని స్పష్టమవుతోంది. ఇప్పటికే డిజైన్, డీపీఆర్ తయారీ, బోర్డు అప్రూవల్, టెండర్లు, కాంట్రాక్ట్ సంస్థలో ఒప్పందం వంటి ప్రక్రియలు పూర్తి చేసి ఉంటే.. తాత్కాలిక స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ తొలగించి సకాలంలో కొత్త గేటు ఏర్పాటు చేసే అవకాశం ఉండేది. టీబీపీ బోర్డు సెక్రెటరీ ఒ. రామకృష్ణారెడ్డి(ఓఆర్కే రెడ్డి) సహా బోర్డు ఉన్నతాధికారులు వేగంగా నిర్ణయాలు తీసుకోకపోవడం వల్లే జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. జూన్ ప్రారంభానికి ముందే కొత్త గేటు ఏర్పాటు చేయాలని, లేదంటే మొత్తం ప్రాజెక్టుకే ప్రమాదం ముంచుకొచ్చినా ఆశ్చర్యం లేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

దుబాయిలో లోకేశ్.. జై షాతో భేటీ

తనయుడితో కలిసి క్రికెట్ మ్యాచ్ వీక్షించిన మంత్రి



దుబాయి ఇంటర్నేషనల్ స్టేడియంలో తనయుడు దేవాన్ష్‌తో మంత్రి లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఏపీలో క్రికెట్ క్రీడాభివృద్ధికి కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ జై షాతో చర్చించినట్లు మంత్రి నారా లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తన కుమారుడు దేవాన్ష్‌తో కలిసి లోకేశ్ ఆదివారం దుబాయి ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగుతున్న ఇండియా, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ జై షాతో లోకేశ్ కొద్దిసేపు భేటీ అయ్యారు. ఏపీలో క్రికెట్ క్రీడాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు లోకేశ్ పేర్కొన్నారు.



ఐసీసీ చైర్మన్ జై షాతో మంత్రి లోకేశ్

ప్రజలకు జగన్ క్షమాపణలు చెప్పాలి: ఎంపీ కలిశెట్టి



విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాలకు మాజీ సీఎం, పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి హాజరవుతారని వైసీపీ నేతలు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే అసెంబ్లీ వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రజలకు ఆయనతోపాటు, ఆ పార్టీ ఎమ్మెల్యేలు క్షమాపణలు చెప్పాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం ఇక్కడ టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రాన్ని ఐదేళ్లు పాలించిన జగన్‌రెడ్డి.. ప్రకృతి వనరులను యథేచ్ఛగా దోపిడీ చేశారని, దీనిపై అసెంబ్లీలో క్షమాపణలు చెప్పాలన్నారు. చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలకు అంతులేకుండా పోయిందని, ఈ ఇద్దరి అక్రమాలపై అసెంబ్లీలో చర్చించాలని ఆయన కోరారు.

84 ఔషధాలు నాసిరకం

» నాణ్యత పరీక్షలో విఫలం: సీడీఎస్‌సీవో

» జాబితాలో మధుమేహం, కొలెస్ట్రాల్, గ్యాస్ట్రిక్ మందులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: భారత్‌లో మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, గ్యాస్ట్రిక్ సమస్యలకు సంబంధించిన మందులను రోజూ లక్షలాది మంది వినియోగిస్తుంటారు. అయితే ఈ మందుల నాణ్యతపై సీడీఎస్‌సీవో (సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్) కొన్ని హెచ్చరికలు జారీ చేసింది. ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో వైద్యులు సాధారణంగా సూచించే స్టెరాయిడ్లు, మధుమేహం, కొలెస్ట్రాల్, ఎసిడిటీని తగ్గించే మందులతో సహా 84 బ్యాచ్‌ల ఔషధాలు నాణ్యత లేనివిగా తేలిందని వెల్లడించింది. సీడీఎస్‌సీవో కొత్త ఔషధాలు, క్లినికల్ ట్రయల్స్‌కు అనుమతిస్తుంటుంది. అలాగే ప్రతినెలా మార్కెట్ నుంచి పలు రకాల మందుల శాంపిల్స్‌ను సేకరించి పరీక్షిస్తుంటుంది. అవి నిర్ణీత ప్రమాణాలను అందుకోవడంలో విఫలమయ్యాయని తేలితే ఆ మందుల విక్రయంపై ఇలా హెచ్చరికలు జారీ చేస్తుంటుంది. ఈ క్రమంలో 2024 డిసెంబరు నాటికి వివిధ సంస్థలు తయారు చేసిన 84 బ్యాచ్‌ల మందులు నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా లేవని గుర్తించినట్టు తాజాగా వెల్లడించింది. ఈ మందులను మార్కెట్ నుంచి తొలగించేలా చూస్తామని తెలిపింది. తనిఖీల కోసం సీడీఎస్‌సీవో ఇటీవల కొత్త మార్గదర్శకాలను ప్రవేశపెట్టింది. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లందరూ నెలకు కనీసం 10 శాంపిల్స్‌ను సేకరించాలని. అలాగే శాంపిల్స్‌ను సేకరించిన రోజే వాటిని ల్యాబ్‌కు పంపేలా చర్యలు తీసుకోవాలని కొత్త మార్గదర్శకాల్లో తెలిపింది.

శ్రీశైల మల్లన్నకు చీరాల తలపాగా సిద్ధం

- అనాదిగా వస్తున్న ఆచారం
- ఈ దఫా పృథివి సుబ్బారావు దంపతులకు దక్కిన అవకాశం

చీరాల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లన్నకు మహాశివరాత్రి నాడు ధరింపజేసే తలపాగాను తయారు చేసే మహదావకాశం బాపట్ల జిల్లా చీరాల మండలం దేవాంగపురి పంచాయతీకి చెందిన పృథివి సుబ్బారావుకు దక్కింది. దశాబ్దాలుగా సుబ్బారావు పూర్వీకులే మల్లన్న తలపాగాను మగ్గంపై స్వయంగా తయారు చేసి స్వామి తలకు చుట్టే ఆనవాయితీ. ఇటీవల సుబ్బారావు తండ్రి వెంకటేశ్వర్లు అనారోగ్యంబారిన పడడంతో ఈ ఏడాది ఆ అవకాశం సుబ్బారావుకు దక్కింది. 3 నెలలు శ్రమించి 360 మూరల పొడవున్న తలపాగాను తయారు చేశారు. దాన్ని ఆదివారం సుబ్బారావు, దుర్గ దంపతులు శ్రీశైలంలోని స్వామి సన్నిధికి తీసుకెళ్లారు. పండుగ రోజు ఆలయంలో అన్ని ప్రధాన దీపాలు ఆర్పివేశాక పాగాను స్వామివారికి సుబ్బారావు చుట్టనున్నారు. శ్రీశైల మల్లన్న తలపాగాను దర్శించుకోవడం వల్ల సర్వలోపాలు, పాపాలు తొలుగుతాయని భక్తుల విశ్వాసం.





మల్లన్న పాగాకు పూజలు చేస్తున్న సుబ్బారావు దంపతులు

శ్రీశైలానికి కాలినడకన ఎంపీ శబరి

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో కొందరు భక్తులు నల్లమల అటవీ మార్గంగుండా కాలినడకన శ్రీశైలానికి చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నంద్యాల టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి కూడా భక్తులతో కలిసి నల్లమలలో కాలినడకన శ్రీశైలం దేవస్థానానికి బయల్దేరారు. ఆమె వెంట భద్రతా సిబ్బంది, అనుచరులు ఉన్నారు.



అటవీ ప్రాంతంలో కాలి నడకన శ్రీశైలానికి వెళ్తున్న శబరి

ఒక్క రోజుతో సరి?

- అనర్హత వేటు తప్పించుకోవడానికే!!
- గవర్నర్ ప్రసంగానికి హాజరు
- బడ్జెట్ సమావేశాలకు రావడంపై స్పష్టత ఇవ్వని ముఖ్య నేతలు

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే శాసనసభకు హాజరవుతానని ప్రకటించారు.. అసెంబ్లీకి రాకపోతే శాసనసభ్యత్వాన్ని రద్దు చేసుకోవాలని సవాల్ విసిరారు.. శాసనసభాపక్ష నేతతో సమానంగా ప్రజా సమస్యలపై గళమెత్తేందుకు సమయం ఇవ్వాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడిని డిమాండ్ చేశారు.. వీటిలో ఏ ఒక్కటీ జరిగే అవకాశం లేదని తెలిసినా.. ఇప్పుడు సోమవారం ప్రారంభమయ్యే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరవ్వాలని వైసీపీ పులివెందుల ఎమ్మెల్యే, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించారు. అయితే తొలిరోజు గవర్నర్ ఉభయసభనుద్దేశించి చేసే ప్రసంగానికి మాత్రమే హాజరవుతానని ముందే ప్రకటించారు. ప్రసంగం పూర్తయ్యేంత వరకు సభలోనే ఉంటారా.. మధ్యలోనే వెళ్లిపోతారో వైసీపీ వర్గాలు స్పష్టత ఇవ్వలేదు. మంగళవారం కడపకు వెళ్తారని మాత్రం ఆ పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు. అంటే మొదటి రోజు మాత్రమే వచ్చి ఆ తర్వాత సమావేశాలకు దూరంగా ఉంటారని అవగతమవుతోంది. వరుసగా ఆరు నెలలు హాజరు కాని సభ్యులపై అనర్హత వేటు పడే ప్రమాదం ఉంది. అది తప్పించుకోవడానికే ఆయన, ఎమ్మెల్యేలు ఒకరోజు సభకు వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సోమవారం తాడేపల్లి ప్యాలెస్‌లో వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ భేటీ అవుతారు. సమావేశాల్లో లేవనెత్తాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేస్తారు. అనంతరం వారితో కలిసి అసెంబ్లీ ఫైర్ ఆఫీసు వరకు వాహనాల్లో వస్తారు. అక్కడి నుంచి కాలినడకన నాలుగో గేటు గుండా అసెంబ్లీ ప్రాంగణంలోకి వెడతారని వైసీపీ వర్గాలు తెలిపాయి. అలాగే బడ్జెట్ సమావేశాలకు జగన్ కూడా వస్తారా.. ఎమ్మెల్యేలను మాత్రమే పంపుతారా.. లేదంటే అందరూ మూకుమ్మడిగా డుమ్మా కొడతారా అనేదానిపై ముఖ్య నేతలు స్పష్టత ఇవ్వడం లేదు.



నెల్లూరులో నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో బీద రవిచంద్ర, బీద మస్తాన్‌రావు తదితరులు

నూతన వధూవరులకు చంద్రబాబు ఆశీస్సులు

- నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో వివాహ వేడుకలకు హాజరైన సీఎం

నెల్లూరు, తిరుపతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో జరిగిన రెండు వివాహ వేడుకలకు హాజరయ్యారు. నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర కుమారుడు బీద గోకుల రిష్వంత్-దివిజ వివాహానికి సీఎం హాజరై నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించారు. మధ్యాహ్నం 1.15 గంటలకు నెల్లూరుకు విచ్చేసిన చంద్రబాబుకు హెలిప్యాడ్ వద్ద మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ నేతలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డుమార్గాన వివాహ వేదిక వద్దకు చేరుకోగా, అక్కడ ఎంపీ బీద మస్తాన్‌రావు, వారి కుటుంబ సభ్యులు సాదర స్వాగతం పలికారు. అనంతరం, మధ్యాహ్నం 2.15 గంటలకు సీఎం తిరుగుపయనమయ్యారు. అంతకుముందు చంద్రబాబు తిరుపతి జిల్లా రేణిగుంట మండలం తూకివాకం సమీపంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ తనయుడు సుదర్శన్ యాదవ్ వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులు సుదర్శన్ యాదవ్, పూజను ఆశీర్వదించారు.



తిరుపతి జిల్లాలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ ఇంట నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న సీఎం చంద్రబాబు

అసెంబ్లీకి కట్టుదిట్టమైన భద్రత

- మంత్రుల పీఏలకు అనుమతి లేదు
- సీఎంను కలిసేవారూ సీఎంవోకే వెళ్లాలి: అయ్యన్న

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. సోమవారం సభలో గవర్నర్ ప్రసంగం ఉంటుందని, సభ్యులందరూ 9.30 గంటలకు హాజరు అవుతారని తెలిపారు. బడ్జెట్ సమావేశాలకు ఎమ్మెల్యేలు, అధికారుల వ్యక్తిగత సహాయకులకు(పీఏ) పాసులు ఇవ్వడం లేదని చెప్పారు. దీంతో వారికి సభా ప్రాంగణంలోకి ప్రవేశం ఉండదని, సభ్యులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సీఎం చంద్రబాబును కలిసేందుకు వచ్చేవారు, ఇతర ప్రతినిధులను కూడా అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతించబోమన్నారు. ఈ నేపథ్యంలో సీఎంను కలుసుకునేవారు ముఖ్యమంత్రి కార్యాలయానికే వెళ్లాలని సూచించారు. శాసనసభ భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పోలీసు అధికారులకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశాల సమయంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియా పాయింట్, కొత్తగా నిర్మిస్తున్న క్యాంటిన్‌ను స్పీకర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పక్కన డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు

అసెంబ్లీలో ప్రజా వాణీ వినిపిద్దాం

- జనసేన ఎమ్మెల్యేలకు పవన్ దిశానిర్దేశం

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో జనసేన సామాన్యుడి గొంతుగా ఉండాలని ఆ పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రజా సమస్యలతో పాటు వారి ఆకాంక్షలను చట్టసభలో వినిపించేలా పార్టీ సభ్యులు చర్చల్లో పాల్గొనాలని దిశానిర్దేశం చేశారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన శాసనసభాపక్ష సమావేశం జరిగింది. పవన్ మాట్లాడుతూ శాసన సభ సంప్రదాయాలు, మర్యాదను కాపాడుతూ హుందాగా వ్యవహరిద్దామని చెప్పారు. చట్టసభల్లో మాట్లాడే భాష, వాడే పదాల విషయంలో సభ్యులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వైసీపీ వాడిన దిగజారుడు భాష వద్దన్నారు. వైసీపీ సభ్యులు అసభ్య పదజాలంతో రెచ్చగొట్టినా సంయమనం పాటించాలన్నారు. భాష విషయంలో నాదెండ్ల మనోహర్, మండలి బుద్ధప్రసాద్, హరిప్రసాద్ మార్గనిర్దేశం చేయాలన్నారు. అసెంబ్లీలో ప్రతి నిమిషం ఎంతో విలువైందని, ప్రజలకు సంబంధించిన అంశాలను జీరో అవర్, ప్రశ్నోత్తరాల సమయంలో లేవనెత్తాలని పవన్ సూచించారు. బడ్జెట్‌ను అధ్యయనం చేయాలన్నారు. ప్రభుత్వ రాబడులు, ఖర్చులు, శాఖల వారీగా కేటాయింపులు, అప్పులు ఇతరత్రా అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. నియోజకవర్గాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని, రాష్ట్ర వ్యాప్తంగా ఆ తరహా సమస్యలను క్రోడీకరించి మాట్లాడాలన్నారు. దాని వల్ల ప్రతి సభ్యుడి గొంతు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ అర్థమవుతుందన్నారు. ఈ సమావేశంలో పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పాల్గొన్నారు. అంతకు ముందుగా పార్టీ పీఏసీ చైర్మన్, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ స్వాగత ఉపన్యాసం చేశారు.



92 టన్నుల రేషన్ బియ్యం సీజ్

- కాకినాడ పోర్టు చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్న అధికారులు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులో బొంబాయి కాటావద్ద అధికారులు 92 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. అనకాపల్లి నుంచి కాకినాడ పోర్టుకు నాలుగు లారీల్లో ముడి బియ్యం వచ్చింది. ఒక్కొక్క లారీలో 25 మెట్రిక్ టన్నుల నుంచి 14 మెట్రిక్ టన్నుల వరకు బియ్యం లోడ్ ఉంది. బొంబాయి కాటా వద్ద అధికారులు లారీలను క్షుణ్ణంగా పరిశీలించారు. రారైస్‌లో కెర్నెల్స్ ఉన్నాయనే అనుమానంతో పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించగా, పీడీఎస్(రేషన్) బియ్యంగా నిర్ధారించారు. ఈ నేపథ్యంలో వాటిని సీజ్ చేసి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా 6(ఏ)కేసు నమోదు చేశారు. లారీలను పోర్టు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 92 మెట్రిక్ బియ్యాన్ని ప్రభుత్వ గోదాంలో భద్రపర్చారు. దీనిపై కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ యాంకరేజ్ పోర్టుతోపాటు కాకినాడ సీపోర్టుల్లో చెక్‌పోస్టుల వద్ద అధికారులు నిఘా పెంచారు. కాకినాడ పోర్టు లోపలికి వెళ్లే ప్రతి బియ్యం లారీని తనిఖీ చేస్తున్నారు.

గౌరవ.. సభ!

(మొదటి పేజీ తరువాయి)

అడుగు పెట్టారు. అటు... జగన్ మాత్రం తనకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే సభకు వస్తామంటూ భీష్మించుకు కూర్చున్నారు. అనర్హత వేటు భయంతో సోమవారం మాత్రం వైసీపీ సభ్యులు సభకు వస్తున్నారు. ఆ తర్వాతి సంగతిపై స్పష్టత లేదు.

ఎన్నెన్ని రోజులు...

గతంలో శాసనసభ సమావేశాలు ఏటా సగటున 60 రోజులపాటు జరిగేవి. బడ్జెట్ సమావేశాలు 30 రోజుల దాకా నిర్వహించేవారు. అన్ని అంశాలు చర్చకు వచ్చేవి. బడ్జెట్ సమావేశాల్లో పద్దులపై చర్చ సందర్భంగా ఆయా రంగాలపై లోతైన చర్చ జరిగేది. విపక్షాల వాదనలు, ప్రభుత్వం తరఫు సమాధానంతో సంబంధిత శాఖకు సంబంధించిన సమగ్ర చిత్రం ఆవిష్కృతమయ్యేది. కానీ... ఇప్పుడు చిత్రం మారిపోయింది. రానురాను 'సభా సమయం' చిక్కిపోతూ, మొక్కుబడి తంతులామారింది. జగన్ హయాంలో ఏడాదికి 30-40 రోజులు జరిగితేనే గొప్ప అన్నట్లుగా తయారైంది. బడ్జెట్ సమావేశాల విషయంలో వ్యవహరించాల్సిన సంప్రదాయాలను అటకెక్కించారు. గత ఐదేళ్ల పద్దులపై చర్చే జరగలేదు. అన్నీ గెలిటిన్ చేసి ఆమోదించడమే! ఇక... శాఖల సంగతులు ప్రజలకు తెలిసేదెలా? ఈ నేపథ్యంలో కూటమి సర్కారు అసెంబ్లీ సమావేశాల రోజులను పెంచాలని... బడ్జెట్ సమావేశాల్లో పద్దులపై సమగ్ర చర్చకు ఆస్కారం కల్పించాలని ప్రజాస్వామ్య వాదులు కోరుకుంటున్నారు.

ఆత్మస్తుతి... పరనింద!

జగన్ హయాంలో అసెంబ్లీని 'ఆత్మస్తుతి... పరనింద'కు వేదికగా మార్చేశారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా... 'అభినవ అంబేడ్కర్... నేటి గాంధీ' అని జగన్‌ను కీర్తించేందుకు వైసీపీ సభ్యులు, మంత్రులు పోటీపడ్డారు. ప్రశ్నోత్తరాలు అంతంత మాత్రమే! ఇక జీరో అవర్ మొక్కుబడిగా సాగేది. చాలా మంది వైసీపీ సభ్యులే 'ఇదేం సభ' అని అంతర్గత చర్చల్లో వాపోయే వారు. ప్రస్తుతానికి వైసీపీ సభ్యులు శాసనసభ సమావేశాలకు పూర్తిగా హాజరయ్యే అవకాశం కనిపించడంలేదు. వచ్చినా... ఉన్నదే 11మంది కాబట్టి సభకు అంతరాయం కల్పించే స్థాయిలో 'ఆందోళనలు' చేయలేరు. ఈ నేపథ్యంలో అసెంబ్లీని పూర్తిస్థాయిలో అర్థవంతంగా నడిపించే బాధ్యత కూటమి సర్కారుపై పడింది. బడ్జెట్ సమావేశాలు 20 పనిదినాలు జరిగే అవకాశముండటంతో ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్యను స్పృశించే అవకాశం ఉంది. గతంలో ఎమ్మెల్యేలు తమ ప్రాంత సమస్యలను సభలో చెప్పేందుకు అవకాశం ఇచ్చేవారు. ఇప్పుడు కూడా ప్రతి ఎమ్మెల్యేకు తన నియోజకవర్గ సమస్యలు సభ దృష్టికి తెచ్చి పరిష్కరించే అవకాశం కల్పించాల్సి ఉంది. సోమవారం, మొదటిరోజు గవర్నర్ ప్రసంగం ఉంటుంది. ఆ తర్వాత గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ చేపడతారు. దీనిని గతంలోలాగా ముఖ్యమంత్రిని కీర్తించే కార్యక్రమంలా మార్చకుండా అసలు వాస్తవాలు వివరించేలా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు.

నాడు జరిగిందిలా..

అసెంబ్లీ సమావేశాల విషయంలో గత వైసీపీ ప్రభుత్వం అంతకు ముందు ఉన్న సభా సంప్రదాయాలను పూర్తిగా పక్కనపెట్టింది. సభను దారిలో పెట్టాల్సిన స్పీకర్ సైతం జగన్ కనుసైగలతో ఓ పార్టీ సభలాగా నిర్వహించారు. సభలో అప్పటి ప్రతిపక్ష టీడీపీ సభ్యులెవరైనా ప్రజా సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తినప్పుడల్లా ఎదురుదాడికి దిగేవారు. బూతులు, దూషణలు, అవహేళనలతో సభా మర్యాదను మంటగలిపారు. కుటుంబ సభ్యులను, మహిళలను కించపరిచేలా దూషించారు.

ఎన్నో కీలకాంశాలు...

1 పలు పథకాలు నిధులు లేక నీరసిస్తున్నాయి. వాటికి జవసత్వాలు కల్పించేలా చర్చకు, చర్యలకు అసెంబ్లీని ఉపయోగించుకోవాలి.

1 కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత ప్రభుత్వం తాలూకా పలు చట్టాలను రద్దు చేసి, మార్పులకు శ్రీకారం చుట్టింది. ఆ వివరాలను, అవసరాన్ని ప్రజలకు వివరించాలి.

1 ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని మళ్లీ గాడిలో పెట్టడానికి పలు విజన్‌లను రూపొందించారు. మరీముఖ్యంగా 'స్వర్ణాంధ్ర - 2047' ఉద్దేశాలు, లక్ష్యాలు ప్రజలకు అర్థమయ్యేలా వివరించేందుకు అసెంబ్లీని ఉపయోగించుకోవాలి.

1 రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన, లక్షలాది మంది రైతులను ఇక్కట్లలోకి నెట్టిన రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మార్గం కనుక్కోవాలి.

యాదగిరీశుడికి స్వర్ణ గోపుర శోభ

- 50.5 అడుగుల ఎత్తైన పంచతల గోపుర.. తాపడానికి.. 68కిలోల పసిడి వినియోగం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని యాదగిరిగుట్టపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి బంగారు గోపుర ఆవిష్కరణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వేడుకల్లో భాగంగా యాగశాలలో నిర్వహించిన మహాపూర్ణాహుతిలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. 50.5 అడుగుల ఎత్తు, 10.759 చదరపు అడుగుల వైశాల్యంలో ఉన్న బంగారు విమాన గోపురానికి స్వర్ణతాపడం చేసేందుకు.. 68 కిలోల బంగారాన్ని వినియోగించారు.



కేంద్ర బడ్జెట్‌లో.. రాష్ట్రానికి భారీగా నిధులు: శ్రీనివాసవర్మ



విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రయోజనాలకు కాకుండా దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చి కేంద్ర బడ్జెట్‌లో కీలక రంగాలకు కేటాయింపులు చేశామని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. రాష్ట్రంలో కీలక ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖలో నిర్వహించిన మేధావుల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. రాష్ట్రంలో రైల్వే అభివృద్ధి పనులకు భారీగా నిధులు మంజూరు చేశామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె నోటీసుపై వారితో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రకటించాక మంచి ఫలితాలు వస్తున్నాయని, గతంలో ఆగిన రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ఇప్పుడు పూర్తిస్థాయిలో పని చేస్తున్నాయని.. జూన్ నాటికి మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తి ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఉద్యోగుల జీతాల సమస్య మరి కొద్ది రోజుల్లో పరిష్కారమవుతుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠం నేర్పని పాపాలు

(మొదటి పేజీ తరువాయి)

పయనిస్తోంది. నాడు ఒక గ్రామంలో పైలట్ ప్రాజెక్టు చేపడితే... కూటమి సర్కారు ఏకంగా 670 గ్రామాల్లో చేస్తోంది. జగన్ జమానాలో రీ సర్వే చేసింది ఇప్పుడున్న రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బందే. మళ్లీ ఇప్పుడు సర్వే చేస్తోంది కూడా వారే. మారిందల్లా ప్రభుత్వం మాత్రమే. పాత తప్పులు కళ్లెదురుగా పెట్టుకుని... కూటమి ప్రభుత్వం అదే పనిచేసి సాధించేదేమిటో? రెవెన్యూ వ్యవస్థలో గుణాత్మకమైన మార్పు తీసుకురాకుండా అదే అధికారులతో భూ వివాదాలు ఎలా పరిష్కరిస్తుంది? అన్నది సామాన్య రైతులు, నిపుణుల ప్రశ్న. జగన్ సర్కారు నిర్వాకం వల్ల రైతుల సమస్యలు లక్షల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతి రైతు సమస్యను పరిష్కరించాలంటే మళ్లీ సర్వే చేయాలి. కొలతలు వేశాక రైతులు ఆమోదించాలి. మళ్లీ చట్టబద్ధమైన వివిధ నోటిఫికేషన్లు ఇవ్వాలి. జగన్ రీసర్వే చేయించిన 8,680 గ్రామాల్లో భూ వివాదాలు పరిష్కరించాలి. దీనికి ఎంత సమయం పడుతుందో.. ఎప్పటికి పూర్తవుతుందో అంచనా వేయడం కష్టం. భూముల వద్దకు అధికారులను పంపించి ఒక్కో కేసును నిశితంగా పరిశీలించి పరిష్కరించాలి. ప్రభుత్వం వీటిపై దృష్టిసారించకుండా జగన్ బాటలో రీ సర్వే చేపట్టడం విమర్శలకు దారితీస్తోంది.

వెంటాడుతున్న జగన్ తప్పులు: గత జగన్ సర్కారు కృష్ణాజిల్లా తక్కెళ్లపాడులో రీసర్వే పైలట్ ప్రాజెక్టు చేపట్టారు. 1500 ఎకరాలున్న చిన్న గ్రామంలోనే విజయం సాధించలేకపోయారు. అయినా తర్వాత 8,680 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేయించారు. 3.80 లక్షల మంది రైతులకు కొత్తగా భూ వివాదాలు సృష్టించారు. దాని ప్రభావం వైసీపీ సర్కారుపై గట్టిగానే పడింది. రైతుల సమస్యలను గ్రహించిన టీడీపీ అధికారంలోకి వస్తే భూ వివాదాలు తీరుస్తామని చెప్పింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత... గతంలో రీసర్వే చేపట్టిన 8,680 గ్రామాల్లో సభలు నిర్వహిస్తే 2.60 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. రెవెన్యూ సదస్సుల్లో మరో 2.80 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ప్రభుత్వానికి వివిధ రూపాల్లో 7.60 లక్షల ఫిర్యాదులు అందాయి. అందులో ఒక్క రీ సర్వేపై వచ్చినవే 3.80లక్షలు ఉన్నాయి. అంటే.. ప్రభుత్వం పరిష్కరించాల్సిన ప్రజాసమస్యల్లో సింహభాగం జగన్ సర్కారు చేసిన తప్పిదాలతో వచ్చినవే. నాలుగైదు నెలల్లోనే 80శాతం ఫిర్యాదులు పరిష్కారించామని రెవెన్యూ శాఖ చెబుతోంది. అయితే నిజంగా సమస్యలను పరిష్కరిస్తే రైతులు మళ్లీ ఎందుకు ఫిర్యాదు చేస్తారన్నది ప్రశ్న. రెవెన్యూ అధికారుల డొల్ల నివేదికపై నిపుణులు, చట్టాలు, విధానాలపై అవగాహన ఉన్నవారు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కానీ సర్కారుకు ఏమాత్రం సందేహం రాకపోవడం విచిత్రం.

రీ సర్వే ఆపేసి.. మళ్లీ ప్రారంభం

ఏదైనా విధానపరమైన నిర్ణయం తీసుకుంటే క్షేత్రస్థాయిలో పనిచేసేది అధికారులనే ప్రభుత్వం నమ్మాలి. జగన్ ప్రభుత్వం అధికారులను నమ్ముకొని సర్వేను స్వకార్యంగా మార్చుకుంది. మాటవినని రాజకీయ ప్రత్యర్థులు, పేద రైతులు, సామాన్యుల భూ రికార్డులను తారుమారు చేశారు. జగన్ సర్కారు నిర్వాకం వల్ల లక్షలాది మంది బాధితులుగా మారారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు ఈ సమస్యలన్నీ తెలుసు. జగన్ సర్కారు రీ సర్వే పేరిట దారుణాలు చేసిందని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే రీసర్వేను, పాసు పుస్తకాలను ఆపేశారు. సరిహద్దు రాళ్లపై జగన్ బొమ్మలను తొలగిస్తున్నారు. కానీ అధికారులు చెప్పారంటూ మళ్లీ రీసర్వే ప్రారంభించారు. 670 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు. అంటే... పాత సమస్యలు పరిష్కరించకుండా, మళ్లీ రీ సర్వే పేరిట కొత్తగా లక్షల సమస్యలు సృష్టించేందుకు సిద్ధమయ్యారా? ఇదంతా ముఖ్యమంత్రికి తెలిసే జరుగుతోందా? అన్న అనుమానాలు సగటు రైతు నుంచి వ్యక్తమవుతున్నాయి.

మోదీని చూసి నేర్చుకోవాలి

గతంలో గుజరాత్‌లో మోదీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రీ సర్వే చేపట్టాక, తప్పని తెలుసుకొని ప్రాజెక్టును రద్దు చేశారు. అనంతరం సీఎంగా గెలిచారు. ప్రధాని హోదాలో రైతు వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చిన తర్వాత తప్పు తెలుసుకొని వాటిని రద్దు చేశారు. ఆ తర్వాత మళ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. వీటి నుంచి కూటమి ప్రభుత్వం ఎందుకు గుణపాఠాలు నేర్చుకోదు? ఉన్న సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. రీ సర్వే పేరిట మళ్లీ కొత్త సమస్యలు రావాలని కోరుకోవడం లేదు. అయినా రీ సర్వే చేయాలని ప్రభుత్వం ఎందుకు ఆరాటపడుతోంది? అధికారుల మాట నమ్మితే సీఎం రైతు వ్యతిరేకత మూటగట్టుకుంటారు.

- రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు

బలవంతంగా రుద్దొద్దు

జగన్ సర్కారు ప్రారంభించిన రీసర్వే రైతులకు సమస్యలు తీసుకొచ్చింది. అందుకే 2019 తర్వాత ఎలాంటి లావాదేవీలు జరగని భూములకు సంబంధించి పాత రికార్డులను పునరుద్ధరించాలి. సర్వే, సరిహద్దు సమస్యలు పరిష్కరించాలి. అంతేకానీ, ఎవరూ కోరని రీ సర్వేను రైతులపై బలవంతంగా రుద్దొద్దు.

- రెవెన్యూ నిపుణుడు రామయ్య

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.